అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదివారం 20-10-2024

సంపుటి : 10 సంచిక : 291 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00

కబ్జాదారులకే కూల్చివేతల భయం



బడాబాబుల పాలిట హైడ్రా అంకుశం

పేదలకు మేలు జరిగితే ఓర్వలేకపోతున్నారు

నిరుపేదలకు మంచి భవిష్యత్ అందించాలనే మూసీ పునరుజ్జీవం

హరీశ్ నీవు కాదు..

ఫామ్‌హౌస్‌లో పడుకున్న వాళ్లను రమ్మను

రాజీవ్ సద్భావన యాత్ర సంస్మరణ దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

14లో..

మా జీవితాలు బుగ్గిపాలు చేయొద్దు



అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ రోడ్డెక్కిన విద్యార్థులు

వేలాది మంది భారీ ప్రదర్శన

13లో..

డిసెంబర్‌లోపు రెండు లక్షల రుణమాఫీ



అంత కంటే ఎక్కువ అప్పున్న రైతులకు షెడ్యూల్

వానాకాలం నుంచి రైతు భరోసా

పంటల బీమా కోసం త్వరలో టెండర్లు : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

5లో..

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న కొంతమంది కాంట్రాక్టు అధ్యాపకులకు అర్హతలున్నప్పటికీ ...13లో

గ్రూప్-1 మెయిన్స్‌కు సిద్ధమవ్వండి

మా పరీక్షా విధానాన్ని కోర్టులూ సమర్థించాయి

అభ్యర్థులకు సీఎం రేవంత్ పిలుపు

డ్రగ్స్, సైబర్ నేరాలను ఉక్కుపాదంతో అణచివేయండి

పోలీసు పిల్లలకు కార్పొరేటు స్థాయిలో విద్యాసంస్థలు : పోలీస్ డ్యూటీ మీట్‌లో సీఎం



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు అభ్యర్థులు సిద్ధం కావాలనీ, తాము నిర్వహిస్తున్న ఈ పరీక్షా విధానాన్ని హైకోర్టు కూడా సమర్థించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. హిమాయత్ సాగర్‌లోని ఆర్‌బీవీఆర్ పోలీసు అకాడమీలో రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. తమ రాజకీయ స్వార్థానికి విపక్షాలు టీజీపీఎస్సీ అభ్యర్థుల్లో అపోహలు సృష్టించే విధంగా ఉద్యమాలను నిర్వహిస్తున్నాయనీ, వారి ఉచ్చులో చిక్కితే అభ్యర్థులు నష్టపోయే ప్రమాదమున్నదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. గత ఫిబ్రవరి నెలలోనే నోటిఫికేషన్ జారీ చేసిన సమయంలోనే 1:50 దామాషా కింద మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక జరిగిందనీ, ఆ సమయంలోనే 1:100 దామాషా కింద సెలక్షన్ జరగాలని కోరి ఉంటే పరిశీలించేవారమని ఆయన తెలిపారు. ఈ విధానం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఎలాంటి నష్టం వాటిల్లదని ఆయన స్పష్టం చేశారు. తాము పాలించిన పదేండ్లలో గ్రూప్-1 పరీక్షను నిర్వహించని ప్రతిపక్షం.. ఈ కీర్తి కాంగ్రెస్‌కు ఎక్కడ దక్కుతుందోనన్న దుగ్ధ, అసూయలతో అభ్యర్థుల్లో గందరగోళాన్ని సృష్టిస్తోందనీ, వీరి కుట్రలను గ్రహించాలని ఆయన అన్నారు. ఇప్పటికే 95 శాతం మంది అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారనీ, మిగతావారు కూడా అందుకు సిద్ధమై పరీక్ష రాయాలని రేవంత్‌రెడ్డి సూచించారు. తాము అధికారంలోకి వచ్చాక 15వేల పోలీసు ఉద్యోగాలు, 16,037 ఇంజినీర్ ఉద్యోగాలు, 11వేలకు పైగా డీఎస్సీ టీచర్లను నియమించామని ఆయన అన్నారు.

ఆందోళనలో పాల్గొంటున్న అభ్యర్థులపై లాఠీచార్జి చేయటం కానీ, వారిపై కేసులు నమోదు చేయటం కానీ చేయరాదని ఆయన పోలీసు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డ్రగ్స్, సైబర్ నేరాల నిరోధానికి పోలీసు అధికారులు ఉక్కు సంకల్పంతో వ్యవహరించాలనీ, ఈ విషయంలో ఎంతటివారినైనా ఉపేక్షించరాదని సీఎం అన్నారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దుల నుంచి వేలాది కిలోల గంజాయి రాష్ట్రంలోకి వస్తున్నదనీ, దీనిని మార్గమధ్యలోనే జిల్లాల పోలీసులు ...14లో



(ఫైల్)

గ్రూప్-1కు సర్వం సిద్ధం

రేపటి నుంచి పరీక్షలు ప్రారంభం

హెచ్ఎండీఏ పరిధిలో 27 వరకు నిర్వహణ

46 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

మధ్యాహ్నం ఒకటిన్నరకే గేట్లు మూసివేత

ఆ తర్వాత వచ్చే వారికి అనుమతిలేదు

హాజరుకానున్న 31,383 మంది అభ్యర్థులు

వివరాలు 13లో

ఒకే దేశం-ఒకే ఎన్నిక రాజ్యాంగబద్ధం కాదు

అది బీజేపీ-ఆర్ఎస్ఎస్ లేవనెత్తిన బలహీన నినాదం

ప్రశ్నించే సోషల్ మీడియా గొంతుల కట్టడికే బ్రాడ్‌కాస్టింగ్ బిల్

రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక సదస్సులో న్యూస్‌క్లిక్ ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'ఒకే దేశం-ఒకే ఎన్నిక' రాజ్యాంగబద్ధం కాదని న్యూస్‌క్లిక్ ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థ అన్నారు. ఇటీవలి కాలంలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఎత్తుకున్న అతి బలహీన నినాదాల్లో ఇదీ ఒకటి అని విశ్లేషించారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యాన శనివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా మాట్లాడారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లు 800 ఏండ్ల తర్వాత భారతదేశంలో హిందూ రాజ్యం ఏర్పడినట్టు చెప్తున్నాయనీ, వారి టార్గెట్ అప్పటి మొఘలాయిలు మొదలు ముస్లిం రాజులేనని చెప్పారు. బ్రిటీష్ పాలనను ఆర్ఎస్ఎస్ వ్యతిరేకించలేదని గుర్తుచేశారు. ఇప్పుడు హిందీని జాతీయ భాషగా గుర్తించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భావిస్తున్నదనీ, కానీ భిన్న భాషలు, జాతులు, కులాలు, మతాలు, సంస్కృతులు, సాంప్రదాయాలు ఉన్న భారతదేశంలో ఇది సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఏజాతికి ఆ భాష గొప్పదని ఉదహరించారు. ఆర్ఎస్ఎస్ అధికారిక పత్రిక ఆర్గనైజర్‌లోని వ్యాసాలను చదివితే వారి విషప్రచారం అర్థమవుతుందన్నారు. మనుస్మృతిని రాజ్యాంగంగా ఆమోదించుకోవాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఆరాటపడుతున్నాయని తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని సమర్పించే సమయంలోనే ఆర్ఎస్ఎస్ ఈ వ్యతిరేకతను వెల్లడించిందన్నారు. కుల, మత, వర్ణ, వర్గభేదం లేకుండా అందర్నీ ఏకం చేస్తూ ...6లో



రైతుభరోసా ఇవ్వకుండా మోసం చేస్తారా?

మంత్రి తుమ్మల ప్రకటనపై కేటీఆర్ ఆగ్రహం

వెంటనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా వేయాలి

నేడు అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు

రేవంత్ సర్కార్ రైతు వ్యతిరేక విధానాలు ఎండగడదాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాతే రైతు భరోసా ఇస్తామంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన ప్రకటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి తుమ్మల తన ప్రకటన ద్వారా వర్షాకాలం సీజన్ రైతు భరోసాను ఎగ్గొట్టినట్టేనని చెప్పారు. ఇది కచ్చితంగా రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేయటమేనని కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యకు నిరసనగా ఆదివారం అన్ని మండల కేంద్రాల్లో నిరసన చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి సర్కార్ రైతు వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రైతుబంధును పూర్తిగా ఎత్తి వేసే కుట్రలో భాగంగానే రైతుభరోసా పేరుతో క్యాబినెట్ సబ్ కమిటీ, కొత్త మార్గదర్శకాలు అంటూ డ్రామా చేస్తున్నారని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి సర్కార్ ...13లో

జీవో 29 రద్దు చేయండి

కదం తొక్కిన నిరుద్యోగులు | చలో సెక్రెటేరియట్‌కు పిలుపునిచ్చిన కేంద్ర మంత్రి బండి

- తెలుగుతల్లి ఫ్లైఓవర్ వద్ద అడ్డుకున్న పోలీసులు
- నిరుద్యోగులకు మద్దతు తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు
- గో బ్యాక్ అంటూ బీజేపీ కార్యకర్తల నినాదాలు
- ఇరు పార్టీల శ్రేణుల మధ్య తోపులాట
- దాసోజు, ఆర్ఎస్ ప్రవీణ్‌తో సహా పలువురి నేతల అరెస్టు, తరలింపు
- బండి సంజయ్‌ను బీజేపీ ఆఫీస్‌కు తరలించిన పోలీసులు
- రిజర్వేషన్లు ఎత్తేసే కుట్ర : బండి సంజయ్
- బీఆర్ఎస్ నేతలను విడుదల చేయాలి : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జీవో 29 రద్దు చేయాలనీ, గ్రూపు-1 మెయిన్స్ పరీక్ష వాయిదా వేసి సుప్రీంకోర్టు తీర్పు తర్వాతనే నిర్వహించాలని నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలు రాజకీయ రంగు పులుముకున్నాయి. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గ్రూపు-1 బాధిత అభ్యర్థులతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడారు. శుక్రవారం జరిగిన లాఠీచార్జి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిటీలైబ్రరీలో నిరుద్యోగులతో భేటీ అయ్యేందుకు బయలుదేరిన ఆయన అకస్మాత్తుగా అశోక్‌నగర్ చౌరస్తాలో రోడ్డుపై బైటాయించారు. అప్పటికే అక్కడ బీజేపీ కార్యకర్తలు, నిరుద్యోగులు పెద్దఎత్తున పోగయ్యారు. సీఎం డౌన్‌డౌన్.. జీవో 29 రద్దు చేయాలి.. గ్రూపు-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలి.. న్యాయం కావాలి' అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అదే సమయంలో చలో సెక్రెటేరియేట్‌కు తరలిరావాలని బండి పిలుపు నిచ్చారు. అయితే, నిరుద్యోగులు, బీజేపీ కార్యకర్తలు ముందుకెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. కాసేపటి తర్వాత నిరుద్యోగులు, బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని ర్యాలీగా ముందుకుసాగారు. వారిని అడ్డుకున్న పోలీసులు బండి సంజయ్‌ని తరలించేందుకు యత్నించారు. కానీ, నిరుద్యోగులు అడ్డుకున్నారు. కొద్దిముందుకు వెళ్లగానే తెలుగు తల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మరోమారు బండి సంజయ్ బైటాయించారు. ఆయనకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తోడయ్యారు. నిరుద్యోగులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, గజ్జెల నగేశ్, ముఠా జయసింహ, శ్రీనివాస్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు అక్కడకు చేరుకున్నారు. వారికి వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీనికి కొందరు నిరుద్యోగులు కూడా ...6లో



పత్తి చేలల్లో.. వాడిపోతున్న పసిమొగ్గలు

గుజరాత్‌లో అంధకారమవుతున్న బాలల భవితవ్యం

రూ. 200 కోసం కూలీలుగా గిరిజన పిల్లలు

అందులో రూ. 50 రవాణా చార్జీలకు..

ఎనిమిదేండ్లకే స్కూళ్ల నుంచి పంట పొలాల్లోకి

పిల్లల భవితను కబళిస్తున్న పేదరికం

నిస్సహాయులుగా అధికారులు

వివరాలు 3లో



ఇజ్రాయిల్ ప్రధాని నివాసమే లక్ష్యంగా డ్రోన్ దాడి

పశ్చిమాసియాలో ఉద్రిక్తత

వివరాలు 13లో



సికింద్రాబాద్‌లో ఉద్రిక్తత

ముత్యాలమ్మ ఆలయం వరకు హిందూ సంస్థల ర్యాలీ

రోడ్డుపై బైటాయించి నిరసన..

గొడవ చేసే యత్నం

అడ్డుకున్న పోలీసులు, లాఠీచార్జి

6లో..

ఆమె కోసం ఐద్వా

మహిళలకు అడుగడుగునా బాసట

- సామాజిక రుగ్మతలపై పోరాటం
- 13 జిల్లాల్లో కుటుంబ న్యాయ సలహాకేంద్రాలు
- ఎన్నెన్నో విజయాలకు వేదిక
- కొత్తగూడెంలో రేపటి నుంచి ఐద్వా రాష్ట్ర నాల్గో మహాసభలు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మహిళగా...శ్రామికురాలిగా...పౌరురాలిగా 'ఆమె' ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆవిర్భవించిందే అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా). ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వామపక్ష భావజాలం ఉన్న మహిళలతో 1946లో ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం ఏర్పాటైంది. అదీ రూపాంతరం చెంది ఐద్వాగా 1981లో అంకురార్పణ జరిగింది. ఈ రోజు మహిళలు సాధించుకున్న అనేక హక్కులు ఐద్వా పోరాట ఫలితమే. ఐపీసీ 498ఏ సెక్షన్, ఆస్తి హక్కు, జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్లు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, సమాన పనికి సమాన వేతన చట్టం, గృహ హింస వ్యతిరేక, నిర్భయ, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక, భ్రూణహత్యల నిరోధక చట్టాలు ఇలాంటివి ఎన్నో ఐద్వా పోరాట ఫలితంగా సిద్ధించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లో కుటుంబ న్యాయ సలహా కేంద్రాలను స్థాపించి బాధిత మహిళలకు అండగా నిలుస్తోంది అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం. ప్రత్యేకంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బలాత్కారానికి గురైన గిరిజన మహిళల స్థితిగతుల్లో మార్పులు తీసుకొచ్చింది. తండ్రి ఎవరో తెలియని ఆ గిరిజన బిడ్డలకు తల్లి కులం ఆధారంగా క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇప్పించి... దేశవ్యాప్తంగా ఇలాంటి స్థితి ఎదుర్కొనే మహిళలకు దిక్సూచిలా మారింది. అరకొర వేతనంతో చులకనకు గురవుతున్న అంగన్‌వాడీల జీతాలు పెంపు...ఐద్వా పోరాటాలతోనే మొదలైంది. ఐద్వా అంటే ఆమె...ఆమె అంటే ఐద్వా అనే రీతిలో మహిళా ఉద్యమాలను నిర్మిస్తూ...ఆపదలో ఉన్న స్త్రీలకు అండగా నిలుస్తోన్న ఐద్వా తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో 21, 22, 23 తేదీల్లో జరగబోతున్నాయి. ఈ తరుణంలో మహాసభ విజయవంతానికి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాసభలకు ఐద్వా జాతీయ నాయకులు బృందాకరత్ హాజరుకానున్నట్టు ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మల్లు లక్ష్మి, అరుణజ్యోతి తెలిపారు. వేలాదిమందితో 21న భారీ బహిరంగసభ జరగనుంది. మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా వెయ్యిమంది ప్రతినిధులు హాజరుకానున్నారు.



సమస్యల పరిష్కారానికి నిజాయితీగా పనిచేశా

మరో అవకాశమివ్వండి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-కాశిబుగ్గ

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి తనకు మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ...13లో

మూసీకి అడ్డుపడితే మరో ఉద్యమం



- మంత్రి కోమటిరెడ్డి హెచ్చరిక
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఫాంహౌజ్‌లను ముట్టడిస్తామని వ్యాఖ్య

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని దాదాపు కోటిమంది ప్రజల జీవితాలతో ముడిపడ్డ మూసీ శుద్ధీకరణను అడ్డుకుంటే ఆనాటి రజాకార్లపై తిరుగుబాటు, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమం మళ్లీ పునరావతం అవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి మూసీ కాలుష్యంతో నల్లగొండ జిల్లా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెబుతూ భావోద్వేగానికి లోనయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్యాయం జరిగిందనే తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి సాధించుకుంటే, గడిచిన పదేండ్లలో నల్లగొండ జిల్లాకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ప్రజలకు పోరాటాలు కొత్తకాదనీ, ఇలాగే మూసీకి అడ్డంపడితే మీ ఇండ్ల ముందు శాంతియుతంగా లక్షలమంది నల్లగొండ బిడ్డలతో కలిసి ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. మూసీకి అడ్డుపడే ప్రతి రాజకీయ పార్టీని నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్‌లో ప్రజలు నామరూపాలు లేకుండా చేస్తారని అభిప్రాయపడ్డారు. మూసీ కాలుష్యంతో ప్రజలు క్యాన్సర్, నరాల జబ్బులు, గుండె, కిడ్నీలు పాడైపోవడం, పిల్లల్లో పెరుగుదల లోపించడం, కంటి సమస్యలు, చర్మవ్యాధులతో నానా అవస్థలు పడుతున్నారని గుర్తు చేశారు. ఇంకా వాళ్లు అలాగే చచ్చిపోవాలని కేటీఆర్ కోరుకుంటున్నారా అంటూ మంత్రి ప్రశ్నించారు. కేసీఆర్ మోసాలకు ఇప్పటికే నల్లగొండ నరకయాతన పడుతున్నదనీ, ఇప్పుడు ఆయన కొడుకు మోపయ్యాడని ఆరోపించారు. ఎవరు అడ్డువచ్చినా మూసీ విషయంలో వెనకడుగు వేసే పరిస్థితే లేదని స్పష్టం చేశారు. మూసీ డీపీఆర్ చేసిన మెయిన్ హార్ట్ టీ కంపెనీ 29 దేశాల్లో అద్భుతమైన కట్టడాలను కట్టిందనీ, ఎక్కడో పాకిస్థాన్‌లో కేసు అయ్యిందన్నారు. మూసీపై అవినీతి బురదజల్లడం దారుణమని వ్యాఖ్యానించారు. కేసీఆర్ మానసపుత్రిక కాళేశ్వరం డీపీఆర్‌ను తయారు చేసిన వ్యాప్కోస్‌ను ఒరిస్సా సర్కారు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాయని గుర్తు చేశారు. కేటీఆర్ బంధువుల సంస్థ గ్లోబరిన పదుల సంఖ్యలో విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న విషయాన్ని కేటీఆర్ ప్రజలకు ఎందుకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వేసి చెప్పలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం డీపీఆర్‌కు 2015లోనే రూ. 33 కోట్లు చెల్లించారనీ, ఇప్పుడు రూ. 140 కోట్లు ఇస్తుంటే గగ్గోలు పెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

అందుకే 16 కు 16 స్థానాల్లో గుణపాఠం చెప్పారని ఎద్దేవా చేశారు. అసలు మూసీ డీపీఆర్ పూర్తికాకముందే ఎందుకు లక్షల కోట్లని ఎగిరెగిరి పడుతున్నారని ప్రశ్నించారు. కేటీఆర్, హరీశ్‌రావు అమెరికాకు పోయి ప్రభాకర్ రావును ఇండియాకు రాకుండా ఎందుకు అడ్డుపడుతున్నారో ముందు చెప్పాలని సవాల్ చేశారు. మిషన్ భగీరథలో రూ. 5 వేల కోట్లను దోచుకున్న కేసీఆర్ కుటుంబం అవినీతి వల్లే ఇప్పటికీ అనేక గ్రామాల ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లే తాగుతున్నారని ఆరోపించారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులను మార్చుకున్న వాళ్లకు ప్రతీది ఏటీఎం లాగే కనిపిస్తున్నాయని చురకలు అంటించారు. ఆ దోపిడీ యావ నుంచి బయటికి రాలేకనే అన్నిట్లో అవినీతి జరిగిందని గగ్గోలు పెడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రూ. 2 వేల కోట్లు పెట్టి తొమ్మిది కిలోమీటర్ల ఎస్ఎల్‌బీసీ సొరంగం పని పూర్తి చేస్తే ఇవ్వాలన్నారు. నల్లగొండలో పుట్టిన చిట్టి నాయుడు ఒకరు మొన్నటి ఎన్నికల్లో మూడు వేల ఓట్లతో గెలిచినప్పటికీ ఆయనకు నల్లగొండ సమస్యలు పట్టడం లేదన్నారు. బస్సు కిరాయిలు లేనోడికి ఇప్పుడు 80 ఎకరాల ఫామ్‌హౌజ్ ఉందనీ, ఉప్పల్‌లో వాటర్ ప్లాంట్ పెట్టి నడిపిన వ్యక్తి.. కేసీఆర్‌కు ఉన్నంత ఫామ్ హౌజ్ ఎట్లా వచ్చిందని ప్రశ్నించారు. అధికారం అడ్డం పెట్టుకొని రూ. పది వేల కోట్లు దోచుకున్న ఆ చిట్టినాయుడు, ఎప్పుడూ నల్లగొండ బిడ్డల బాగుకోసం పనిచేయలేదని ఆరోపించారు.

ప్రపంచానికి తలమానికం భారత ప్రజాస్వామ్యం

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికి తలమానికమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఇంజినీర్స్ భవన్‌లో జరిగిన ఫోరంఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్ఎఫ్‌జీజీ) 15వ ఆవిర్భావ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 90 కోట్ల ఓటర్లున్న ఈ దేశంలో ఎన్నికల నిర్వహణ నుంచి మొదలుకుని పాలన వరకు ఎదురయ్యే సమస్యలన్నింటినీ ఎప్పటికప్పుడు అధిగమిస్తూ దేశం అన్ని రంగాల్లో ముందుకు పోతున్నదని పేర్కొన్నారు. ఒక్క ఓటు తేడాతో అటల్‌బిహారి వాజ్‌పేయి ప్రభుత్వం పార్లమెంట్ విశ్వాస పరీక్షలో ఓడిపోయిందనీ, అందువల్ల ప్రజాస్వామ్యానికి ఎవరూ అతీతులు కారని అభిప్రాయపడ్డారు. కార్యనిర్వాహక వ్యవస్థలో మరింత పారదర్శకత రావాల్సిన అవసరముందని చెప్పారు. అందుకు, విద్యార్థులు, యువకులు, మేధావులతో పాటు మొత్తం పౌర సమాజం చొరవ చూపాల్సిన అవపసర ముందని పేర్కొన్నారు. దేశంలో, రాష్ట్రంలో సుపరిపాలన, పౌరహక్కుల రక్షణకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ చేస్తున్న సేవలు మరింతగా విస్తరించాలని ఆకాంక్షించారు. లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రజల సామాజిక స్థితిగతులను మార్చే విద్య వైద్యం ఉపాధి రంగాలపై కాకుండా పాలకవర్గాలు అనవసరమైన పథకాల పేరుతో సంపదను పక్కదారి పట్టిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లోనే మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని సూచించారు. తెలంగాణ విద్యాకమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ ఏటా రూ.18 వేల కోట్లు ఉపాధ్యాయుల జీతభత్యాలకు ఖర్చు చేస్తున్నా విద్యా ప్రమాణాలు ఎందుకు పెరగడం లేదని ప్రశ్నించారు. ఇంకా 6వేల స్కూళ్లల్లో సింగిల్ టీచర్లు కొనసాగుతుండగా, 7వేల స్కూళ్లు ఒకే ఒక్క గదిలో నడుస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యావ్యవస్థలో సమూల మార్పు రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎఫ్‌జీజీ అధ్యక్షులు ఎం. పద్మనాభరెడ్డి, కార్యదర్శి సోమ శ్రీనివాస్, మాజీ ఐపీఎస్ అధికారి అంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు

- అభిప్రాయాలు స్వీకరించిన బీసీ కమిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అమలు కోసం బీసీ కమిషన్ అభిప్రాయాలు, సలహాలు స్వీకరించింది. తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ శనివారం హైదరాబాద్‌లో బీసీ మేధావుల సమావేశాన్ని నిర్వహించింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను నిర్ణయించడంపై అభిప్రాయాలు, సలహాలను సేకరించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రిజర్వేషన్ల నిర్ధారణకు కుల సర్వే డేటా ప్రాతిపదికగా ఉండాలనీ, వారి జనాభాకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లను నిర్ధారించేందుకు, న్యాయ పరిశీలనను తట్టుకునేందుకు అధ్యయనంలో అడుగడుగునా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కుల సర్వే, సమాచార సేకరణ ప్రశ్నాపత్రం, ఎన్యూమరేటర్ల ఇంటి సందర్శన వివరాలు, సర్వే సమయంలో సరైన సమాచారం అందించాల్సిన ఆవశ్యకతపై విస్తత ప్రచారం ద్వారా సామాన్య ప్రజలకు ప్రభుత్వం అవగాహన కల్పించాలని సూచించారు. మేధావుల సూచనలను పరిగణనలోకి తీసుకుని ముందుకెళ్తామని కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్ హామీ ఇచ్చారు. ప్రముఖులు ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, జస్టిస్ చంద్ర కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, డాక్టర్ పి.వినయ్ కుమార్, ప్రొఫెసర్ కె.మురళీ మనోహర్, ప్రొఫెసర్ ఐ.తిరుమలి, ప్రొఫెసర్ సింహాద్రి, టీపీసీసీ మేధావుల సెల్ అధ్యక్షులు ఎం.శ్యామ్ మోహన్, ప్రొఫెసర్ ఎం.బాగయ్య, డాక్టర్ షేక్ అబ్దుల్ ఘని తదితర ప్రముఖ మేధావులు ఈ సమావేశంలో పాల్గొని సూచనలు చేశారు.

25 నుంచి ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర మహాసభలు

- బ్రోచర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈ నెల 25, 26 తేదీల్లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర నాలుగో మహాసభలు జరగనున్నాయని ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు పి ఉమర్ ఖాన్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల ప్రాంగణంలో మహాసభల బ్రోచర్‌ను ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు జి బాలయ్య, నాయకులు నర్సింహాలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర మహాసభలు గ్రేటర్ హైదరాబాద్ నగరంలో జరుగుతున్నాయని తెలిపారు. 2016వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టన్ని సాధించడంలో ఆ సంఘం పాత్ర చాలా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా వికలాంగుల హక్కుల సాధన కోసం, చట్టాల అమలు కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నదని చెప్పారు. వికలాంగులపై జరుగుతున్న దాడులు, వివక్షత వంటి అంశాలపై ఉద్యమాలు చేస్తోందని తెలిపారు. విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ అమలు కోసం నిరంతరం పోరాటాలు చేస్తోందని వివరించారు. మహాసభల ప్రారంభానికి మహిళా శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి డి సీతక్క, టీపీసీసీ చైర్మెన్ ముత్తినేని వీరయ్య, ఎన్‌పీఆర్‌డీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్, వర్కింగ్ ప్రెసిడెంట్ నంభు రాజన్ హాజరు అవుతున్నారని తెలిపారు.మహాసభల ప్రారంభ సభ సందర్భంగా వికలాంగుల కళాకారులతో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని వివరించారు. నిరుద్యోగ సమస్య, రిజర్వేషన్స్ అమలు, పెన్షన్ పెంపు, స్వయం ఉపాధి, చట్టాల అమలు,ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్టు తెలిపారు.

కొమురమ్మకు స్పీకర్ రూ.లక్ష ఆర్థిక సహాయం

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సభాపతి ప్రసాద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బలగం సినిమా ఫేమ్ కొమురమ్మకు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అందించారు. కొద్ది రోజుల కిందట రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య స్మారక అవార్డు సభలో ఆర్థిక సహాయం చేస్తానని కొమురమ్మ, మొగిలయ్య దంపతులకు స్పీకర్ హామీనిచ్చారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ సోదరుడు పొన్నం రవిచంద్రతో కలిసి కొమురమ్మకు రూ. లక్ష చెక్కును అందజేశారు. తనకి పింఛన్ ఇప్పించాలని కొమురమ్మ స్పీకర్‌ను వేడుకున్నది. మంత్రితో మాట్లాడి ఇప్పించేందుకు కృషి చేస్తానని స్పీకర్ హామీనిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రూ. లక్ష చెక్కును అందజేసిన స్పీకర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. తన భర్త మొగిలయ్యకు మెరుగైన వైద్యం అందించేందుకు డబ్బులను ఉపయోగిస్తానని కొమురమ్మ తెలిపారు.



దోస్తులు రావొద్దు

• మాంసం వండొద్దు.. ముట్టొద్దు

• కనీసం ఆన్‌లైన్‌లోనూ ఆర్డర్ పెట్టొద్దు • పార్టీలకు నో ఛాన్స్ • ఏటికేడు అద్దెలో విపరీతమైన పెరుగుదల
• మతం, కులం చూసి అద్దెకిస్తున్న తీరు • రెంటల్ హోమ్స్ కోసం జనరేషన్ జెడ్‌కు కష్టాలు
• యజమానుల ఆంక్షలతో ఉక్కిరిబిక్కిరి • ప్రత్యేకించి మెట్రో నగరాల్లో ఈ బాధలు అధికం
• యువతులు, కొన్ని వర్గాల వ్యక్తులకు మరింత నరకయాతన

న్యూఢిల్లీ : ఉద్యోగరీత్యానో, చదువు కోసమో ఒక వ్యక్తి స్వస్థలాన్ని వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లటం తప్పనిసరి. ఈ క్రమంలో అలా వెళ్లిన సదరు వ్యక్తి ఆ ప్రాంతంలో ఉండటం ఒక సవాలుగా మారుతున్నది. ముఖ్యంగా, రెంటల్ హోమ్స్ విషయంలో జనరేషన్ జెడ్ యువతకు ఈ సమస్య ఏర్పడుతున్నది. వీరికి ఇండ్లు, రూములు సులభంగానే దొరికినా.. యజమానులు పెట్టే ఆంక్షలు, విధించే నిబంధనలు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తినే ఆహారపు అలవాట్లు, తిరిగే దోస్తుల దగ్గర నుంచి ప్రతి విషయంలోనూ నిబంధనలను విధిస్తూ యువతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇండ్ల యజమానులు. మాంసాహారం తినొద్దని, దోస్తులు రావొద్దని నిబంధనలు పెడుతూనే.. ఇరుకైన రూములు, ఇండ్లను ఎక్కువ మొత్తానికి కిరాయికి ఇస్తున్నారు. దేశంలోని మెట్రో నగరాల్లో ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జనరేషన్ జెడ్‌లోని మహిళలు, కొన్ని సామాజిక వర్గాలు, మతాలకు చెందిన యువతకైతే ఈ సమస్యలు తీవ్ర ఇబ్బందికరంగా మారుతున్నాయి.

యూపీఎస్సీకి సన్నద్ధమవుతున్న 24 ఏండ్ల అంజలి గోప్‌నారాయణ్.. ఈ ఏడాది జులైలో ఢిల్లీలోని ఓల్డ్ రాజేందర్ నగర్‌లో గల తన పీజీ హాస్టల్‌లో బలవన్మరణానికి పాల్పడింది. మూడు పేజీల తన సూసైడ్ నోట్‌లో తన సమస్యలు, ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి వివరించింది. ఇందులో భరించలేని హాస్టళ్లు, పీజీ సౌకర్యం ఫీజులు, యజమానుల దోపిడీ గురించి కూడా సదరు యువతి పేర్కొనటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. ఢిల్లీలోనే ఉంటూ రెండేండ్లుగా సివిల్ సర్వీసులకు సన్నద్ధమవుతున్న అంజలి తండ్రి మహారాష్ట్రలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇది ఒక అంజలి సమస్యనే కాదు.. యువతీ, యువకులందరూ ఇవే ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబయి వంటి మెట్రోపాలిటన్ నగరాల్లో ఫ్లాట్ల కోసం వెతుకుతున్న క్రమంలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

విపరీతమైన రెంట్లు

ఇండ్లు, హాస్టళ్లు, రూమ్‌ల విషయంలో యువత ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు అధిక రెంట్లు, ఫీజులు. ఒక 24 ఏండ్ల వ్యక్తి సగటున నెలకు రూ.4వేల నుంచి రూ. 12 వేల మధ్య సంపాదిస్తే.. వచ్చే ఆ కొద్ది మొత్తం బతకటానికే సరిపోదనీ, ఆకాశాన్ని చూస్తున్న ఇంటి అద్దెలతో వారు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉంటున్నారని కొంత మంది యువత తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. తాము ఈ బాధను అనుభవించలేక, తల్లిదండ్రులకు చెప్పుకోలేక తీవ్ర మనోవేదనకు గురవు తున్నామని చెప్తున్నారు. మ్యాజిక్‌బ్రిక్స్ తాజా సమాచారం ప్రకారం.. భారత్‌లోని 13 పెద్ద నగరాల్లో రెంట్ పెరిగింది. ఏటికేడు గ్రేటర్ నోయిడాలో 32.1 శాతం, గురుగ్రామ్‌లో 24.5 శాతం, బెంగళూరులో 23.7 శాతంగా ఈ పెరుగుదల ఉన్నది. అంటే ఏడాది తర్వాత రూ.79,200 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

ఊపిరాడనివ్వని యజమానుల ఆంక్షలు

ఇక రెంట్ సంగతి పక్కన బెడితే.. యజమానులు విధించే ఆంక్షలు మాత్రం యువతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదాహరణకు.. శారదా అగర్వాల్ (24) ఒక ఫ్యాషన్ డిజైనర్. 2020లో తన చదువు కోసం బీహార్ నుంచి నోయిడాకు వచ్చింది. చదువు తర్వాత ఉద్యోగం చేస్తూనే అక్కడ ఉన్నది. అయితే, ఆమెకు తన ఉద్యోగంతో వచ్చే డబ్బులు సరిపోకపోవటంతో 'ఇంటి నుంచి అప్పు చేయాల్సిన పరిస్థితి సదరు యువతికి కలిగింది. తన ఆఫీసుకు దగ్గరగా ఉండే ప్రాంతంలో ఒక్క సింగిల్ షేర్ బెడ్‌రూమ్ రెంట్ ప్రారంభ ధరనే రూ.25 వేలు కావటం గమనార్హం. అయితే, అదంతా భరించలేని ఆ యువతి.. తన ఆఫీసుకు దగ్గరలో ఒక సెమీ ఫర్నీష్డ్ ఫ్లాట్‌లో తక్కువ అద్దెకు కిరాయికి ఉండటం గమనార్హం.తమ ఇంటి యజమానులు ఎలాంటి సహేతుకత లేకుండా రెంట్లను పెంచుతున్నారనీ, ప్రశ్నిస్తే.. 'కడతావా, లేదా ఇంటిని ఖాళీ చేస్తావా' అని బెదిరిస్తున్నారని యువత వాపోతున్నారు. ఇక కొందరు యజమానులు కొత్త రూల్స్ పెడుతూ, రెంట్లను పెంచుతూ కొత్త అగ్రిమెంట్లను తయారు చేస్తున్నారని అంటున్నారు.

సోలో బ్యాచిలర్ కష్టాలు

ఇక బ్యాచిలర్స్‌వి అయితే ఇంకో రకం కష్టాలు. సింగిల్‌గా ఉండే వారికి.. ఇంటిని కిరాయి ఇవ్వటానికి ఓనర్లు ఇష్టపడటం లేదు. అయితే, బ్యాచిలర్స్ అంటే ఒక చెడ్డ ముద్ర యజమానుల్లో పడిపోయిందనీ, అయితే, ఆ ఆలోచనా ధోరణి మారాలని రాజేశ్ అనే వ్యక్తి వాపోయాడు. సింగిల్ ఉమెన్‌ది కూడా ఇదే సమస్య అని, రెంటల్ హోమ్స్ దొరకటం కష్టంగా మారిందని శ్రీజ అనే యువతి ఆవేదనను వ్యక్తం చేసింది. ఇక మతం, సామాజిక వర్గం ఆధారంగా కూడా చూస్తూ.. ప్రత్యేక మతం, కులాలకు చెందినవారిని యజమానులు నిరాకరిస్తున్న సందర్భాలూ పలు మెట్రో నగరాల్లో కనిపిస్తున్నాయి. మరికొందరైతే, తమ మతం, తమ కులం వారికే ఇవ్వటానికి మొగ్గు చూపుతుండటం గమనార్హం.

మాంసాహారం నిషేధం

ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో మీడియా ప్రొఫెషనల్‌గా టాకే పూజా దాస్ (24) పని చేస్తున్నది. ఆమెకు వార్తలు, తిండి.. ఈ రెండు అంటే చాలా ప్రాణం. అయితే, కొత్త ఫ్లాట్ కోసం చూస్తున్న ఆమెకు సోషల్ మీడియాలో కనిపిస్తున్న పోస్టులు చాలా ఆశ్చర్యాన్ని, అసంతృప్తిని కలిగించాయి. మాంసాహారం తింటే ఇంటిని అద్దెకు ఇవ్వబోమని చెప్పే యజమానులు ఫేస్‌బుక్ గ్రూపుల్లో ఆమెకు కనబడ్డారు. ఒక యజమాని పెట్టిన ఆంక్షలను సైతం ఆమె గుర్తు చేసుకున్నారు. "ఇంట్లో మాంసాహారం వండొద్దు. దానిని కనీసం ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్ పెట్టొద్దు. పార్టీలు, దోస్తులు (ఆడ, మగ), పొగ తాగటం, మద్యపానం అన్నీ కచ్చితంగా నిషేధం" అంటూ సదరు ఓనర్ చెప్పిన నిబంధనలను యువతి వివరించింది.

పెరుగుతున్న స్కామ్స్

ఇక యువత అవసరాన్ని ఆసరాగా చేసుకొని కొందరు బ్రోకర్లు అద్దె ఇండ్ల పేరిట మోసానికి పాల్పడుతున్నారు. నగరానికి వచ్చే యువతలో ఎక్కువ మంది దాదాపు ఆ సిటీకి చాలా కొత్తవారే అవుతారు. దీంతో, యువత అవసరాన్ని ఆయుధంగా వాడుకొని వాట్సప్‌లలో ఫేక్ సమాచారంతో కొందరు వ్యక్తులు నమ్మిస్తున్నారు. ఇది నమ్మిన యువత.. బ్రోకర్లుగా చెప్పుకుంటున్న స్కామర్లకు డబ్బులను పంపించి మోసపోతున్నారు.

ఒకవేళ ఇళ్లు దొరికిందని వెళ్తే.. అక్కడి యజమానులు అజమాయిషీ చలాయించటం, చిన్న చూపు చూడటం, ఎలాంటి కారణాలు చెప్పకుండానే సెక్యూరిటీ డిపాజిట్లను నిలిపేయటం, తక్కువ సమయాన్నిచ్చి ఇండ్లు ఖాళీ చేయాలనటం, గోప్యతకు స్థానం ఇవ్వకపోవటం వంటి ఇబ్బందులను యువత ఎదుర్కొంటున్నది.

అద్దెదారులకూ హక్కులున్నాయి : అడ్వొకేట్ సత్యజీత్ శర్మ

అసోంకు చెందిన అడ్వొకేట్ సత్యజీత్ శర్మ మాట్లాడుతూ.. అద్దెదారులకు ప్రైవసీ అనేది ప్రాథమిక హక్కు అనీ, యజమాని సైతం తగిన సమయాల్లో కాకుండా అద్దెదారుల ఇంట్లోకి, ప్రత్యేకించి మహిళలు ఉన్నపుడు రావటానికి కుదరదని అన్నారు. భారత్‌లో 'రెంట్ కంట్రోల్ యాక్ట్' ఉన్నదనీ, అది అద్దెదారులకు ప్రాథమిక హక్కులను కల్పిస్తుందని సత్యజీత్ శర్మ అన్నారు. గోప్యత, ఇతర హక్కులు మాత్రం సింగిల్‌గా ఉండే వ్యక్తులకు మాత్రం కల్పించబడలేదని అన్నారు. అయితే, వేలాది మంది యువత తమ స్వస్థలాలను వదిలి, పెద్ద ఆశలతో నగర బాట పడతారనీ, అయితే, ఇక్కడ ఇలాంటి పరిస్థితులు వారిని కష్టపెట్టేలా చేయటమో లేదా కెరీర్‌నే విడిచి వెళ్లేలా చేయటమో చేస్తాయని ఆయన వివరించారు.



కార్పొరేట్లకు ఎన్డీఏ సర్కార్ వంత

తగ్గని పెట్రో ధరలతో నిత్యావసరాలు భారం

• సీపీఐ(ఎం) రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి, పాలడుగు భాస్కర్
• సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా 3వ మహాసభ

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మికులు, కర్షకులు, పేదలను విస్మరించి కార్పొరేట్లకు వంతపాడుతోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి, పాలడుగు భాస్కర్ అన్నారు. సామాన్య ప్రజలకు, కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా 3వ మహాసభ జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో శనివారం జరిగింది. మహాసభలో వారు మాట్లాడుతూ.. లైంగిక దాడి కేసులో జైల్లో ఉన్న డేరా బాబాను హర్యానాలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో పెరోల్‌పై బయటకు పంపి ప్రచారంలో వాడుకున్నారని విమర్శించారు. ఒక కుటుంబంపై దాడి చేసి గర్భవతిగా ఉన్న మహిళలపై లైంగికదాడి చేసిన దుండగులకు గుజరాత్ ప్రభుత్వం క్షమాభిక్ష పెట్టడం, అలాంటి వారికి బీజేపీ నేతలు వంతపాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు 18 శాతం తగ్గితే.. భారత దేశంలో మాత్రం ధరలను తగ్గించడం లేదన్నారు. దీంతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులకు భారంగా మారుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసేలా కృషి చేయాలని కోరారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వదిలిపెట్టి.. పరస్పర విమర్శలు చేసుకోవడం తోనే కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పేదల కడుపు కొడుతూ పెద్దల పొట్టలు నింపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక చట్టాలు అమలు చేస్తోందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే బంగ్లాదేశ్ పరిస్థితి భారత దేశంలో ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ దోపిడీని పేద ప్రజలు కొంతవరకు మాత్రమే సహిస్తారని, సహనం నశించినప్పుడు ఎంతటి వారినైనా ఎదిరించేందుకు వెనుకాడరని చెప్పారు.

మహాసభ ప్రారంభోత్సవం ముందు సీపీఐ(ఎం) జెండాను జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.రమ, జిల్లా కమిటీ సభ్యులు మోతిరాం నాయక్, చంద్రశేఖర్, రవీందర్, సురేష్ గోండ, నర్సింలు అరుణ్, యాదగిరి గౌడ్, అజయ్, ఖలీల్ పాల్గొన్నారు.

పులిపంజాలా హైడ్రా

• బీఆర్ఎస్ భూములు గుంజుకుంటే.. కాంగ్రెస్ అదే పని చేస్తోంది
• పేదల కష్టాలు పట్టని ప్రధాని మోడీ
• భూ నిర్వాసితుల పక్షాన సీపీఐ(ఎం) ఉద్యమం : పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య
• జహీరాబాద్‌లో సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా మహాసభ ప్రారంభం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మధ్య తరగతి ప్రజల కలల గూడును కూల్చుతున్న హైడ్రా పులి పంజాలా మారిందని, పేదల ఇండ్ల కూల్చివేతపై మూసీ ప్రక్షాళనపై అఖిలపక్షంతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో శనివారం సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభ ప్రారంభమైంది. పార్టీ జెండాను సీనియర్ నాయకులు వాజీద్ అలీ ఎగురవేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వీరయ్య మాట్లాడుతూ.. పోటీ పరీక్షలు రాయాల్సిన మేధావులు, చదువుకోవాల్సిన గురుకుల విద్యార్థులు ప్రభుత్వ తప్పిదాల వల్ల రోడ్లపై ఆందోళన చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గతంలో బీఆర్ఎస్ చేసిన పనుల్నే కాంగ్రెస్ కూడా చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వం మాదిరే ప్రజల భూముల్ని గుంజుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి బొగ్గు గనుల్ని ప్రయివేటు పరం చేయడంతో పాటు రాడార్ పేరిట కలిసి తిరుగుతున్నాయన్నారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాల్లోకి వస్తున్నారన్నారు. ఆ పోరాటాలకు ఎర్రజెండా నాయకత్వం వహిస్తోందని, పోరుబాటలో నడుస్తున్న పేదలకు సీపీఐ(ఎం) అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ చెబుతున్న ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే సీఎం ఏ ఊరికెళ్తే అక్కడ ప్రజల్ని, ప్రతిపక్ష నాయకుల్ని అరెస్టు చేసి జైల్లో పెట్టడమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో నిమ్జ్



ఆకలితో అలమటించే భారతం: చుక్క రాములు

ప్రపంచ ఆకలి సూచికలో భారత్ స్థానం చూస్తే తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆకలితో అలమటించే వాళ్ల సంఖ్య 110 కోట్ల వరకు ఉంటే.. భారత్‌లోనే 23 కోట్ల మంది ఉన్నారంటే బీజేపీ దుష్ట పాలన తీరేంటో తెలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్ని అమలు చేయట్లేదన్నారు. మహిళలకు రూ.2500, నిరుద్యోగ భృతి, కనీస వేతనాల పెంపు అంశాలపై సీపీఐ(ఎం) రాబోయే కాలంలో ఉద్యమిస్తుందన్నారు.

మూసీ ప్రక్షాళనపై అఖిలపక్షంతో చర్చించాలి

ప్రాజెక్టు పేర వేల ఎకరాల్ని రైతుల నుంచి లాక్కొని కంపెనీలకు కట్టబెడితే నిరసన తెలిపిన కాంగ్రెస్.. అది అధికారంలోకి రాగానే ఫార్మా సిటీల పేర వేల ఎకరాల సాగు భూముల్ని లాక్కొంటోందని విమర్శించారు. కోటి మందికి పైగా కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవట్లేదని సీఎం దృష్టికి తీసుకెళ్తే వెంటనే పెంచుతామని చెప్పి మాట తప్పారన్నారు. రాష్ట్రంలో లక్ష కుటుంబాలు గుడిసెలేసుకుంటే.. ప్రభుత్వం ఇండ్లు ఇస్తామని మాట ఇచ్చి ఇప్పుడేమో గుడిసెల్ని కూల్చి నాయకుల్ని జైల్లో పెడుతోందన్నారు. రైతులకు రైతుబంధు, భరోసా ఇవ్వలేదని, రుణమాఫీ కూడా సగం మందికే పరిమితం చేశారని గుర్తు చేశారు.

కార్మికులకు రోజుకు కనీస వేతనం రూ.178గా నిర్ణయించి పండుగ చేసుకోవాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మతాన్ని రాజకీయాలకు వాడుకునే బీజేపీ 80 శాతం హిందువులున్న కార్మికులకు ఎందుకు కనీస వేతనాలు పెంచట్లేదని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కార్మికులు పోరాడుతుంటే ప్రధాని, ముఖ్యమంత్రి అరకొర విదిల్చి పండుగ చేసుకోమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మోడీ పాలనలో 5 లక్షలకు పైగా పరిశ్రమలు మూత పడ్డాయని, దేశంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిందని పార్లమెంట్‌లో బీజేపీ మంత్రినే ప్రకటించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు.

ఈ మహాసభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జె.మల్లికార్జున్, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల కార్యదర్శులు ఆముదాల మల్లారెడ్డి, ఎ.మల్లేశం, గొల్లపల్లి జయరాజు, నాయకులు బి.మల్లేశం, కె.రాజయ్య, రామచంద్రం, అతిమేల మాణిక్యం, జి.సాయిలు, నాయకులు వాజీద్ అలీ, లక్ష్మీ పాల్గొన్నారు.

పత్తి చేలల్లో.. వాడిపోతున్న పసిమొగ్గలు

గుజరాత్‌లో అంధకారమవుతున్న బాలల భవితవ్యం

• ఎనిమిదేండ్లకే స్కూళ్ల నుంచి పంట పొలాల్లోకి

• రూ. 200 కోసం కూలీలుగా గిరిజన పిల్లలు • అందులో రూ. 50 రవాణా చార్జీలకు
• పిల్లల భవితను కబళిస్తున్న పేదరికం • నిస్సహాయులుగా అధికారులు

'రెండేండ్ల క్రితం నేను స్కూల్‌కు వెళ్లేదాన్ని. యేటా రెండు నెలలు మాత్రమే పనికి వచ్చేదాన్ని. కానీ, మా నాన్న అనారోగ్యంతో మంచం పట్టాడు. నన్ను మొత్తం పనికే రమ్మని అమ్మ చెప్పింది. ఇంటికి కొంత డబ్బు అందిస్తున్నందుకు సంతోషంగా ఉన్నది' పత్తి చేనులో పని ముగించుకుని బండిలో ఇంటికి తిరిగి వెళ్లడానికి సిద్ధమవుతున్న 12 ఏండ్ల గిరిజన బాలిక కోకిలా చెప్పిన మాటలివి. 'నేను నా పిల్లలను స్కూల్‌కు పంపించాలనే అనుకున్నా. కానీ, ఆ ప్రభుత్వ హైస్కూల్‌లో నలుగురు టీచర్లు మాత్రమే ఉన్నారు. పిల్లలను స్కూల్‌కు పంపినా నేర్చుకునేది పెద్దగా ఏమీ ఉండదు. పనికి తీసుకు వచ్చింది బెటర్ అని అనుకున్నా'.. పిల్లలను తన వెంటే పత్తి చేనులో పనికి తీసుకువచ్చిన ఓ గిరిజన తండ్రి అభిప్రాయమిది.



న్యూఢిల్లీ : మన దేశంలో పత్తి ఉత్పత్తి దారుల్లో అగ్రశ్రేణిలో ఉన్న రాష్ట్రాల్లో గుజరాత్ ఒకటి. ఇక్కడ 26.8 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేస్తారు. ఈ సాగులో పనికి ఉత్తర గుజరాత్, దక్షిణ రాజస్తాన్ మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులు ఎక్కువగా వస్తున్నారు. ముఖ్యంగా ఉత్తర గుజరాత్ జిల్లాల్లోని పత్తి సాగులో పని చేయడానికి రాజస్తాన్ దక్షిణాది జిల్లాలైన ఉదయ్ పూర్, దుంగర్‌పూర్, ఉత్తర గుజరాత్ బనస్కాంత, సబర్కాంత జిల్లాల గిరిజనులు కుటుంబాలుగా వచ్చి కూలి చేసుకుని తిరిగి వెళ్తుంటాయి. ఉత్తర గుజరాత్‌లోని పత్తి చేనుల్లో పని చేసే మొత్తం కార్మిక శక్తిలో కేవలం ఉదయ్‌పూర్ నుంచి వచ్చే బాలలు 12.20 శాతం మంది, కౌమారదశ పిల్లలు19.75 శాతంగా డెవలప్‌మెంట్స్ ఫర్గాటెన్ చిల్డ్రన్ తన 2019 నివేదికలో పేర్కొంది. కోట్రా, ఝాడలో, లసాదియా, సాలుంబర్, సారడ, ఖేర్వాడా, రిషబ్‌దేవ్, గోగుందా వంటి గిరిజన ప్రాంతాల నుంచి ఎక్కువ వలస కూలీలగా గుజరాత్‌కు వస్తున్నారు. పైన పేర్కొన్న నాలుగు జిల్లాల నుంచే 70 శాతం కార్మికులు గుజరాత్‌లో పత్తి సాగుకు పని చేస్తున్నారు. ఇందులో 1,25,000 బాలలు, 1,90,000 కౌమార పిల్లలు కార్మికులుగా ఉన్నారు.

రోజుకు మిగిలేది రూ. 150

ఈ కూలీల్లో పిల్లలు కూడా ఎక్కువగా ఉంటున్నారు. వారు పత్తి సాగులో అన్ని పనులు చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ పాలినేషన్ కోసం వీరిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. పాలినేషన్ ప్రక్రియలో మేల్ ఫ్లవర్ బడ్‌ను ఫీమేల్ ఫ్లవర్ ప్లాంట్ దగ్గరికి ఒక రోజులో చాలా సార్లు తీసుకురావాల్సి ఉంటుంది. ఆ పత్తి చెట్టు నాలుగు అడుగుల ఎత్తు పెరుగుతుంది. కాబట్టి, ఈ పనికి పిల్లలు పర్‌ఫెక్ట్ అని భావిస్తారు. సెప్టెంబర్ నుంచి అక్టోబర్ మధ్య కాలంలో ఈ ప్రక్రియ ప్రారంభిస్తారు. పత్తి సాగు కోసం పిల్లలను మధ్య దళారీలు చేనులకు తీసుకువస్తారు. లేదా గిరిజనులే తెలుసుకుని వస్తారు. అలా కుదరకపోతే ఇంటి వద్దే సాగు పనులు చేసుకుంటారు. ఉదయం 5 గంటలకు వీరి పని మొదలవుతుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు పని ముగించుకుని వాహనాల్లో ఇంటికి తిరిగి వెళ్లిపోతారు. వీరి కూలి రూ. 200. ఇందులో రూ. 50 వాహన చార్జీగా చెల్లించాల్సి ఉంటుంది.

అడ్డుకోలేరా?

స్కూల్ డ్రాపౌట్లను తగ్గించడానికి, బాల కార్మికులుగా బాలలు మగ్గడాన్ని అడ్డుకోవడానికి ఇక్కడ ప్రయత్నాలు పెద్దగా లేవని చెప్పొచ్చు. బాల కార్మికుల గురించి ఉదయ్‌పూర్ జిల్లా మెజిస్ట్రేట్ దష్టికి తీసుకెళ్లగా.. గిరిజన పిల్లలు సాగులో ముఖ్యంగా పత్తి సాగులో ఎక్కువగా పనికి వెళ్తున్నారనే విషయం తమ దష్టికి వచ్చిందని, కానీ, తమకు ఎవరూ ఫిర్యాదు చేయడం లేదని తెలిపారు. తల్లిదండ్రులే పిల్లలను తమ వెంట తీసుకెళ్తుండటం వల్ల రిపోర్ట్ చేయడానికి ముందుకు రావడం లేదని వివరించారు. పోలీసులు ఆ వాహనాలను అడ్డుకునే ప్రయత్నాలు చేసి.. పలుచోట్ల చెక్ పోస్టులు పెడితే వారు వేరే మార్గాల గుండా వెళ్తున్నారు. పోలీసుల ప్రయత్నాలు ముమ్మరమైనప్పుడు గుజరాత్‌లోని పత్తిసాగుదారులే ఈ గిరిజనులను వారి దగ్గర పత్తి సాగు చేయాలని కోరుతారు. అప్పుడు గిరిజనులు కుటుంబమంతా కలిసి పంట పొలం వద్దే ఉంటారు. నిర్దిష్ట సమయం అనేది లేకుండా కుటుంబమంతా పనిలోనే నిమగ్నమై ఉంటుంది.

▸ గుజరాత్ పత్తి చేనుల్లో బాలకార్మికులుగా నాలుగు జిల్లాల గిరిజన పిల్లలు
▸ రోజు కూలి రూ. 200, రూ. 50 వాహన చార్జీలకే
▸ పనిలో 1,50,000 బాల కార్మికులు, 1,90,000 కౌమార పిల్లలు
▸ సాగుదారులకు కలిసి వస్తున్న గిరిజనుల పేదరికం

పరిష్కారమేంటీ?

రాజస్థాన్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ధ్రువ్ కుమార కావ్య కూడా ఈ సమస్యను అంగీకరించారు. ఈ సమస్య పరిష్కారానికి బాల కార్మికుల పరిరక్షణకు సమగ్రమైన ప్రభుత్వ పాలసీ రావాల్సిందేనని పేర్కొన్నారు. ఇందులో స్కూల్ డ్రాపౌట్లను ప్రత్యేకంగా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. 'ఇందుకు ప్రధాన కారణం పేదరికం. కాబట్టి, బాల కార్మికులను పట్టుకుని స్కూల్‌కు తెచ్చినా.. మళ్లీ వారు కూలికి వెళ్లే చాన్స్ ఉంటుంది. ఎంత మంది డ్రాపౌట్లు ఉన్నారనే విషయంపై రాజస్థాన్ ప్రభుత్వం ఇది వరకే సర్వేలు చేపట్టలేదు. కాబట్టి, పిల్లలను మళ్లీ పొలాల నుంచి పాఠశాల బాటపట్టించే విధంగా పాలసీని తీసుకురావాలి' అని వివరించారు.



అలంకారప్రాయ పదవులు వద్దు

మహిళలు హక్కుగా పొందే స్థానాల కోసం పోరాడాలి

• ఇది రాజకీయ పోరాటం కాదు, భావజాల యుద్ధం : శక్తి అభియాన్ ప్రారంభ కార్యక్రమంలో రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : మహిళలు నిజమైన సాధికారత కోసం పోరాడాలని, అలంకారప్రాయ పదవుల కోసం కాకుండా హక్కుగా వారికి అర్హమైన స్థానాల కోసం పోరాడాలని లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఇందిరా ఫెలోషిప్ ఫర్ విమెన్స్ ఎంపవర్‌మెంట్.. ప్రారంభించిన శక్తి అభియాన్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. నేడు రాజకీయాల్లో పోరు కేవలం రాజకీయ పార్టీలపైనే కాదని, అది విశాలమైన భావజాల యుద్ధమని చెప్పారు. ఈ పోరాటం కేవలం రాజ్యాధికారం కోసమే కాదని, ఒకే నాణేనికి ఇరువైపులా ఉన్న పక్షాల ప్రాతినిధ్యం కోసమని వివరించారు. కొన్ని పార్టీలు ఆలోచిస్తున్నట్టు ఈ రెండు పక్షాలు వేర్వేరు కాదని తెలిపారు.

'మహిళలు కేవలం నామమాత్రపు పదవులను స్వీకరించవద్దు. వారు హక్కుగా పొందే వాటి కోసం పోరాడాలి' అని కాంగ్రెస్ ఎంపీ, పార్టీ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. శక్తి అభియాన్ చేపడుతున్న పనులను ప్రశంసిస్తూ.. రాజకీయాలను కొత్తగా నిర్వచించే, నిర్వహించే, నాయకత్వం వహించే అవకాశాలను ఈ వేదిక మహిళలకు అందిస్తున్నదని వివరించారు. మహిళలు సంఘటితమై ఈ వేదిక ద్వారా మన దేశ రాజకీయ సరిహద్దులను మరింత విస్తతం చేస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా లింగ వివక్షను సమూలంగా నిర్మూలించే ఒక బలమైన వేదికగా ఎదిగే సామర్థ్యాలు శక్తి అభియాన్‌కు ఉన్నాయని చెప్పారు. క్షేత్రస్థాయిలో పితస్వామ్య భావజాలం నిలబెట్టే అనేక సవాళ్లను ఎదుర్కొంటూ.. ఇంకా పోరాడే స్ఫూర్తిని నింపుకున్న. వివిధ రంగాల్లో తమదైన ముద్ర వేసుకుంటున్నవారు శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 21 రాష్ట్రాల నుంచి వీరు పాల్గొన్నారు. భారత రాజకీయాల్లో సమాన ప్రాతినిధ్యం తీసుకురావడమే లక్ష్యంగా ఇందిరా ఫెలోషిప్ నడుపుతున్న శక్తి అభియాన్ పని చేస్తున్నది. సమసమాజ, సంఘటిత సమాజ నిర్మాణానికి మహిళలకూ రాజకీయ సాధికారిత ఉండాలని భావించే శక్తి అభియాన్ 21 రాష్ట్రాల్లో క్రియాశీలకంగా పని చేస్తున్నది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పితస్వామ్య సవాళ్లను అధిగమిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి, వివిధ రాజకీయ పదవులను నిర్వహించడానికి మహిళలను ఈ సంస్థ ప్రోత్సహిస్తున్నది.

పత్రికా స్వేచ్ఛ వల్లే మన స్వేచ్ఛకు రక్షణ ఉంటుంది. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే మన స్వేచ్ఛనే కోల్పోయే ప్రమాదం ఉంది -థామస్ జెఫర్సన్

న్యాయం కండ్లు తెరిచిందా!



సంపాదకీయం

'కావునలోకపుటన్యాయాలు, కాల్చే ఆకలి కూల్చే వేదన దారిద్ర్యాలూ దౌర్జన్యాలూ, పరిష్కరించే, బహిష్కరించే' మార్పేనా ఇది! న్యాయాన్ని బొమ్మను చేసి కలిగించే న్యాయం కళ్లు తెరిసిందని, చేతిలో రాజ్యాంగాన్ని సమ కూర్చుకుందని సంబరపడేందుకు సందర్భమేనా ఇది! న్యాయవాదులూ న్యాయస్థానాలూ ఉన్నాయంటేనే, వాటి అవసరం పెరుగుతున్నదంటేనే అన్యాయాలు విస్తరిస్తున్నాయని అర్థం. చాలా విషయాలలో నేడు వాటి వాటి స్వరూపాలను మార్చుకుంటున్నాయి. ఈ మార్పులు చూసి మనమంచికి జరుగుతున్నాయని అనుకోవటంలో తప్పులేదు. అయితే గమనించాల్సింది స్వభావంలో ఏమైనా మార్పులొచ్చాయా అని చూసుకోవాలి. స్వధర్మం పేరుతో అధర్మాన్ని, స్వచ్ఛత నినాదంతో దుష్టత్వాన్ని, దేశభక్తి పేరు చెప్పి ద్వేషాన్ని రగిలిస్తున్న తరుణంలో, ఏకత పేరుతో ఐక్యమత్యాన్ని విధ్వంసమొనరుస్తున్న సందర్భంలో, న్యాయమందక ఎందరో గొంతులెత్తుతున్న వేళ న్యాయదేవత కండ్లు తెరిచి న్యాయం చేస్తుందని భావించగలమా!

ఇటీవల సుప్రీంకోర్టు ఆవరణలోని న్యాయమూర్తుల గ్రంథాలయంలో కొత్త న్యాయదేవతా విగ్రహం ఏర్పాటు చేయటంతో దేశంలో ఈ మార్పు వెనకాలవున్న ఉద్దేశ్యాలపైన పెద్ద చర్చ మొదలయింది. సాధారణంగా న్యాయదేవత ఒక గౌనువేసుకొని, తలవిరబోసుకుని, కండ్లకు గంతలతో, ఒక చేతిలో త్రాసు, మరో చేతిలో ఖడ్గం కలిగి ఉంటుంది. న్యాయదేవతగా ప్రపంచదేశాలలో సైతం ఈ విగ్రహం ప్రసిద్ధి. గ్రీకు పురాణాల ప్రకారం థెమిస్ అనేది న్యాయ దేవతగా చెప్పుకుంటారు. ఆమె న్యాయానికి, చట్టానికి అధికారానికీ ప్రతీక. థెమిస్‌ను గ్రీకుప్రజలు బాగా గౌరవిస్తారు. థెమిస్ అంటే గ్రీకుభాషలో సంప్రదాయం, చట్టం అని అర్థం. ఈజిప్టులోనూ 'మాట్' దేవతను సత్యదేవతగా పూజిస్తారు. రోమ్‌లో జెస్టిసియా దేవత న్యాయానికి గుర్తుగా ఉంది. ప్రపంచ దేశాలలో ఈ విగ్రహాన్ని న్యాయ స్థానా లలో వాడుతున్నారు. బ్రిటన్, ఫ్రాన్స్ మొదలైన దేశాలలో కూడా ఈ ప్రతిమనే న్యాయానికి ప్రతీకగా పెడతారు. బ్రిటీషర్స్ నుండి మనమూ కొనసాగిస్తున్నాము. చట్టానికి అందరూ సమానమని, వారి వారి రంగు, మతము, పేద, ధనిక, ప్రాంత భేదాలు లేకుండా తప్పొప్పుల ఆధారంగానే న్యాయం జరుగుతుందని, శిక్షలు విధించడం చేస్తామని చేప్పే ప్రకటనకు, కండ్లకు గంతలు ఉంటాయని వివరిస్తారు. అలాగే ఖడ్గం ధరించడం అనేది శిక్ష విధింపునకు ఉండే అధికారాన్ని సూచిస్తుంది. ఇంకా వివరణలేవో చెపుతుంటారు.

ఇంతకాలం కోర్టుల్లోనూ న్యాయం జరగనపుడు న్యాయదేవత కళ్లుతెరచి చూడదని, అందుకనీ నిజాలు తెలువవనీ విమర్శ వచ్చేది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ గారి ఆదేశాల మేరకు న్యాయ దేవత రూపురూఖేలను మార్చి తయారు చేశారు. ఆ విగ్రహంలో కండ్లకు గంతలు తీసివేశారు. చేతిలో కత్తి బదులు రాజ్యాంగాన్ని పెట్టారు. త్రాసు త్రాసులాగే ఉంది. కానీ మొత్తం దేవతా రూపం భారతీకరించారు. "న్యాయదేవత కండ్లకు గంతలు అవసరం లేదు. చట్టం ఎప్పుడూ గుడ్డిదికాదు. అది అందరినీ సమంగా చూస్తుంది. కత్తి హంసకు ప్రతీకగా కనిపిస్తుంది. కానీ న్యాయస్థానాలు రాజ్యాంగ చట్టాల మేరకు న్యాయాన్ని అందజేస్తాయి", అని జస్టిస్ చంద్ర చూడ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. వాస్తవికతలో అలా జరిగితే సంతోషమే. ఈ న్యాయవ్యవస్థలోనే మొన్న చని పోయిన ప్రొ॥ సాయిబాబా తొమ్మిదేండ్లు విచారణ పేరుతో ఏ నేరం రుజువు కాకుండానే జైళ్లో మగ్గారు. హక్కుల కార్యకర్త స్టాన్‌స్వామి జైళ్లోనే ప్రాణాలు విడిచాడు. సాయిబాబాకు తన తల్లి మరణిస్తే, చూసేందుకు కూడా అనుమతి దొరకలేదు.కానీ అనేక దుర్మార్గాలు,హత్యలు, లైంగికదాడుల ఆరోపణలతో జైలుకెళ్లిన డేరాబాబాకు పదులసార్లు పెరోల్ దొరికిన సందర్భంలో, న్యాయదేవత విగ్రహం మారగానే న్యాయం జరుగుతుందని నమ్మటానికి అవకాశముందా?

అంబేద్కర్ ఆధ్వర్యంలో నిర్మితమైన రాజ్యాంగంపైన ఏ మాత్రమూ గౌరవమూ, విశ్వాసంలేని పాలకులు, అనేక రాజ్యాంగ సవరణలకు పూనుకుని, రాజ్యాంగ మౌలిక స్వభావాన్నే మార్చివేస్తున్న వేళ, న్యాయదేవత చేతిలో రాజ్యాంగాన్ని పెట్టగానే భ్రమకు గురవుతామా! కండ్లకుగంతలు తీసిన దేవతకు నిజాల్ని చేసి తీర్పులిచ్చే ధైర్యం వస్తుందా! ఈ అసమ సమాజంలో న్యాయం ఎవరి పక్షం వహించాలో న్యాయవ్యవస్థకు ముందుగానే తెలుసు. న్యాయ చట్టాలను మార్చి, సంస్కృత పేర్లతో వాటిని పిలిచినపుడే ఏదో మార్పుకు మార్గం వేస్తున్నారని సంకేతించారు. ఇప్పుడు భారతీకరించిన మనుధర్మాన్నే న్యాయంగా తెచ్చేందుకు పూనుకునే ప్రమాదం ఉంది. అప్రమత్తంగా వేచిచూడాలి!

మహారాష్ట్రలో కీలక సమర సంకేతాలు?



తెలకపల్లి రవి

నవంబరు 20వ తేదీన ఒకే విడతగా మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల కమిషన్ ప్రకటించడానికి ముందే భారత దేశ ఆర్థిక రాజధాని రాజకీయ మంత్రాంగంతో అట్టుడికిపోతున్నది. బీజేపీ ఎన్డీయే కూటమిని దారుణంగా దెబ్బతీసిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఒకవైపు..తాజాగా జరిగిన హర్యానా ఎన్నికలలో వూహలకు భిన్నంగా బీజేపీ పెద్ద విజయం సాధించడం మరోవైపు ఇందుకు కారణ మయ్యాయి. ఇది రాస్తున్న సమయానికి కూడా మహారాష్ట్రలో 'ఇండియా' వేదిక ప్రతిరూపమైన మహా వికాస్ అగాధీ(ఎంవిఎ) సీట్ల సర్దుబాట్లు ఒక కొలిక్కివచ్చినట్టు కనిపించదు.మూడు ప్రధాన భాగస్వామ్య పార్టీలైన శివసేన(ఉద్ధవ్ వర్గం) ఎన్‌సిపి, కాంగ్రెస్‌లు స్పష్టంగా సర్దుబాటు చేసుకోలేకపోవడం ఒకటైతే మిగిలిన భాగస్వామ్య పార్టీలు వామపక్షాలు ఇతర ప్రాంతీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకోకపోవడం మరో సవాలుగా మారింది. నిజానికి కాంగ్రెస్, శివసేనలే పరస్పర విరుద్ధమైన రకరకాల ప్రకటనలతో రచ్చకెక్కడం చూస్తున్నాం. బీజేపీ, శివసేన(ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గం), ఎన్సీపీ (అజిత్ పవార్) కూటమి కూడా మల్లగుల్లాలు పడుతున్నది. ఏమైనా రెండు కూటముల నేతలకూ కలసివెళ్లడం తప్పదని తెలుసు గనక పరిశీలకులు కలిపే చూస్తున్న పరిస్థితి.హర్యానాలో కాంగ్రెస్ అతి అంచనాలతో దెబ్బతిన్న తర్వాత శివసేన కొంచెం బెట్టు పెంచగా అటు మహాయుతిలో బీజేపీ షరతులు బిగించడం సహజంగానే జరిగింది.ముఖ్యమంత్రి ఎవరో ఎన్నికల తర్వాతనే చెబుతామని ఇరు కూటములు కూడా దాటేస్తున్నా ఎంతో కొంత ఉద్ధవ్‌ఠాక్రే, షిండేలే వుంటారన్న సంకేతాలు కూడా వెలువరించడానికి సిద్ధపడుతున్నాయి, ఒంటరిగా పోటీ చేయడం నష్టదాయకమన్న భయమే ఇందుకు దారి తీస్తున్నది కానీ అదే సమయంలో అధికార ప్రతినిధులు రాష్ట్ర నాయకులు మాత్రం తీవ్ర భాషలోనే వివాదపడుతున్నారు.

లోక్‌సభ ఫలితాల సంచలనం

లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ తర్వాత మహారాష్ట్ర ఫలితాలే 'ఇండియా'కు ఊపునిచ్చాయి. యూపీలో 2019 ఎన్నికల కన్నా 2024లో ఇండియా వేదికకు 37 స్థానాలు అధికంగా మొత్తం43 వచ్చాయి. మహారాష్ట్రలోని 48సీట్లలోనూ ఇండియా భాగస్వాములకు 2019లోకంటే 25 స్థానాలను పెరిగి మొత్తం 30 స్థానాలు దక్కాయి. వీటివల్లనే లోక్‌సభ ముఖచిత్రం మారింది. ఈ25 మాత్రమే గాక కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థి ఒకరు నెగ్గారు. ఎన్డీయేలకు చెందిన ముగ్గురు మంత్రులు, 25మంది ఎంపీలు ఓడిపోయారు. సీట్లలో ఇంత తేడా వున్నా ఓట్ల శాతం మాత్రం పోటాపోటీగానే వుండటం విస్మరించరానిది. ఇండియా ఎంవిఎ పార్టీలకు 44 శాతం ఓట్లు వస్తే ఎన్డీయే మహాయుతికి 43.6శాతం వచ్చాయి. అంటే తేడా కేవలం నాలుగు శాతం మాత్రమే! ఎన్నికలకు ముందు ఎంవిఎ చాలా సమస్యలను ఎదుర్కొన్నది. బీజేపీ ఒత్తిడి కారణంగా కావచ్చు ఎన్నికల సంఘం శివసేన, ఎన్సీపీ పార్టీల అధికారిక గుర్తులను పోటీ వర్గాలకే కేటాయించింది. ఉద్ధవ్,పవార్‌లు కొత్త గుర్తులతో పాల్గొన్నాయి. దేశ ఆర్థిక రాజధానిగా వుండటంతో కార్పొరేట్ మద్దతు మాత్రమే గాక మీడియా ప్రచారం కూడా ఎన్డీయేకే విస్తారంగా లభించింది. అయినా సరే షిండే ప్రభుత్వ అవినీతి, నిరంకుశ పోకడలపై తీవ్ర వ్యతిరేకత,సమస్యల కారణంగానే ప్రజలు ప్రతిపక్ష కూటమిని బలపర్చారు. వాస్తవానికి వందమంది సేన ఎన్‌సిపి సభ్యులు షిండేను బలపర్చడం వెనక కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ఒత్తిళ్లు బెదిరింపులు, వేధింపులు,కుట్రలు కీలకపాత్ర వహించాయి. మాతృసంస్థలకు వెన్నుపోటు పొడిచి వీరంతా అటు చేరారనే ఆగ్రహంతో ప్రజలు ఎంవిఎకు సానుభూతి చూపించారు. ప్రజల నిరసనకు రాజకీయ చక్రధారి శరద్ పవార్, మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్‌థాక్రే, కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే నాయకులుగా ఆదరణ పొందారు. ప్రధాని మోడీ,హోంమంత్రి అమిత్‌షా, ఉప ముఖ్యమంత్రి దేవంద్ర ఫడ్నవిస్, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వంటి బీజేపీ నేతలు మతపరమైన విభజన కోసం అనేక పథకాలు వేసినా, రకరకాల రిజర్వేషన్ల సమస్యల్ని తీసుకొచ్చినా జీవిత సమస్యలు, ఆర్థికాంశాలపై కేంద్రీకరించిన ఎంవిఎ వైపే ఓటర్లు మొగ్గుచూపారు.మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ముస్లిం మైనార్టీలు ఇతరులు కూడా ఎంవిఎను బలపర్చారు.ప్రకాశ్ అంబేద్కర్ వంచిత్ బహుజన్ అగాధీ(విబిఎ), మజ్లిస్ వంటి పార్టీల విచ్ఛిన్నకర పాత్రను కూడా తోసిపుచ్చారు. మహారాష్ట్రకు సంబంధించిన పరిశ్రమలు ప్రాజెక్టులు గుజరాత్‌కు తరలించే ధోరణి కూడా విముఖతకు కారణమైంది. బడా మీడియా బీజేపీ తరపునే పనిచేసినా ప్రజాసంఘాలు మీడియా వేదికలు వినూత్న నినాదాలతో పట్టుదలగా పోరాడటం మరింత దోహదం చేసింది. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనే స్ఫూర్తి ప్రతిబింబించింది.

హర్యానా అనంతరం...

ఈ నేపథ్యంలో ఎంవిఎ పార్టీలు మరింత అప్రమత్తంగా ఐక్యమత్యంగా వ్యవహరించడం వల్లే లోక్‌సభ ఫలితాల ప్రభావాన్ని కొనసాగించడం, శాసనసభలో విజయం సాధించడం అవసరమనే భావన అందరిలోనూ వ్యక్తమైంది. హర్యానా ఫలితాల తర్వాత కాంగ్రెస్ అక్కడ అనుసరించిన వైఖరిపై భాగస్వామ్య పార్టీల నుంచి వచ్చిన విమర్శల ప్రభావం మహారాష్ట్రపైనే ఎక్కువగా పడింది.



> వాస్తవానికి వందమంది సేన ఎన్‌సిపి సభ్యులు షిండేను బలపర్చడం వెనక కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ఒత్తిళ్లు బెదిరింపులు, వేధింపులు,కుట్రలు కీలకపాత్ర వహించాయి. మాతృసంస్థలకు వెన్నుపోటు పొడిచి వీరంతా అటు చేరారనే ఆగ్రహంతో ప్రజలు ఎంవిఎకు సానుభూతి చూపించారు. ప్రజల నిరసనకు రాజకీయ చక్రధారి శరద్ పవార్, మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్‌థాక్రే, కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే నాయకులుగా ఆదరణ పొందారు. ప్రధాని మోడీ,హోంమంత్రి అమిత్‌షా, ఉప ముఖ్యమంత్రి దేవంద్ర ఫడ్నవిస్, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వంటి బీజేపీ నేతలు మతపరమైన విభజన కోసం అనేక పథకాలు వేసినా, రకరకాల రిజర్వేషన్ల సమస్యల్ని తీసుకొచ్చినా జీవిత సమస్యలు, ఆర్థికాంశాలపై కేంద్రీకరించిన ఎంవిఎ వైపే ఓటర్లు మొగ్గుచూపారు.

నిజానికి ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలు ఒకసారి జరపడానికి బీజేపీ జంకింది గనకే నవంబర్‌కు వాయిదా పడ్డాయి.అయితే అనుకోని విధంగా అక్కడ బీజేపీ మూడోసారి విజయం సాధించడంతో మహారాష్ట్ర రాజకీయంపైనా ప్రభావం పడింది. ఎంవిఎలోని మూడు పార్టీల సంప్రదింపులలో పలు విభేదాలు తొంగిచూశాయి. ఒకవైపున అత్యధిక స్థానాలలో అవగాహన కుదిరిందని అంటున్నా విదర్భ, ముంబై సీట్లలో తీవ్రంగానే తేడాలు కొనసాగాయి. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలేతో చర్చలు జరిపే ప్రసక్తిలేదని సంజయ్‌రౌత్‌తో సహా హెచ్చరికలు చేశారు. ఆయన మాట్లాడేతీరుపై విమర్శలే గాక నిర్ణయాధికారం లేనివారితో చర్చలు ఎందుకని ఉద్ధవ్ కూడా ప్రశ్నించారు. సీట్ల చర్చలలో విభేదాలు సహజమేగానీ ఈ కారణంగానే తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నట్టు వ్యాఖ్యానించారు. ఒకటి రెండు రోజులు పడితే గానీ ఎంవిఎలోని మూడు పార్టీల మధ్య సంప్రదింపులు ముగిసేట్టు కనిపించడం లేదు.మొత్తంపైన 260 సీట్ల వరకూ అవగాహనకు రాగలిగామని మరో పాతిక, 30సీట్లలో ఎవరు పోటీ చేయాలనేదానిపై తుది నిర్ణయం జరగాలని వారంటున్నారు.అన్నిటినీ ఢిల్లీకి తెప్పించి ఆలస్యంగా నిర్ణయాలు చేసే రివాజును కాంగ్రెస్ మార్చుకోవాలని శివసేన నేతలు అంటుంటే, కాంగ్రెస్ పరిశీలకుడుగా వచ్చిన రమేష్ చెన్నితల అంతా అయిపోతుందని భరోసా ఇస్తున్నారు.115 స్థానాల్లో కాంగ్రెస్,80- 90 మధ్య సేన,70 సీట్లకు పైన ఎన్సీపీ పోటీచేస్తాయని సూచనలున్నాయి.కొన్ని ప్రాంతాల్లో ప్రభావం కలిగివున్న సమాజ్‌వాది పార్టీకి రెండుమూడు సీట్లు, వామపక్షాలకు మూడు, పెజంట్స్ అండ్ వర్కర్స్ పార్టీకి రెండు కేటాయించడం జరగొచ్చని ఏవో అంచనాలు చలామణిలో వున్నాయి. సీపీఐ(ఎం) గతంలో ఒక స్థానం స్వంతంగా గెలుచుకోగా మరోచోట చాలా దగ్గరగా వచ్చింది.మరికొన్ని చోట్ల కూడా ప్రభావం కలిగివుంది. ఎంవిఎ సీట్ల చర్చలు త్వరగా ముగించ కుండా ఆలస్యం చేయడం నష్టమని కూడా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.ఉదయ్ నర్కర్ గతంలో వ్యాఖ్యానించారు. ఈ మొత్తంపైన లౌకిక పార్టీల సంప్రదింపుల ప్రక్రియ ఎలా ముగిసేది చూడవలసిందే.

బీజేపీ వ్యూహాలేంటి?

మహాయుతి వరకూ చూస్తే బీజేపీ 150 స్థానాలు, మిగిలినవి తక్కిన పార్టీలు పోటీ చేసేలా చర్చలు నడుస్తున్నట్టు చెబుతున్నారు. షిండేను ముఖ్యమంత్రిగా కొనసాగిస్తామని సూచనలిస్తూనే సీట్లపరంగా తాము పెద్దపార్టీగా వుండాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తున్నది. పోటీకి విముఖత వ్యక్తం చేసిన దేవేంద్ర ఫడ్నవిస్‌ను ఒప్పించి పోటీలో నిలబెట్టడం కూడా గమనించదగ్గది.బీహార్ వంటిచోట్ల అనుసరించిన ఎత్తుగడలే బీజేపీ ఇక్కడా అమలు చేయొచ్చని పరిశీలకులు భావిస్తున్నారు.దేశంలో మరెక్కడా లేని విధంగా ఈ రాష్ట్రంలో బీజేపీ ప్రతి ప్రాంతీయ పార్టీని రెండు ముక్కలు చేసింది. అందులోనూ మళ్లీ తన ఏజెంట్లను వినియోగించి ఎప్పటికప్పుడు ఒత్తిళ్లు తెస్తున్నది. కాని సాపేక్షంగా చూస్తే బారామతిలో అజిత్‌పవార్ భార్యను ఓడించి సుప్రియా సూలే ఎన్నిక వడంతో శరద్‌పవార్ తిరుగులేని నాయకుడుగా మరోసారి రుజువు చేసుకున్నారు. దానికి తోడు ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలో పవార్‌ను బతక్తి ఆత్మ(ప్రేత సంచారి)గా అవహేళన చేయడం ప్రజలు ఆమోదించలేదు, ఉద్ధవ్‌థాక్రే నకిలీ అని కూడా గేళి చేశారు. ఇవన్నీ మహారాష్ట్ర ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని ఎంవిఎ నాయకులు ఉధృతంగా చేసిన ప్రచారం లోక్‌సభ ఎన్నికల్లో బాగా పనిచేసింది.ఇప్పటికీ ఆ ప్రభావం కొనసాగుతుండగా ఎన్సీపీ నాయకుడు బాబా సిద్దికి హత్యలో లారన్స్ విష్ణోయ్ ముఠా పేరు బయటకు రావడం శాంతి భద్రతలపై ఆందోళన పెంచింది.గుజరాత్‌లో జైలులో వున్న విష్ణోయ్ బీజేపీ వ్యతిరేకులైన నాయకులనే వెంటాడి హత్య చేయడం ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు తలెత్తాయి. ఈ సమయంలోనే కెనడాలోనూ నిజ్జర్ హత్యలో ఆ ముఠా ప్రమేయముందని ఆ దేశ ప్రధాని ఆరోపించడం తో కేంద్రం సమాధానం చెప్పుకోవలసిన స్థితిలో పడిపోయింది. కెనడా ప్రధాని ట్రూడోది తప్పే అయినా గుజరాత్ జైలులో వుండి విష్ణోయ్ ఇన్ని హత్యలు ఎలా చేయించగలుగుతున్నారు? అతని వెనక ఎవరి ప్రోద్బలం వుంది అనే ప్రశ్నలు ముందుకొచ్చాయి. కార్పొరేట్ల నిధులతోనే బీజేపీ రాజకీయం నడుపుతున్నదని, మహారాష్ట్రలో వారు మరోసారి గెలిస్తే పరిస్థితి పూర్తిగా దిగజారుతుందని ప్రతిపక్షాలు హెచ్చరిస్తున్నాయి.మరి పదిరోజులలోపే నామినేషన్ల దాఖలు మొదలవుతుండగా కీలకమైన మహారాష్ట్ర ఎన్నికల తీర్పు ఎలా వుంటుందనేది ఉత్కంఠ కలిగిస్తున్నది. ■

సామ్యవాద సాహిత్య శిల్పం... 'శేషేంద్ర గొరిల్లా కావ్యం!'



డా.వెనిగళ్ల రాంబాబు
98480 44329

'హితేన సహితం సాహిత్యం' అని మన పూర్వీకులు సాహిత్యాన్ని నిర్వచించారు. అంటే హితాన్ని చేకూర్చేదే సాహిత్యం. అయితే ఈ హితం ఎవరికోసం? ఎందుకోసం? అన్న కోణాల్లో పరిశీలించినప్పుడు ఆయా వర్గ ప్రయోజనాలను అనుసరించి సాహిత్యం పలు శాఖలుగా చీలిపోతుంది.కష్టజీవికి ఇరువైపులా నిలిచే వాడేకవి అని శ్రీశ్రీ అంటే, సామాన్యుడి కన్నీళ్లను తుడవనిది అసలు సాహిత్యమే కాదన్నారు శేషేంద్ర.కవిత్వం రాయడానికి నిరుపహతి స్థలంబు రమణి ప్రియ దూతిక.. అంటూ అలనాడు అల్లసాని పెద్దన్న తనకు కావలసిన సరంజామా వివరిస్తే, అడుగడుగునా చెరసాలలు..సంకెళ్ళు, లాఠీలు, తూటాలు, నిరసనలు, నిర్బంధాలు, ఎమర్జెన్సీ పేరుతో దేశంలో అత్యవసర పరిస్థితి (1975-77) అట్టుడికి పోతున్నకాలంలో ఆంక్షలను, అడ్డంకులను అధిగమించి నిర్భయంగా శేషేంద్ర వివిధ పత్రికలలో వెలువరించిన వచన కవితల సమాహారమే 'గొరిల్లా కావ్యం'గా రూపుదిద్దుకుంది. తదనంతర కాలంలో వెలువడిన "ఆధునిక మహాభారతం"లో ఇది పశుపర్వం పేరుతో చోటుచేసుకుంది.ఎమర్జెన్సీ కాలంలోనే గొరిల్లా ఇంగ్లీషు, హిందీ అనువాదాలు కూడా వెలువడ్డాయి.వాస్తవానికి శేషేంద్ర సంప్రదాయ సిద్ధమైన, ఛందోబద్ధమైన పద్య కావ్యాలు రాస్తున్న రోజుల్లోనే ఆయన హృదయం అభ్యుదయ భావజాలంతో నిండిపోయింది.

కులగోత్రమ్ములు లేవు మాకు
ధనిక క్రూర క్రియా పీడిత
జ్వలిత ప్రాణిచమూ సమూహమొకటే
సత్యంబు, ఊహ భుజార్గళముల్
విప్పిన విశ్వమూర్తియయి
శంఖారావముంజేయుడో
దళిత శ్రామిక జీవులార!
భువన ద్వారంబు భేదిల్లగన్!

ఎమర్జెన్సీకి పాతిక సంవత్సరాల ముందు ఆయన రాసిన "పక్షులు" అనే కావ్యంలోని పద్యమిది.గొరిల్లాను మానవుని లోని క్రియాశక్తికి ప్రతీకగా శేషేంద్ర స్వీకరించారు. సహజంగా ఎంతో సాత్వికంగా ఉండే గొరిల్లా విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు మాత్రం తన ప్రతిచర్యతో పూర్తి హింసా త్మకంగా మారిపోతుంది. అలాగే తీవ్రమైన అణచివేతలకు గురువుతున్న అట్టడుగు వర్గాలు సంకెళ్లు తెగతెంచుకుని సాయుధ పోరాటానికి సిద్ధం కావాలన్నా వామపక్ష భావజాలానికి తన ప్రజాసాహిత్యంతో వెన్నుదన్నుగా నిలిచారు శ్రీ గుంటూరు శేషేంద్ర శర్మ. శేషేంద్ర ప్రౌఢ ప్రబంధాలను ఆవాహనం చేసుకున్న అలంకారిక పద్య కవి. రుతుఘోష,చంపూ వినోదిని, సొరాబు వంటి పద్య కావ్యాలు, కవిసేన మేనిఫెస్టో, కాల రేఖ, శోడశి, స్వర్ణ హంస, సాహిత్య కౌముది, వివేచన, నరుడు-నక్షత్రాలు మొదలైన గ్రంథాలెన్నో రచించిన నిలువెత్తు సారస్వత మూర్తి శేషేంద్ర.అయినా ఆయన ఏదో దివిలో విరిసిన పారిజాతమై ఎగిరిపోకుండా చైతన్య జలపాతమై, పీడిత తాడిత ప్రజానీకంతో మమేకమైన మహాకవిగా తన సాహిత్యాన్ని సార్థకం చేసుకున్నారు.

"నా భాషలో భూకంపం పుట్టింది"
అని సంప్రదాయ ధోరణులను వ్యతిరేకిస్తూ..

నేను జేబుల్లో కోకిలల్ని వేసుకు
రాలేదు
పిడికిటలో బాంబులు
బిగించుకొని వచ్చాను



అంటూ తన సంక ల్పాన్ని ఆవిష్కరిస్తూ..

నా కవిత్వం ఏ జెండాను
ఎగరేయదు కానీ
నా చేతులు నా దేశపు ఖడ్గాలు

అని సగర్వంగా ప్రకటించిన సారస్వత ధీరోదాత్తుడు శేషేంద్ర. శేషేంద్ర సృజనలో హంసతూలికా తల్పాలు, ప్రణయపారవశ్యపు పాలరాతి శిల్పాలు కనిపించవు .ఆయన కాల్పనిక ప్రపంచంలోనూ తుమ్మెదలు, చకోర పక్షుల కన్నా ప్రజా జీవితమే కనిపిస్తుంది.

నా కన్నుల్లో కనిపిస్తున్నాయి భావితరాలు
ప్రభాతం రాల్చిన కిరణాల గింజలు
ముక్కుతో పొడుచుకు తింటున్న
కోడిపుంజుల కుటుంబాల్లా

ఇలా అలంకారాల్లోనూ అభ్యుదయం తళుక్కుమనటం ఆయన ప్రత్యేకత. వర్గ వైరుధ్యాలను, సామాజిక ఆర్థిక శాస్త్రాలను అవగాహన చేసుకున్న సాహితీవేత్తగా శేషేంద్ర అడుగడుగునా గోచరిస్తారు.

తెలుసా నీ వ్యాధి ఏమిటో? బతుకు
దానికి మందు ఏమిటి? మెతుకు
ఇలా సమాజంలోని సమస్యను,
దాని మూలాన్ని అన్వేషించిన దార్శకునిగా..
అదిగో ఉదయించే దిక్కు
దానికే హృదయపూర్వకంగా మొక్కు

అంటూ, ఆ సమస్య పరిష్కారానికై దిశా నిర్దేశం చేస్తున్న మార్గదర్శిగా..

అడవుల్లో ఉరితీసిన వీరుడిలా ఉదయపు చెట్లలో
వేలాడుతున్నాడు సూర్యుడు

అంటున్న యథార్థవాదిగా.. పాలక వర్గాలలోక విరోధిగా

అస్తమించనీకుండా అరచేత్తో
ఎత్తి పట్టుకొని మిత్రమా
నీ గుండెలో మెరిసే నక్షత్ర మండలాన్ని

అంటూ కర్తవ్యాన్ని ఉపదేశిస్తున్న ఉద్యమకారునిగా..

నీ కాళ్ల సంకెళ్లు తెగిపోవాలని
నీ చేతుల్లో ఖడ్గాలు మెరవాలనీ దీవిస్తున్నాను
పద నిర్భయంగా
నీ దీపాలన్నీ వెలిగించబడే ఉన్నాయి

అంటూ ఆత్మవిశ్వాసాన్ని రగిలిస్తున్న శ్రామిక శ్రేయోభిలాషిగా శేషేంద్ర చరితార్థులయ్యారు. శేషేంద్ర హృదయ స్పందనగా భావించే జగత్ ప్రసిద్ధమైన ఈ కవితాత్మక వాక్యాలు గొరిల్లా కావ్యంలోనివే !

సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చుని
మొరగదు
తుఫాను గొంతు చిత్తం అనడం ఎరుగదు
పర్వతం ఎవరికి వంగి సలాం చేయదు
నేనంతా ఒక పిడికెడు మట్టే కావచ్చు
కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు
జెండాకున్నంత పొగరుంది

అక్రమాలపై శేషేంద్ర పూరించిన ఈ ధిక్కార స్వరం కాలగమనంలో ఎందరో ఉద్యమవీరులకు, రాజ నీతిజ్ఞులకు ఉత్ప్రేరక శక్తిగా నిలిచింది.

ప్రభాతం పసిడిగా ఉన్నప్పుడు
సనాతనగంగలో స్నానం చేశాడు మానవుడు
ఇప్పుడు మధ్యందిన మార్తాండ మండలాన్ని
ఉపాసిస్తున్నాడు.

ఇదీ శేషేంద్ర దర్శనం. ఆయన ఆశయం నిరంతర పురోగమనం.

ఆయన సాహిత్యం ఇంగ్లీషు, హిందీ, కన్నడం ఉర్దూ, బెంగాలీ, నేపాలి, గ్రీకు భాషల్లో అనువదించబడ్డాయి. ఆ విధంగా శేషేంద్ర విశ్వకవి. అస్తమయంలేని రవి.శేషేంద్ర తన సాహిత్యంలో అప్సరోభామినులను అలంకరించలేదు. రాసలీలలను రసరమ్యంగా వర్ణించనూ లేదు. ఆయన తన కవితాత్మక పదమాలికలను, కార్మిక కర్షకులకు కండువాలుగా కప్పారు.ఆత్మగౌరవంతో తలెత్తుకుని తిరిగే తలపాగాలుగా చుట్టారు.

నా మాటలు ఈ దేశపు మట్టిలో చల్లుతున్నా
అన్నిచోట్ల కత్తులు మొలవాలని

అలా కత్తులుగా మొలిచిన శేషేంద్ర మాటలు మానవత్వం పరిమళించే తోటలై, యువశక్తిని నవయుగం వైపుకు నడిపించే బాటలై, సారస్వత విలువలను సంరక్షించే దుర్భేద్యమైన కోటలై ఈ శతాబ్ది చైతన్య ప్రవంతిలో అంతర్లీనమయ్యాయి.

ఇదీ శేషేంద్ర సంకల్పం.
ఇదీ శేషేంద్ర సామ్యవాద సాహిత్య శిల్పం.

(నేడు 97వ జయంతి)

ఖాళీ కుర్చీ







జంధ్యాల రఘుబాబు
9849753298

మా నాన్న ఫార్మసిస్ట్ అంటే కాంపౌండరు. ఆసుపత్రిలో ఉద్యోగమని వేరే చెప్పే పనేలేదు. రోగులను వైద్యులు చూసి మందులు రాసిస్తే వీళ్లు ఇచ్చి పంపుతారు. ఎలా వేసుకోవాలి, ఎప్పుడు వేసుకోవాలి అన్న విషయాలు చెప్పి మరీ పంపిస్తారు. డాక్టర్లు వేసుకునట్టే వీళ్లూ తెల్లకోటు వేసుకుంటారు, మెడలో స్టెతస్కోప్ ఒక్కటి ఉండదంతే. సదరు వైద్యురాలు లేదా వైద్యుడు సెలవుపై పోతే ఫార్మాసిస్టుల్లో సీనియర్ ఆసుపత్రి ఇంఛార్జీగా వ్యవహరిస్తారు. ఏ ఆసుపత్రికి మారినా మా నాన్ననే సీనియరుగా ఉండేవాడు అందుకే ఇంఛార్జీగానూ ఉండేవాడు. డాక్టరు సీటులో కూచోకూడదు కాబట్టి దానిపక్కన ఇంకో కుర్చీవేసుకొని కూచోవాలి. రోగులను పరీక్షించి మందులు రాసి పంపాలి అంటే వైద్యుడు వచ్చేవరకు వైద్యుడేనన్నమాట. పక్కన ఖాళీ కుర్చీ అలాగే ఉంటుంది. పాఠశాలల్లో, కళాశాలల్లో, ఆఫీసుల్లోనూ ఇలాగే ఉంటుంది.

అపరాధ భావం కావచ్చు, ఆరాధనా భావం కావచ్చు, అత్యుత్సా హం కావచ్చు, ఆత్మరక్షణా చర్య కావచ్చు, ఏదైతేనేం కొన్నిసార్లు తాము కూర్చున్న కుర్చీ పక్కన ఖాళీకుర్చీ పెట్టి తమ భక్తిని ప్రదర్శించ వచ్చు కొందరు. లేదా ఆ కుర్చీలో పాదుకలు పెట్టి పట్టాభిషేకం చేయొచ్చు. తాము కూచున్నది పూర్తిగా తాత్కాలికమైన బాధ్యత అన్న విషయమూ తెలిసి ఉండొచ్చు. ఈపాటికే అర్థమైపోయి ఉంటుంది, ఇది ఢిల్లీ పీఠం గురించి అని. యుగాలేవైనా, కాలాలేవైనా రాజకీయాల్లో ఇవన్నీ మామూలే. తమిళనాడులో కూడా ఇలాగే జరిగేది. మా మిత్రుడు శ్రీనివాస్ ఈఅంశంపై తన కోణంలో ఇప్పటికే రాసేశాడు కూడా. వినదగునెవ్వరు చెప్పిన, చదవదగునెవ్వరు రాసిన అన్న సూత్రం వర్తిస్తుందిక్కడ.

ఖాళీకుర్చీ అన్న వెంటనే ఎక్కడ? ఎవరు ఖాళీ చేశారు? పరిగెత్తితే నేనందుకోగలనా? మ్యూజికల్ చైర్స్ ఆటలోలాగ పోటీ ఉంటుంది కదా, పాట ఎప్పుడాపుతారో, వేరే వాళ్లను తోసి ఎలా కూచోవాలో మొదలైన ప్రశ్నలు, ఆలోచనలు, ఆవేశం కలుగుతాయి. ఎవరికి? అన్నది అసలు ప్రశ్న. ఇది ఎక్కడైనా ఉంటుంది. ఖాళీ సీటుపై కన్ను పడనివారు ఉండరు అని మా మిత్రుడు అంటూ ఉంటాడు. అంతెందుకు అన్న రామారావు ఒక్క నెల అమెరికా వెళ్లి వచ్చేలోగా ఏమయిందో అందరికీ తెలుసు. ఆ తరువాత జామాతలు ఏమేం చేశారో అదీ తెలుసు. కాబట్టి కుర్చీని టెంపరరీగా ఖాళీగా పెట్టి వెళ్లేటప్పుడు అతి జాగ్రత్తగా ఉండాలన్నది మొదటి రూలు. మొదటి రూలు అన్నందుకు ఇంకా రెండోది, మూడోది ఇలా రూల్సు నాకు తెలుసని అనుకోవద్దు. ఆ రూల్సు ఖాళీ అయిన సీటును ఎలాగైనా అందుకోవాలి అని ప్రయత్నం చేసేవాళ్ల రాజకీయ చతురతను బట్టి ఉంటుంది. రాజకీయాల్లోనే కాదు, వివిధ రంగాల్లో ఈ రాజకీయాలు జరుగుతూనే ఉంటాయి. తమకున్న టాలెంటుతో పాటు లాబీలు నడపడం, గ్రూపులు కట్టడం, మనుషుల్ని మచ్చిక చేసుకోవడం, కొనడం చేసి మరీ సీటులో కూచునే రకాలనూ చూస్తాం. డబ్బు పెట్టి మరీ "డబ్బొచ్చే" సీటును కోరి కూచుంటారు వాళ్లు. ఆ పై అవార్డులూ, రివార్డులూ తమ చేతిలోకి తెచ్చుకొని కొంతకాలం అధికారం చెలాయించవచ్చు. హిందీలో మొదటి సూపర్ స్టార్ రాజేష్ ఖన్నా చెప్పినట్టు ఈ పీఠం ఇంతకుముందు ఎవరిదో, నేడు నీది, రేపు ఇంకొకరిది అన్న డైలాగు చాలా చోట్ల కాదు అన్నిచోట్లా అతికినట్టు సరిపోతుంది.

పాత నవలల్లో, కథల్లో రాసేవారు. ఒక అభ్యర్థి రికమెండేషన్ ఉత్తరం పట్టుకొని ఉద్యోగ ప్రయత్నంలో ఒకానొక కార్యాలయానికి పోతే సదరు వ్యక్తి అక్కడ ఉండరు. ఖాళీ కుర్చీ వెక్కిరించింది, వెనక్కి తిరిగి ఇంటిముఖం పట్టారని రాసేవాళ్లు. పాత విషయమని ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే ఇప్పుడు సెల్లుకు ఫోనుచేసి మరీ ఉన్నారా లేదా అని కనుక్కొనిపోతారు కాబట్టి. ఎక్కడ ఏ ఖాళీ ఉంది అన్న విషయంతో పాటు ఖాళీ కుర్చీలేవేమి ఉన్నాయి, దానిలో కూచోవాలంటే ఎలా మొదలైన విషయాలన్నీ సెల్లు సంభాషణల ద్వారా తెలుసుకోవచ్చు. ఇంకా వీలైతే ఏ.ఐ అంటే కృత్రిమ మేధ ద్వారా తెలుసుకునే రోజులూ రావచ్చు అందుకుగాను నానో టెక్నాలజీని కూడా వాడొచ్చు. అసలు మనిషి ఆలోచనల్లో "ఖాళీ" అన్న పదమే ఉండదు కాబట్టి ఇవన్నీ జరుగుతున్నాయి.

పరీక్షల్లో ప్రశ్నలుంటాయి. వాటిల్లో చిన్న సమాధానం ప్రశ్నలు, పెద్ద సమాధానం అడిగేవి, వ్యాసాలు ఇలా ఎన్నో రకాలుంటాయి. బిట్ పేపర్ కూడా ఉంటుంది. అందులో ఖాళీలను పూరింపుడు అన్న ప్రశ్నలూ ఉంటాయి. ఐదు సమాధానాలిచ్చి ఇందులో సరైనదేది అనే ప్రశ్నలే కాక ఈ ఖాళీ ప్రశ్నలూ ఉంటాయన్న విషయం మనకు తెలుసు. ఆ ఖాళీలను సరైన సమాధానంతో నింపాలి. మనకు రానప్పుడు పక్క పేపరులో చూసే అవకాశమూ ఉంటుంది. పక్కన మన సబ్జెక్టువారే ఉంటే సరే, ఒక్కోసారి వేరేవాళ్లను కూచోబెడతారు కూడా. పక్క విద్యార్థి ఖాళీని పూరించినా కూడా అది నిజమైన సమాధానమో కాదో అన్న అనుమానం ఒకటుంటుంది. మనం దాన్ని కాపీ కొట్టినాక సదరు పక్క విద్యార్థి దాన్ని తరువాత కొట్టేసి సరైన సమాధానం తరువాత రాయొచ్చు కూడా. అందుకే ఎవరి ఖాళీ వాళ్లే పూరించుకోవాలి అన్నది ఒక ముఖ్యసూత్రం.

కొన్నిసార్లు మిశ్రమ ప్రభుత్వాలు ఏర్పడితే కూడా ఈ ఖాళీ సీటు సమస్య వస్తుంది.ఎవరెవరికి ఎన్నెన్ని సీట్లు వచ్చినాయి అన్న విషయంపై సదరు సీటులో ఎవరెవరు ఎన్నిరోజులుండాలి, ఎప్పుడు ఖాళీ చేయాలి అన్న విషయం ఆధారపడి ఉంటుంది. ఎవరో జ్వాలలు రగిలించారని ఎక్కడో ఏదో జరిగితే సీటు ఖాళీ కావచ్చు. వీపీ సింగులాంటివాళ్లు సీటు పోయినా సరే అనుకొని రథయాత్రను ఆపి హుందాగా దిగిపోవచ్చు. అలాగే దేశానికి పెద్ద నష్టం జరిగినా సీటును ఖాళీ కాకుండా, చేయకుండా దాన్నే పట్టుకొని వేలాడేవాళ్లూ ఉండొచ్చు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు. ఛాన్సు వచ్చినా వదులుకుని వివిధ పార్టీలు బలపరుస్తున్న ఒక బూర్జువా ప్రభుత్వ అధిపతిగా కుర్చీలో కూచోవడం వద్దనుకునే పార్టీలున్నాయని తెలిస్తే ముక్కు మీద వేలేసుకునే రోజులు. తమకు, తమ పార్టీకి మస్తుగా సంపాదించుకొని ఉండొచ్చు కదా అనీ అనుకోవచ్చు ఇప్పటి 'ఎన్నికల బాండ్లను గుర్తు చేసుకుంటూ. కాలమెంత మారినా సిద్ధాంతాలకు కట్టుబడి ఉండేవాళ్లు ఎప్పుడూ ఉంటారు. దాన్ని ప్రజలు గమనించాలి. ఖాళీలను ఎలా పూరించాలి, ఖాళీ సీట్లలో ఎవరు కూచుంటే బాగుంటుంది అన్న విషయం ప్రజలకు తెలిసినంత ఎవ్వరికీ తెలియదు. అందుకే వాళ్లు ఈ ఖాళీలను పూరించేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే బతుకులే ఖాళీ ఐపోతాయి. ■



పుస్తకాలు చదివే సంస్కృతి పెరగాలి

- డిసెంబర్ 19 నుంచి 29 వరకు పుస్తక మహోత్సవం :37వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి జూపల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేటి సమాజంలో పుస్తకాలు చదివే సంస్కృతి మరింత పెరగాల్సిన అవసరం ఉందని తెలంగాణ సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. డిసెంబర్ 19 నుంచి 29 వరకు హైదరాబాద్ లోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే పుస్తక మహోత్సవాన్ని పుస్తకప్రియులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన క్యాంప్ ఆఫీసులో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బుక్‌ఫెయిర్ నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భరోసానిచ్చారు. మూడు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అనుకూలంగా హైదరాబాద్‌లో బుక్‌ఫెయిర్‌ను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. పదిరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో పుస్తక ప్రియులు, విద్యార్థులు, రచయితలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్ మాట్లాడుతూ.. బుక్‌ఫెయిర్ నిర్వహణకు సహకారం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బుక్‌ఫెయిర్‌లో ప్రచురణ కర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బుక్‌ఫెయిర్ ప్రధాన కార్యదర్శి ఆర్.వాసు మాట్లాడుతూ.. బుక్‌ఫెయిర్‌లో 250కిపైగా జాతీయ, అంతర్జాతీయ పబ్లిషర్లు పాల్గొంటారనీ, పదిలక్షల మందికిపైగా పుస్తక ప్రియులు సందర్శించే అవకాశం ఉందని తెలిపారు. సందర్శకులకు, రచయితలకు, స్టాల్ నిర్వాహకులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఐడీ కార్డులు చూపించి ఉచితంగా సందర్శించ వచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధి కారి నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు కె.బాల్‌రెడ్డి, శోభన్‌బాబు, సంయుక్త కార్యదర్శులు కె.సురేశ్, ఎం.సూరిబాబు, ఈసీ సభ్యులు జనార్థన్‌గుప్తా, విజయారావు, మధుకర్, కోటేశ్వర్‌రావు, శ్రీకాంత్, శ్రీనివాసరావు, సాంబశివరావు, స్వరాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మూకాశ్మీర్‌లో ఓపీఎస్ పునరుద్ధరణ పట్ల హర్షం

- సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జమ్మూకాశ్మీర్‌లో ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ని పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించడం పట్ల సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

డిసెంబర్‌లోపు రెండు లక్షల రుణమాఫీ

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రెండు లక్షల రుణమాఫీ కానీ రైతులకు డిసెంబర్‌లోపు మాఫీ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. అంత కంటే ఎక్కువ అప్పు ఉన్న రైతులకు షెడ్యూల్ విడుదల చేస్తామన్నారు. ఆ షెడ్యూల్ ప్రకారం మాఫీ అవుతుందని స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్‌కేఎస్ భవన్‌లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, చైర్మెన్లు కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డి, రైతు సంఘాల నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, అరిబండి ప్రసాదరావు, పశ్యపద్మ, పలువురు వ్యవసాయ నిపుణులతో కలిసి మంత్రి విలేకర్లతో మాట్లాడారు. అంతకు ముందు వారితో సమావేశమయ్యారు. పంటల బీమా కోసం త్వరలో టెండర్లను ఆహ్వానిస్తామన్నారు. రైతులకు మెరుగైన బీమా సౌకర్యం కల్పించిన కంపెనీలకు అప్పగిస్తామని తెలిపారు. పంటల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నదని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఓఆర్ఆర్‌ను తాకట్టు పెట్టి రుణమాఫీ చేసిందని విమర్శించారు. దీంతో రైతులు రుణవిముక్తి కాలేదని చెప్పారు. ఇప్పటికే రుణమాఫీ కోసం రూ. 18వేల కోట్లు ఖాతాల్లో జమ చేసినట్టు పునరుద్ఘాటించారు. రుణమాఫీ కాని రైతుల కోసం క్షేత్రస్థాయిలో రెండు నెలలుగా నిర్ధారణ చేసినట్టు తెలిపారు. వారికి రూ. 25వేల కోట్లు ఇస్తామని తెలిపారు. పంటల బీమా ఎకరాకు పదివేల చొప్పున ఇస్తామని భరోసా ఇచ్చారు. పప్పు ధాన్యాలను మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. మంత్రివర్గ ఉప సంఘం నివేదిక రాగానే రైతు భరోసా ఇస్తామని తెలిపారు. వచ్చే వానాకాలం నుంచి పంట వేసిన రైతులకే రైతు భరోసా జమ చేస్తామన్నారు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కోహెడలో పండ్లు, కూరగాయల మార్కెట్ నిర్మాణం జరుగుతున్నదని చెప్పారు. ఆ రైతులకు విత్తనాలు, ఎరువులు సబ్సిడీ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని అధికారులను ఆదేశించామన్నారు. చెప్పిన మాట ప్రకారం ఈ ప్రభుత్వం అన్ని హామీలను అమలు చేస్తున్నదని తెలిపారు. గత ప్రభుత్వం ఇవ్వకుండా వదిలేసిన చాలా పథకాలకు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేయటం రైతుల పట్ల వారి సంక్షేమం పట్ల ఈ ప్రభుత్వానికి గల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. వ్యవసాయ ప్రణాళిక, వ్యవసాయాభివృద్ధికి పథకాల రూపకల్పన అనే అంశాలపై మంత్రికి ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం నేతలు సారంపల్లి మల్లారెడ్డి, అరిబండి ప్రసాదరావు వినతిపత్రం సమర్పించారు.

మొక్కజొన్నను మద్దతు ధరకు కొంటాం : మార్క్‌ఫెడ్ ఎమ్‌డీ శ్రీనివాసరెడ్డి

వానాకాలంలో పండిన మొక్కజొన్న పంటను మద్దతు ధరకు కొంటామని మార్క్‌ఫెడ్ ఎమ్‌డీ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం 5,46,865 ఎకరాల్లో సాగైందనీ, పంట దిగుబడి 9,63,102 మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా వేసినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాల్‌కు రూ. 2225 మద్దతు ధర నిర్ణయించిందన్నారు. అందుకు నాఫెడ్ కూడా అంగీకరించిందని తెలిపారు. మద్దతు ధరకనుగుణంగా మొదటగా నాఫెడ్ తరఫున జగిత్యాల, నిర్మల్ జిల్లాలతో సహా 12 కేంద్రాలను శనివారం నుంచి ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

చిరుధాన్యాలను ప్రోత్సహిస్తాం

అంతర్జాతీయ పోషక చిరుధాన్యాల సమ్మేళనంలో మంత్రి తుమ్మల

చిరుధాన్యాల ప్రాధాన్యత రీత్యా రాష్ట్రంలో వాటిని ప్రోత్సహిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'అంతర్జాతీయ పోషక చిరుధాన్యాల సమ్మేళనం'లో మంత్రి మాట్లాడారు. చిరుధాన్యాల భవిష్యత్తు గురించి చర్చించేందుకు ఈ సమ్మేళనం ఒక కీలకమైన వేదిక అన్నారు. చిరుధాన్యాలకు గొప్ప చరిత్ర ఉందని చెప్పారు. జొన్నలు, సజ్జలు, రాగులు వంటి ధాన్యాలు తక్కువ నీటిని వినియోగించి తడి వాతావరణంలో సైతం పండించే అవకాశం ఉందన్నారు. శుద్ధిచేసిన (రిఫైన్) ధాన్యాలపై ఆధారపడటం వల్ల వాటి వినియోగం తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో చిరుధాన్యాల వినియోగం 1980వ దశకంలో తొమ్మిది మిలియన్ టన్నులుంటే, ప్రస్తుతం 4.5 మిలియన్ టన్నుల వరకు తగ్గిపోయిందని చెప్పారు. వాటిని రోజువారీగా ఆహారంలోకి తెచ్చేందుకు తమ వంతు ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. వర్షాభావం, అనిశ్చిత వాతావరణ పరిస్థితులు కలిగిన ప్రాంతాల్లో సైతం చిరుధాన్యాలను సులువుగా సాగు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జంక్‌ఫుడ్‌కు అలవాటుపడటం వల్ల పోషకాహార లోపంతో కూడిన ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిరుధాన్యాలను కృత్రిమ ఆహారాలకు ప్రత్యామ్నాయం చేసేందుకు ప్రయత్నిస్తున్న ప్రయివేటు సంస్థలకు ఆయన అభినందనలు తెలిపారు.

విద్య, వైద్యం వ్యాపారమయం

- ప్రయివేటీకరణతో మాయమవుతున్న రిజర్వేషన్లు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ
- పార్టీ వికారాబాద్ జిల్లా మూడో మహాసభ



నవతెలంగాణ-తాండూరు

"విద్య, వైద్య రంగాలు వ్యాపారమయమై.. ప్రయివేట్ దోపిడీ పెరిగింది. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడంతో ఆయా రంగాల్లో రిజర్వేషన్లు కనుమరుగవుతున్నాయి. కొద్ది మంది చేతుల్లోనే దేశ సంపద కేంద్రీకృతమైంది.." అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో శనివారం సీపీఐ(ఎం) జిల్లా మూడో మహాసభ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పార్టీ శ్రేణులు ఎర్రజెండాలు చేతబట్టుకుని, బతుకమ్మలు ఎత్తుకుని.. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాసభలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ పాలన పోయి రేవంత్ రెడ్డి పాలన వచ్చినా ప్రజల స్థితిగతులు మారలేదన్నారు. రాష్ట్రంలో సొంత ఇండ్లు లేని కుటుంబాలు 28 లక్షలు ఉండటం బాధాకరమ న్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కొట్లాడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. సమాజంలో అనేక అఘాయిత్యాలు జరుగు తున్నా అరికట్టాల్సిన పోలీసు వ్యవస్థ ఉన్న వారికి ఊడిగం చేస్తూ సామాన్య ప్రజలను పట్టించుకోవ డం లేదని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించాలని గొంతెత్తిన వారిపై కేసులు పెడుతూ జైలుకు పంపుతున్నారన్నారు. ఉపాధి హామీ చట్టానికి రానురానూ కేంద్రం నిధులు తగ్గిస్తూ పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల కోసం పనిచేసేది ఎర్రజెండా మాత్రమేనని, ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఐ(ఎం) కు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, జగదీష్, జిల్లా కార్యదర్శి మహిపాల్ నాయకులు బుస్సా చంద్రయ్య, రామకృష్ణ, సుదర్శన్, మంగమ్మ నరసమ్మ పాల్గొన్నారు.



25న ప్రతికూల వాతావరణం, పంటల బీమాపై సదస్సు

- తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్ వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'చైతన్య సేద్యం' మాసపత్రిక 10వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 25న ప్రతికూల వాతావరణం, పంటల బీమాపై రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ వెల్లడించారు. సదస్సులో ముంబయి టాటా ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్ రామ్‌కుమార్ ప్రసంగిస్తారని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సెమినార్‌కు సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, రాష్ట్ర నాయకులు ఆర్.రాహుల్, జి.శివకుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో ప్రతికూల వాతావరణం వచ్చినప్పుడు పంటలకు తీవ్ర నష్టం జరుగుతుందనీ, చీడ పీడల వల్ల, అధిక వర్షాల వల్ల పంటల నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి:ఐద్వా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొత్తగూడెం పట్టణంలో ఈ నెల 21 నుండి 23 వరకు జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కోరారు. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి, ఉపాధ్యక్షులు కెఎన్ ఆశాలతతో కలిసి మహాసభ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారనీ, అయినా వారు వివక్ష ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయన్నారు. వారిపై జరుగుతున్న హింసను అరికట్టటంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో మహిళలపై లైంగిక వేధింపులు పెరిగాయన్నారు.2014 ముందు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ధరలు పెంచుతోందంటూ గగ్గోలు పెట్టి అధికారంలోకి వచ్చిన బీజేపీ అన్ని నిత్యవసర వస్తువుల ధరలను పెంచి సామాన్యుడికి అందుబాటులో లేకుండా చేసిందని విమర్శించారు. ధరలు పెరగడం వల్ల అనేకమంది మహిళలు పోషకాహారం అందక జబ్బుల బారిన పడి మరణిస్తున్నారని ఆమె ఆవేదన వెలిబుచ్చారు .ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోడీ.. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరించారని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలు ఎదర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభల్లో చర్చించి తీర్మానాలు చేస్తామని చెప్పారు. జాతీయ నాయకురాలు బృందా కారత్ హాజరయ్యే మొదటి రోజు బహిరంగ సభకు మహిళలు భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేసారు.



హనుమంతు వారసుడు నాగన్న

- ప్రజల ఈతి బాధలనుంచే కవిత్వం పుట్టుకొస్తుంది : జస్టిస్ నగేష్ భీమపాక
- నాగన్నకు హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కారం ప్రదానం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సుద్దాల పాట బాల్య జీవితంలో తనను ఎంతగానో ప్రభావింతం చేసిందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కారాన్ని అరుణోదయ నాగన్నకు ఈ ఏడాది అందజేశారు.ఈ సందర్భంగా జస్టిస్ నగేష్ మాట్లాడుతూ ప్రజల బాధలనుంచే కవిత్వం పుట్టుకొస్తుందన్నారు. ఆ కవిత్వం, పాట ప్రజలను చైతన్యం చేస్తుందని వివరించారు. ప్రతి జీవిలో చైతన్యం, ప్రతిఘటన సహజంగా ఉంటుందన్నారు. పాట, రచన తిరుగుబాటుకు ప్రేరణగా ఉండాలనీ, ఆ లక్ష్యాన్ని ఎంపిక చేసుకున్న వారే సుద్దాల హనుమంతని చెప్పారు. కలం కార్చే కన్నీరు ప్రజల చేతుల్లో ఆయుధాలవుతాయనే దానికి సుద్దాల పాటలు, నాగన్న రాగం ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు. పాటతో ప్రజా చైతన్యాన్ని కూడగట్టిన ఆ మహనీయుని పురస్కారాన్ని ప్రజా గాయకుడు అరుణోదయ నాగన్నకి అందజేయడం ముదావహమని చాకలి ఐలమ్మ యూనివర్సిటీ వీసీ సూర్యధనుంజయ్ చెప్పారు. సుద్దాల ఫౌండేషన్ అధ్యక్షుడు అశోక్ తేజ మాట్లాడుతూ, ప్రజా గాయకుడైన తమ తండ్రికి నిజమైన వారసుడు నాగన్న అని చెప్పారు. ఆయన తన చిన్ననాటి మిత్రులు దినకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, భిక్షపతిని అశోక్ తేజ సత్కరించారు. సుద్దాల ఫౌండేషన్ తరఫున కవులు, కళాకారులను సత్కరించడంతోపాటు పాటను బతికించేందుకు చేస్తున్న కృషిని పలువురు వక్తలు అభినందించారు. సభాధ్యక్షత వహించిన సుద్దాల సుధాకర్ తేజ మాట్లాడుతూ, మానవ విలువల్ని, మనిషితత్వాన్ని చాటిచెప్పాలన్నదే సుద్దాల ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమమే కవిగా తనను నిలిపిందని ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు అన్నారు. ఆ కమ్యూనిస్టు ఉద్యమం ఎంతో మంది మట్టి మనుషులను కవులు, గాయకులుగా తీర్చిదిద్దిందని చెప్పారు. కవి, రచయిత పోరెడ్డి రంగన్న, యోచన, రచ్చ భారతి, సుద్దాల ప్రభాకర్, ఉన్నత్, బాలోత్సవ కమిటీ నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, ఎస్ సోమయ్య, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కవిగా కోట్ల ప్రయోగశీలి

- 'మనసులోని కవితనై' కవితా సంపుటి ఆవిష్కరణలో మాజీ మంత్రి సింగిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సుప్రసిద్ధ కవి, కాళోజీ పురస్కార గ్రహీత కోట్ల వెంకటేశ్వరరెడ్డి ప్రయోగశీలి అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అభినందించారు. శనివారం హైదరాబాద్‌లోని మంచిరేవుల క్రాస్‌రోడ్‌లోని డ్యూవిల్లె క్లబ్‌హౌస్‌లో కోట్ల కవితానువర్తనం చేసిన 'మనుసులోని కవితనై' కవితా సంపుటిని నిరంజన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాత్రికేయులు ఆనందాచారి రాసిన సంపాదకీయాలను కవితానువర్తనం చేయడం కొత్త తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. వెంకటేశ్వరరెడ్డి నిత్య కవితా చైతన్యశీలి అని కొనియాడారు.

సభాధ్యక్షులు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు మాట్లాడుతూ..వర్తమాన సమాజం మీద చిత్తశుద్ధితో కవిత్వం రాస్తున్న కవుల్లో కోట్ల ఒకరని ప్రశంసించారు. కె.ఆనందాచారి మాట్లాడుతూ..కావ్యాన్ని తనకు అంకితం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. తన సంపాదకీయాన్ని కవితానువర్తనం చేయడం తెలుగు సాహిత్యంలో ఒక ప్రయోగం అన్నారు. ఈ కవితా సంపుటిని అనంతోజు మోహనకృష్ణ సమీక్షిస్తూ కోట్ల వెంకటేశ్వర రెడ్డి కవితా రచనలో కొత్త తరానికి మార్గదర్శకత్వం వహిస్తున్నారని కొనియాడారు. ఈ సభలో ఆత్మీయ అతిథులుగా కాసుల ప్రతాపరెడ్డి, ఒద్దిరాజు ప్రవీణ్, ఎం.వి.రాఘవరెడ్డి, అరిగె రాజు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగులను కొనసాగిస్తాం

- బకాయి వేతనాలు విడుదల చేస్తాం : టీయుఎంహెచ్ఇయూ నాయకులతో కమిషనర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

104 ఉద్యోగులను కొనసాగిస్తామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్ హామీ ఇచ్చారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కార్యదర్శులు వి.విజయవర్ధన్ రాజు నాయకత్వంలో నాయకులు కర్ణన్ కు వినతిపత్రం సమర్పించారు. గత రెండేండ్లుగా ఉద్యోగ భద్రత లేకుండా జీవిస్తున్నారనీ, 2021లో గత ప్రభుత్వం 104 ఎఫ్ డీహెచ్ఎస్ సర్వీసులను రద్దు చేసిందని తెలిపారు. దాదాపు 1,100 మంది ఉద్యోగులను సర్దుబాటు చేసి కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్థికశాఖ సలహా, సూచన ప్రాకరం డిపార్ట్ మెంట్ పరిధిలో గల డీఎంఈ, డీహెచ్, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో, కార్యాలయాల్లో అందరిని కొనసాగిస్తామనీ, ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. అదే విధంగా ఈ ఏడాది అక్టోబర్ వరకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు సుభాష్ చందర్, శేఖర్, గద్వాల శేఖర్, నాగన్న, నాగర్ కర్నూల్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో ఉద్రిక్తత

నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ధ్వంసం ఘటనపై కొన్ని హిందూ సంస్థలు శనివారం చేపట్టిన బంద్ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఆలయం వద్ద పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. పరిస్థితి చేయిదాటే ప్రమాదం ఉండటంతో పోలీసులు లాఠీలకు పని కల్పించారు. ఈ లాఠీచార్జిలో ముగ్గురు ఆందోళనకారులు, ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. పూర్తి వివరాలి ఉన్నాయి..

ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ధ్వంసం ఘటనపై ఇప్పటికే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది మహంకాళి ఆలయం నుంచి ముత్యాలమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుడి వద్ద ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గుడికి సమీపంలో ఉన్న మరో ప్రార్థన మందిరంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. వెంటనే పోలీసులు అప్రమత్తమై అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, మత సంస్థల నిర్వాహకుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ క్రమంలో పోలీసులపై కొందరు రాళ్లు, చెప్పులు, కర్రలు విసిరారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టారు. ఈ ఘటనలో ముగ్గురు ఆందోళనకారులు, ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. వీరిని వెంటనే ఆస్పత్రికి తరలించారు.

మళ్లీ గుమిగూడిన ఆందోళనకారులు

పోలీసులు చెదరగొట్టిన కొద్దిసేపటికే మళ్లీ ఆలయం ఎదుట ఆందోళనకారులు గుమిగూడారు. దాంతో వివిధ పోలీసు స్టేషన్లు, టాస్క్‌ఫోర్స్, రాపిడ్ యాక్షన్ విభాగాల నుంచి భారీగా పోలీసులు అక్కడ మోహరించారు. ఈ క్రమంలో ఆందోళనకారులు రెచ్చగొట్టేలా ప్రవర్తించినా పోలీసులు చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. వారిని నిలువరించి ఒక్కొక్కరిని బయటకు పంపారు. ఆందోళనకారులకు బీజేపీ కార్పొరేటర్ కొంతం దీపిక, పోలీస్ ఉన్నతాధికారులు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించేశారు.

రైల్వే స్టేషన్ రోడ్డుపై ర్యాలీ

ఆందోళనకారులను బయటకు పంపగా వారిలో కొందరు తిరిగి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రోడ్డుపై ర్యాలీ చేపట్టారు. మరికొంత మంది రోడ్డుపై బైటాయించడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

హాజరు మినహాయింపు దరఖాస్తు గడువు నవంబర్ 20

- ఇంటర్ బోర్డు వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే ఏడాది ఇంటర్ వార్షిక పరీక్షలకు ప్రయివేటుగా హాజరయ్యే విద్యార్థులకు హాజరు మినహాయింపు దరఖాస్తు గడువు వచ్చేనెల 20 ఉందని ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ మేరకు బోర్డు కార్యదర్శి శ్రీదేవసేన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హాజరు మినహాయింపు కోసం సోమవారం నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని తెలిపారు. ఆలస్య రుసుం రూ.200తో దరఖాస్తు గడువు డిసెంబర్ 12 వరకు ఉందని పేర్కొన్నారు. హాజరు మినహాయింపు కోరుకునే విద్యార్థులు రూ.500 చెల్లించాలని కోరారు. ఇంటర్ గ్రూప్ మార్పునకు సంబంధించి దరఖాస్తు చేసేందుకు అవకాశముందని తెలిపారు. ఆర్ట్స్/హ్యూమానిటీస్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సైన్స్ గ్రూప్ నుంచి ఆర్ట్స్/హ్యూమానిటీస్‌కు మారొచ్చని వివరించారు. వారికి సెకండ్ లాంగ్వేజ్ అదనపు సబ్జెక్టుగా ఉంటుందని తెలిపారు. బైపీసీ గ్రూప్ చదివిన వారు మ్యాథమెటిక్స్ అదనపు సబ్జెక్టుకు హాజరు కావొచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నాలుగేండ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

- రైతులు, విద్యార్థులు, ప్రజలకు ఎవరికీ ఇబ్బందిలేకుండా ప్రణాళికలు
- ఈనెలాఖరికి ప్రతి నియోజకవర్గానికీ 4 వేల ఇందిరమ్మ ఇండ్లు
- కాళ్లల్లో కట్టెలు పెట్టినా అభివృద్ధి, సంక్షేమం ఆగదు : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ- సిటీబ్యూరో హైదరాబాద్

రానున్న నాలుగేండ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో శనివారం హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి గోషామహల్ నియోజక వర్గానికి చెందిన 144 మందికి డబుల్ బెడ్‌రూమ్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు, ఇతర ఎలాంటి తేడా లేకుండా అర్హులైన పేదవారందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎలాంటి భేషజాలకు పోకుండా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా నిధులు అడిగి తీసుకుంటామని చెప్పారు. పెద్ద ఎత్తున రాష్ట్రానికి ఇండ్లను మంజూరు చేయాలని హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర హౌసింగ్ జాయింట్ సెక్రెటరీని కోరినట్టు తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, ప్రతిపక్షాలు కాళ్లల్లో కట్టెలు పెట్టినా.. అభివృద్ధి సంక్షేమం ఏదీ ఆగదని స్పష్టం చేశారు. ఏడాది కూడా పూర్తికాక ముందే ప్రభుత్వంపై రోడ్డు ఎక్కడం వల్ల బీఆర్ఎస్‌కే నష్టమని అన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేనిది, తమ ప్రభుత్వం 10 నెలల్లో చేసి చూపిస్తుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఒక మంచి జీవితాన్ని ఇవ్వాలన్న ఉద్దేశంతో తమ ప్రభుత్వం వారికి ఇండ్లు, ఉద్యోగం, ఉపాధి, కల్పిస్తుంటే బీఆర్ఎస్ ఓర్చుకోలేకపోతోందన్నారు. ఏదో తప్పు చేస్తున్నట్టుగా గోబెల్ ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేసినా ఇబ్బంది పెట్టే కుట్ర జరుగు తున్నదని, మూసీ పునర్జీవంపై అనేక ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేసింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు వారికి డబుల్ బెడ్రూంలు కేటాయించి మెప్మా ద్వారా ఉపాధి అవకాశాలు, పిల్లలకు చదువులు, అన్ని రకాల సౌకర్యాలూ కల్పిస్తుంటే ఓర్వలేకపోతున్నారని అన్నారు.

> పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

గత ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి.. రూ.40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టిందని వివరించారు. బాధ్యత గల ప్రతిపక్షమైతే నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి పరిపాలన ఎలా చేయాలో.. ప్రతిపక్షాలకు ఎలా గౌరవం ఇవ్వాలో తెలుసన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. 144 మంది పేదలకు ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా పారదర్శకంగా ఇండ్ల పట్టాలను అందించామని, ఇందులో 9 మంది వికలాంగులకు గ్రౌండ్ ఫ్లోర్‌లో కేటాయించామని చెప్పారు. ఇప్పటికే తాగునీరు, లైటింగ్, డ్రయినేజీ ఏర్పాటు చేశామన్నారు. దీపావళి పండుగను నూతన గృహాల్లో సంతోషంగా జరుపుకోవాలని, లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజా సింగ్, శ్రీ గణేష్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, రహమత్ బేగ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఈ.వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

జీవో 29 రద్దు చేయండి



(మొదటిపేజీ తరువాయి)

తోడయ్యారు. బీఆర్ఎస్ శ్రేణులు కూడా బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. ఈ క్రమంలో ఇరు పార్టీల కార్యకర్తలు ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో అక్కడ పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నేతలను, బండి సంజయ్‌ను పోలీసులు వాహనాల్లోకి బలవంతంగా ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. కొద్దిసేపు అక్కడ ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. బండి సంజయ్‌ను తీసుకెళ్లిన పోలీసులు ఆయన్ను నాంపల్లిలోగల బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వదిలారు.

తెలంగాణలో రిజర్వేషన్లను రద్దు చేసే కుట్ర : కేంద్ర మంత్రి బండి సంజయ్

తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేసే కుట్ర జరుగుతున్నదనీ, జీవో 29 దీనికి ఓ సంకేతం అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లో నిరుద్యోగుల ర్యాలీ సందర్భంగా, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వేర్వేరుగా ఆయన మీడియాతో మాట్లాడారు. సోనియా జన్మదినం నిరుద్యోగుల బలిదినం కాబోతున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి గ్రూపు-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. నిరుద్యోగ ర్యాలీలో విధ్వంసం సృష్టించేందుకు బీఆర్ఎస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. తాను పేపర్ లీకేజీ చేసినట్టు ఫ్యామిలీతో కలిసి ప్రమాణం చేసే దమ్ము ఉందా? అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. డ్రగ్స్ తీసుకుని చీకటి దందాలు చేసిన చరిత్ర కేటీఆర్‌ది అని దెప్పిపొడిచారు. తన జోలికొస్తే కేటీఆర్ చీకటి దందాలు బయటపెడతానని హెచ్చరించారు. కేటీఆర్ అహంకారం వల్లనే ఆ పార్టీ రాష్ట్రంలో ఈస్థితికి దిగజారిందన్నారు. కాంగ్రెస్‌తో కలిసి కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నది బీఆర్ఎస్ కాదా? అని ప్రశ్నించారు. ఫోన్‌ట్యాపింగ్, డ్రగ్స్, కాళేశ్వరం కేసులు మరుగున పడటానికి ఆ రెండు పార్టీల చీకటి రాజకీయాలే కారణమని ఆరోపించారు. జేసీబీ పెట్టి లేపినా తెలంగాణలో బీఆర్ఎస్ పైకి లేచే పరిస్థితి లేదన్నారు. అరెస్టు చేసిన బీజేపీ కార్యకర్తలను, నిరుద్యోగులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల బాధను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ర్యాలీ చేస్తే అడ్డుకోవడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో అశోక్‌నగర్ వచ్చిన రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. జీవో 29 ఎత్తేయాలని కోరితే హాస్టళ్లలో పోలీసులు చొరబడి విద్యార్థులను కొట్టడమేంటి? గర్భిణులను కూడా వదలకపోవడమేంటి? అని నిలదీశారు. తనను అరెస్టు చేసే దమ్ము ఎవరికుంది? అని అన్నారు.

రాజ్యాంగానికి విరుద్ధంగా రాష్ట్ర సర్కారు : మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

రాష్ట్ర ప్రభుత్వం జీవో 29 తీసుకొచ్చి రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. తమకు న్యాయం చేయాలని కోరితే నిరుద్యోగులపై లాఠీచార్జి చేయడం దుర్మార్గమన్నారు. కంచెల పాలన లేదంటూనే విద్యార్థులపై పాశవికంగా దాడి చేశారని విమర్శించారు. ఇంత నిర్బంధం, రచ్చ నడుమ గ్రూపు-1 నిర్వహించడం అవసరమా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమ పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, గజ్జెల నగేశ్, ముఠా జయసింహ, శ్రీనివాస్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డిలపై పోలీసులు దాడి చేసి అరెస్టు చేయడం దారుణమన్నారు. వారిని పోలీస్‌స్టేషన్‌లో బంధించడమేంటని ప్రశ్నించారు. విద్యార్థులతో రాజకీయాలా? అని నిలదీశారు. పదినెలల్లోనే రాష్ట్రంలో ప్రజాస్వామిక పాలన నశించిందన్నారు. సీఎం, సీఎస్ వెంటనే జోక్యం చేసుకుని జీవో 29 రద్దుపై చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జీవో29పై వాదించేందుకు బీఆర్ఎస్ తరపున సుప్రీంకోర్టులో న్యాయవాదిని పెట్టామన్నారు. బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ.. బండి సంజయ్ పొలిటికల్ బ్రోకర్‌గా మారారని విమర్శించారు. కేంద్ర మంత్రిగా కాకుండా బండి సంజయ్ రేవంత్‌రెడ్డికి సహాయ మంత్రిగా మారారని ఆరోపించారు. బీజేపీని రేవంత్‌రెడ్డికి తాకట్టు పెట్టారని విమర్శించారు. నిరుద్యోగులకు మొదటి నుంచీ అండగా ఉంటున్నది బీఆర్ఎస్ మాత్రమేనని నొక్కి చెప్పారు. ఈ రోజు మాత్రమే బండి వచ్చి హడావిడి చేసి బాగోతం నడిపారని విమర్శించారు. బడుగు విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు.

ఒకే దేశం-ఒకే ఎన్నిక రాజ్యాంగబద్ధం కాదు

(మొదటిపేజీ తరువాయి)

జాతీయోద్యమం సాగిందనీ, దాన్ని విచ్ఛిన్నం చేయడమే ఆర్ఎస్ఎస్ అజెండా అనీ, ఇప్పుడు కూడా ఆ దిశగానే ఆ సంస్థ ప్రయాణం కొనసాగుతున్నదని వివరించారు. భారత రాజ్యాంగాన్ని విదేశీ వలసవాద రాజ్యాంగం అని ప్రచారం చేస్తున్నారనీ, కానీ భారత రాజ్యాంగం ప్రజల నుంచే వచ్చిందని చెప్పారు. భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిందనీ, అణగారిన వర్గాలు, జాతులకు ప్రత్యేక అవకాశాలు కల్పించిందని తెలిపారు. భారతదేశ చారిత్రక వాస్తవికతను మరుగునపడేసి, విచ్ఛిన్నం చేసేందుకు 'విశ్వగురు' ప్రయత్నిస్తున్నారనీ, ప్రపంచానికి వెయ్యేండ్ల క్రితం నాటి కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని పరిచయం చేస్తామని చెప్తున్నారని విమర్శించారు. ఆనాటి కాలమాన పరిస్థితులకు, ఇప్పటి సాంకేతిక యుగానికి మధ్య భారీ వ్యత్యాసాలు ఉన్నాయని గుర్తుచేశారు. 'ఒకే దేశం- ఒకే ఎన్నిక- ఒకే నాయకుడు' నినాదంతో దేశ సంపదను కూడా ఒక్కరికే దోచిపెడుతున్నారని విమర్శించారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలోని రాష్ట్రాల్లో భిన్నమైన రాజకీయ పరిస్థితులు ఉంటాయనీ, ప్రభుత్వాల ఏర్పాటులో అనేక సమీకరణాలు ఉంటాయని విశ్లేషించారు. ఏదైనా రాష్ట్రంలో రెండున్నరేండ్లలో ప్రభుత్వం కూలిపోతే, మిగిలిన రెండున్నరేండ్లు అక్కడ ఎన్నికలు నిర్వహించకుండా, కేంద్రం పెత్తనం చేస్తుందా? అని ప్రశ్నించారు. ప్రధాని మోడీపై ప్రజల్లోని భ్రమలు తొలుగుతున్నాయనీ, అందువల్లే ఇప్పుడు బీజేపీకి పూర్తి మెజారిటీ కూడా రాలేదని గుర్తుచేశారు. ప్రధాన పత్రికలు ప్రభుత్వాలను ప్రశ్నించడం మానేశాయనీ, సోషల్ మీడియా ద్వారా ప్రజలు ఆ బాధ్యతల్ని నెత్తికెత్తుకొని పాలకుల్ని ప్రశ్నిస్తున్నారని చెప్పారు.

ఈ ప్రమా దాన్ని పసిగట్టే కేంద్ర ప్రభుత్వం బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు పేరుతో సోషల్ మీడియాపై ఆంక్షలు విధిస్తూ, నియంత్రణలో ఉంచుకోవాలని ప్రయత్నిస్తున్నదని వివరిం చారు. ప్రశ్నించే గొంతులు పెరగడంతో కేంద్రం 'ఫ్యాక్ట్ చెక్' ను ఏర్పాటు చేయా ల్సి వచ్చిందన్నారు. దేశంలో 60 కోట్ల మంది మొబైల్ ఫోన్లు వినియో గిస్తున్నా రనీ, రిజిస్ట్రేషన్ల పేరుతో వారిని ఆపడం ఎలా సాధ్యమని అన్నారు. పాలకుల్ని ప్రశ్నిస్తున్న సోషల్ మీడియాను సామాజిక ఉద్యమంగా మార్చేదిశగా ప్రయత్నాలు జరగాలని సూచించారు. కార్యక్రమానికి 'ఐలూ' రాష్ట్ర అధ్యక్షులు జీ విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కార్యదర్శి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. మహీంద్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ పంపిన సందేశాన్ని సభలో చదివి వినిపించారు. అంతకుముందు ఇదే వేదికపై నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన 'సిద్ధాంతకర్త-నిబద్ధనేత-సీతారాం ఏచూరి, జీవితం, పోరాటం, జ్ఞాపకాలు' అనే పుస్తకాన్ని ప్రబీర్ పుర్కాయస్థ ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు కె ఆనందాచారి, జనరల్ మేనేజర్ వాసు, మేనేజర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మూసీ అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదు

- పునరుజ్జీవానికి రూ.26వేల కోట్లు సరిపోతాయ్ : ఎమ్మెల్యే , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నాగోల్ ఎస్టీపీ పరిశీలన



నవతెలంగాణ- నాగోల్

మూసీ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, నిరుపేదలకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా వారి ఇండ్లను కూల్చేస్తూ నిరాశ్రయులను చేస్తూ దోచే దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నాగోల్ డివిజన్ మల్లికార్జున హిల్స్‌లో ఎస్‌టీపీ ప్లాంట్‌ను శనివారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి కేటీఆర్ సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల వల్లే మూసీ మురికి కూపం అయిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని, అయితే గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుతావల్లే అలా అయిందని ఒప్పుకున్నట్టే కదా అని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చే నాటికి 700 ఎంఎల్‌డీ శుద్ధి అవుతుండేదని.. తాము 2 వేల ఎంఎల్‌డీ మురుగు నీరు శుద్ధి చేయాలని అనుకున్నామని చెప్పారు. మూసీ పునరుజ్జీవం చేయాలంటే 31 ఎస్టీపీలను రూ.3866 కోట్లతో 1200 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఏర్పాటు చేయా లని సంకల్పించామని తెలిపారు. ఎస్టీపీలు కట్టడం ద్వారా మురుగు నీరు స్వచ్ఛంగా మారిందన్నారు. భారతదేశంలో అతిపెద్ద సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నాగోల్ ఎస్‌టీపీ అన్నారు. గతంలో 170 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉంటే దాన్ని 320 ఎంఎల్‌డీకి పెంచినట్టు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఎస్టీపీలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని తెలిపారు. మూసీపై 15 చోట్ల బ్రిడ్జీలు నిర్మించాలని ప్రణాళికలు రూపొందించామని, అందుకు రూ.545 కోట్లు మంజూరు చేశామని అన్నారు. రోడ్ కం బ్రిడ్జి కం చెక్ డ్యాం నిర్మించాలనుకున్నామని చెప్పారు. మూసీపై రూ.10 వేల కోట్లతో భారీ స్కై ఓవర్ నిర్మించాలనుకున్నామని తెలిపారు. ఎంత శుద్ధి చేసినా మూసీ నీళ్లు తాగేవి కాదని చెప్పారు. అందువల్ల కొండపోచమ్మ సాగర్ నుంచి మూసీకి నీళ్లు తేవాలని నిర్ణయించామన్నారు. గోదవారి నుంచి నీళ్లు తెచ్చేందుకు రూ.1100 కోట్లతో ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఆ ప్రాజెక్టుకు గతేడాది మే 18న శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్లాన్ వేశారని ఆరోపించారు. రూ.26 వేల కోట్లతో మొత్తం మూసీ పునరుజ్జీవం అవుతుందని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్నారని విమర్శిం చారు. బళ్లో చాక్‌పీసులకు పైసలు లేవు, బస్తీ దవాఖానలో డాక్టర్లకు వేతనాలు లేవు.. మందులకు పైసలు లేవు.. ఆరు గ్యారంటీలకు పైసలు లేవు కానీ మూసీకి లక్షన్నర కోట్లు ఎక్కడివని ప్రశ్నించారు.

> ఆ పేరుతో జరిగే దోపిడీకి వ్యతిరేకం

మూడు నెలలు మూసీ దగ్గర ఉండటానికి సిద్ధం

మూడు నెలలు మూసీ దగ్గర ఉండాలని రేవంత్ అంటున్నారని.. మూడు నెలలు కాకపోతే మూడేండ్లు ఉంటా.. తాను చిన్నప్పటి నుంచి మూసీ దగ్గరే నివసించానని కేటీఆర్ తెలిపారు. ఢిల్లీకి పైసలు కావాలంటే తలా కొన్ని ఇస్తాం కానీ మూసీ తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని మాట్లాడొద్దని సూచించారు. మూసీకి రెండువైపుల రిటెయినింగ్ వాల్ కట్టాలని, మూసీ మీద ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ ఆలీ, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద్ గౌడ్, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, మాజీ కార్పొ రేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లండి

- కూనంనేనికి టీజీజేఎల్ఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టీజీజేఎల్ఏ-475) కోరింది. ఈ మేరకు ఆయనకు శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ వినతిపత్రం పంపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు విడుదలయ్యేలా చూడాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని తెలిపారు. నూతన పీఆర్సీని ప్రకటిం చాలని పేర్కొన్నారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించేలా చూడాలని కోరారు. తెలంగాణ ఉద్యోగ జేఏసీ నాయకు లతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించి సమస్యలను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని సూచించారు.

పాలన చేతకాకుంటే పక్కకు తప్పుకో

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలన చేతకాకుంటే సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పి తప్పుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి కాంగ్రెస్ కార్యకర్తలతో బుల్డోజర్లు నడిపించి కేటీఆర్, హరీశ్ రావులను చంపుతా అంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసు బుక్ చేయాలని ఆయన డీజీపీని కోరారు. నిజనిర్ధారణ కమిటీలు పౌర సమాజం వేస్తుందన్న సంగతి కూడా తెలియకుండా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారని ఎద్దేవా చేశారు. చట్టప్రకారం ఫార్మ్‌హౌజ్‌లపై చర్యలు తీసుకోకుండా ఎవరూ అడ్డుగా లేరని స్పష్టం చేశారు. మూసీ పేరుతో జరిగే దోపిడీపై ప్రజలకు తిరగబడతారని హెచ్చరించారు. రైతులను, ప్రజలను మోసం చేసిన రేవంత్ సర్కార్‌పై జనాల్లో అసహనం పెరిగిందని చెప్పారు. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు పంటలను ప్రయివేటుకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్ 1 ఆందోళనకు బండి సంజయ్ మద్దతు రేవంత్ రెడ్డి కుట్రలో భాగమేనని తెలిపారు.

పెన్షనర్ల పోరుబాట

5,6 తేదీల్లో ఎస్టీవో కార్యాలయాల ఎదుట నిరసన

- నవంబర్ చివరి వారంలో చలో సచివాలయం
- సీఎస్‌కు టీపీపీఆర్‌పీఏ నోటీసు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఎన్ని విజ్ఞప్తులు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదనీ, పోరాటమే శరణ్యం అంటూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీపీపీఆర్‌పీఏ) ప్రకటించింది. దశలవారీ పోరాట కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారికి శనివారం టీపీపీఆర్‌పీఏ రాష్ట్ర అధ్యక్షులు పోతుల నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి నోటీసును అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల ఐదు, ఆరు తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఎస్టీవో కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

రెండో దశలో జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు చేసి జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి మెమొరాండం సమర్పించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. బకాయి ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలనీ, పెన్షనర్లకు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మెరుగైన ఆరోగ్య సదుపాయాలు కల్పించాలనీ, 20 ఏండ్ల సర్వీసుకు పూర్తి పెన్షన్ చెల్లించాలని కోరారు.

రూ.398 వేతనంతో పనిచేసిన సర్వీసుకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలనీ, వేతన సవరణ కమిషన్ నివేదికను తెప్పించుకుని అమలు ప్రక్రియ మొదలు పెట్టాలని సూచించారు. పెన్షనర్లకు సంబంధించిన 16 డిమాండ్లతో పోరాట కార్యక్రమం నోటీసు ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారం చేయకుంటే నవంబర్ చివరివారంలో హైదరాబాద్‌లోని చలో సచివాలయం వంటి పోరాటానికి పిలుపు ఇస్తామని పేర్కొన్నారు.

శిరోముండనం ఘటనపై జాతీయ మానవహక్కుల కమిషన్‌కు వైెళాం

- మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శిరోముండనం ఘటనపై జాతీయ మానవహక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేస్తామని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గం లింగాల మండలంలో ముగ్గురు యువకులకు ఎస్సై శిరోముండనం చేసినట్టు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో అధికార పార్టీ అరాచకాలకు పాల్పడుతుందనీ, పోలీసులు ఆ పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని తెలిపారు.



దేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర సంస్మరణ కమిటీ చార్మినార్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. వారి వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్



హరిణ వనస్థలి వాకర్స్ చేయూత

నవతెలంగాణ-హయత్‌నగర్

హరిణ వనస్థలి వాకర్స్ మన్సూరాబాద్ వాకర్ వెంకటేశ్వర్లు.. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కావడం వలన గత ఆరు నెలలుగా ఓ రిహాబిలిటేషన్ సెంటర్లో చికిత్స చేయిస్తున్నారు. ఈ కష్టకాలంలో వెంకటేశ్వర్లు ఆర్థిక, వైద్య ఖర్చుల భారం మోస్తున్న కుటుంబానికి సహాయం అందించడానికి తోటి వాకర్స్ ఆయన కుటుంబానికి అండగా నిలబడ్డారు. మహవీర్ హరిణ వనస్థలి వాకర్ అసోసియేషన్ నుండి 1,03,001 రూపాయలు సమకూర్చి ఆ మొత్తాన్ని వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎ. విక్రమ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పోచబోయిన జగదీష్ యాదవ్, ఎం. నరసింహులు, వెంకటయ్య, జి. శ్రీనివాస్, ఎస్. కిషన్, కే.గోపీ కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 15వ డివిజన్ పరిధిలో ఉన్న పద్మావతి కాలనీ, సీతా ఎవెన్యూ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందన్నారు. ఇప్పటికే బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, బండారి మనోహర్, నాయకులు ఎర్ర జైహింద్, అఫ్జల్, మహమ్మద్ అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.





పాఠశాల స్థాయి నుంచే
విద్యార్థులు సత్ప్రవర్తనతో ఉండాలి

- చైల్డ్ చాప్టర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు జాకీర్ హుస్సేన్

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి సత్ప్రవర్తనతో కలిగి ఉండాలని చైల్డ్ చాప్టర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు జాకీర్ హుస్సేన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపుర్ మెట్ మండలం అనాజ్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో చైల్డ్ చాప్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'రైజ్ యువర్ వాయిస్' బొమ్మల కథల పుస్తకాలను శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం ద్వారా పిల్లలకు వ్యక్తిగత శరీర భాగాలు, మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడా, ఎవరైనా తప్పుడు వైఖరితో ప్రవర్తిస్తే నమ్మిన పెద్దలతో ఎలా చెప్పుకోవాలో వివరించారు. అలాగే, అటువంటి పరిస్థితుల్లో తమను తాము మరియు ఇతరులను ఎలా రక్షించుకోవాలో పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలకు "ధైర్యమే జీవితం అని , భయం మరణం" అని చెప్పారు. ఎవరైనా మీతో తప్పుగా ప్రవర్తిస్తుంటే భయపడాల్సిన అవసరం లేదని, నమ్మిన పెద్దలకు ధైర్యంగా చెప్పాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి సబితమ్మ పరామర్శ

నవతెలంగాణ- బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఆల్మాస్‌గూడ గ్రామానికి చెందిన చప్పిడి బాల్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.



గిరిజన రాష్ట్ర స్థాయి
సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఖమ్మంలో జరిగే గిరిజన రాష్ట్ర స్థాయి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ ధర్మా నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యం. గోపినాయక్‌లు కోరారు. ప్రజా ఉద్యమాల సారథి గిరిజన వ్యవస్థాపక నాయకులు అమరజీవి గుగులోత్ ధర్మా నాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ బంజారా బస్తీలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 5, 6వ తేదీల్లో ఖమ్మంలో జరిగే గిరిజన సంఘం రాష్ట్ర సమ్మేళనానికి వేలాది మంది తరలిరావాలని కోరారు. గిరిజన హక్కుల కోసం పోరాడిన గిరిజన వ్యస్థాపిక నాయకులు గుగులోత్ ధర్మా గిరిజనులకు హక్కులు కల్పించడం కోసం అటవీ హక్కుల కోసం చట్టం చేయాలని నాయక్ వామపక్ష పార్టీలు గిరిజన సంఘాలు ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రవ్యాప్తి ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారని అన్నారు. తెలంగాణలో పెరిగిన గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని కోరారు. ఈ సమావేశంలో కే. సోమ్లా నాయక్, యన్. ఈశ్వర్ నాయక్, ఆర్. పవన్ నాయక్, కే. సాయి నాయక్, సింధు ప్రియ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చంపాపేట్

ఖమ్మంలో జరిగే గిరిజన రాష్ట్ర స్థాయి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ ధర్మా నాయక్ కోరారు. ఈ మేరకు శనివారం కరపత్రాన్ని విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ఇప్పటికి రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని కేటాయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. సంవత్సరం కావస్తున్నా చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు వీ.రాంకుమార్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలు నాయక్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఏ. కృష్ణా నాయక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్. కిషన్ నాయక్, లక్ష్మి బుజ్జి, నరి, చిన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



శ్రీ చైతన్య పాఠశాలలో
ఉచిత దంత వైద్య శిబిరం

చైర్మెన్ మల్లెంపాటి శ్రీధర్

నవతెలంగాణ- బడంగ్‌పేట్

ఉచిత దంత వైద్య శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ చైతన్య పాఠశాల చైర్మెన్ మళ్ళెంపాటి శ్రీధర్ అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో అభిరాం ఆస్పత్రి దంత వైద్యులు డాక్టర్ మధుసూదన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వారు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీ విద్య, ఏజీఎం. ఖాసీం అలీ, కో ఆర్డినేటర్ రమేష్, ప్రిన్సిపల్ విజయలక్ష్మి సీ బ్లాక్ ఇంచార్జి శ్రీనివాస్, ఏట ఉపేందర్, ప్రైమరీ ఇంచార్జిలు మయూరి, శ్వేత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్
అధ్యక్షుడిగా సయ్యద్ కాజిమ్ అలీ హాష్మీ



నవతెలంగాణ - మలక్‌పేట్

ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (IHRO) దక్షిణ భారత దేశం అధ్యక్షుడిగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త SKAH గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సయ్యద్ కాజిమ్ అలీ హాష్మీని నియమించినట్లు సంస్థ వైస్ చైర్‌పర్సన్ కెప్టెన్ రామ ఆర్య ఉత్తర్వులు జారీ చేశారు. దక్షిణ భారతదేశానికి (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ మరియు తమిళనాడు) అధ్యక్షుడిగా నియమించడం పట్ల సయ్యద్ కాజిమ్ అలీ హాష్మీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాజిమ్ అలీ మాట్లాడుతూ నా అనుభవం మరియు నైపుణ్యంతో మానవాళి యొక్క ఉత్తమ ప్రయోజనాల కోసం నిజాయితీ మరియు గౌరవంతో ఈ బాధ్యతలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

72 కుటుంబాలకు పట్టాలివ్వాలని వినతి



నవతెలంగాణ - చంపాపేట్

సీపీఐ(ఎం) పార్టీ జంగంమేట్ డివిజన్ ఆధ్వర్యంలో 72 కుటుంబాలకు పట్టాలను వెంటనే ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్ (ఆర్డీఓ)రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ మహిపాల్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ జంగంమేట్ డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్ మాట్లాడుతూ... బండ్లగూడ మండలం జంగంమేట్ ఎం.సి.హెచ్ క్వార్టర్స్‌లో 72 కుటుంబాల దళితులు నివసిస్తున్న స్థలాలు ప్రభుత్వం తీసుకొని 16 నెలల్లో డబుల్ బెడ్ రూం ఇండ్లను కట్టిస్తామని గత గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. 16 నెలలు కాదు కదా 9 సంవత్సరాలైనా ఇప్పటివరకు అలాట్మెంట్ చేయలేదని, పట్టాలు ఇవ్వలేదని మండిపడ్డారు. గత ప్రభుత్వం మోసం చేసిందని, ప్రస్తుతం ప్రభుత్వం వారికి వెంటనే అలాట్మెంట్ పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయమై హైదరాబాద్ ఆర్డీఓ మహిపాల్‌కు వినతి పత్రం అందజేసినట్టు పేర్కొన్నారు. ఆర్డీఓ సానుకూలంగా స్పందిస్తూ.. కొన్ని రోజుల్లో అలాట్మెంట్ పట్టాలు ఇస్తామని, బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారని తెలిపారు. వినతి అందజేసిన వారిలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా నాయకులు కిషన్ రామ్ కుమార్ తదితరులు ఉన్నారు.

బీఎస్పీ ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షుడిగా సంపత్



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం బీఎస్పీ అధ్యక్షుడిగా సంపత్‌ను నియమించారు. బహుజన్ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాటపాక రమేష్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెల ధర్మేందర్ మరియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పల్నాటి రాములు చేతుల మీదుగా బహుజన్ సమాజ్ పార్టీ ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడిగా వేముగంటి సంపత్‌ను నియమించడం జరిగింది.

ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ మాన్యవర్ కాన్సిరాం ఆశయ సాధన కోసం మాయావతి నాయకత్వాన్ని బలపరుస్తూ పూర్తిస్థాయిలో పార్టీకి పనిచేస్తానని అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక్క సమస్య పరిష్కారానికి నిరంతరం ప్రజలలో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. అన్ని డివిజన్‌లలో బస్తీలు సెక్టార్, బూతు కమిటీలు ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎలక్షన్లలో అన్ని డివిజన్ల నుండి పోటీకి దిగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండారి రవికుమార్, జిల్లపల్లి శశిధర్, జగన్, గువ్వల సాయి, రామకృష్ణ, మేకల లక్ష్మణ్, జక్కయాదగిరి, దాసరి వినయ్, కొమ్ము పవన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన టెక్నాలజీతో జంట హత్య కేసు ఛేదన



నవతెలంగాణ- హయత్‌నగర్

అధునాతన టెక్నాలజీని ఉపయోగించి జంట హత్యల కేసును కందుకూరు పోలీసులు ఛేదించారు. ఎల్బీనగర్‌లో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుడి వివరాలను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం,దాసర్ల పల్లి గ్రామానికి చెందిన ఉప్పాల శివ కుమార్.. ఇతను మద్యానికి బానిసై ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసుకుని వారిపై అత్యాచారం చేసి, వినకపోతే హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యేవాడు. కందుకూరు మండలంలోని కొత్తగూడ గ్రామంలోని 8 ఎకరాల్లో ఉన్న తోటలో నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన మూగ ఉషయ్య, శాంతమ్మ దంపతులు వాచ్ మెన్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 16న వాచ్‌మెన్ దంపతులిద్దరు హత్యకు గురయ్యారు. ఫిర్యాదు రాగానే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. చనిపోయిన వారి ఫోన్ నుండి వచ్చిన కాల్స్ ఆధారంగా నిందితుడు కందుకూరుకు చెందిన వాడుగా గుర్తించారు. అతని పింగర్ ప్రింట్స్‌తో 2023 మార్చి 3న కందుకూరులో చెంచు శైలజా రెడ్డి అనే మహిళ హత్యకు కారణం ఇతడే అని పోలీసుల ముందు నేరం ఒప్పుకున్నట్లు సీపీ తెలిపారు. తదనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ జోన్ ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీ కాంత్ రెడ్డి, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, సీతారాం పాల్గొన్నారు.

మాలల హక్కుల సాధనే ధ్యేయం



- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక రాష్ట్ర కో చైర్మెన్ గద్ద శ్రీనివాస్

నవతెలంగాణ-తుర్కయంజాల్

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, మాలల హక్కుల సాధనే ధ్యేయంగా ఐక్య వేదిక పోరాడుతుందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక రాష్ట్ర కో చైర్మెన్ గద్ద శ్రీనివాస్ అన్నారు. మాల మహానాడు ఆధ్వర్యంలో తుర్కయంజాల్ అంబేద్కర్ చౌరస్తాలో మాలల ఆత్మగౌరవ సభ వాల్ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గద్ద శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 27న నాగర్ కర్నూల్‌లో జరిగే మాలల ఆత్మగౌరవ సభకు మాల కులస్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మాజీ సర్పంచ్ చెవుల దశరథ, జై భీమ్ యువజన సంఘం మాజీ అధ్యక్షులు నల్లవెల్లి వెంకటేష్, చక్రపాణి, తావుల శ్రీనాథ్, చెవుల నరేందర్, సల్వాది యాదగిరి, సల్వాది రమేష్, మద్దెల కృష్ణ, కామల రామస్వామి, నీరెడ్డి రాజు, సుందరయ్య టీచర్, రాము, రేనాస్ సామ్రాట్, సాయి గౌరవ్, బల రామ్, వినోద్, భాను ప్రసాద్, లక్ష్మయ్య, కృష్ణయ్య, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ- నాగోల్



ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివ నాగ ప్రసాద్ అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాగోల్ డివిజన్లోని బండ్లగూడలో హెూమ్ కేర్‌ను నడుపుతున్న నార్కెడి మిల్లి వీర వెంకట శ్రీనివాసు రావు అనే వ్యక్తి ఈ నెల 6వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో తమ సొంత ఊరికి వస్తున్నానని తూర్పుగోదావరి జిల్లా కడియంలో ఉన్న తన తండ్రికి సమాచారం ఇచ్చి నేటికీ చేరుకోలేదని పోలీసులు తెలిపారు. గత మూడు నెలలుగా శ్రీనివాస హెూమ్ కేర్‌ను నడుపుతున్నాడని, తమ కుమారుడు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ 6వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో నాన్నగారు మన సొంత ఊరికి వస్తున్నాను అని చెప్పి.. నేటికీ తమ సొంత ఊరికి రాలేదన్నాడు. తన కుమారుని సెల్ ఫోన్‌కు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ లో ఉందని బాధితుని తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ శివ నాగ ప్రసాద్ తెలిపారు. తమ కుమారుని సమాచారం కోసం బంధుమిత్రుల వద్ద విచారించినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రూ.20,72,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-కాప్రా
ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డాక్టర్ ఎఎస్‌రావు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన 55 మంది సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ.20,72,500 విలువ చేసే చెక్కులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదని, ఆ డబ్బులను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం చెక్కులు త్వరగా వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సోమ శేఖర్ రెడ్డి, సాయి జెన్ శేఖర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నానమ్మను హత్య చేసిన మనుమడు



నవతెలంగాణ-మేడ్చల్
సొంత నానమ్మ మనవడు తల పగలగొట్టి హత్య చేసిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సత్యనారాయణ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని రావల్‌కోల్ గ్రామంలో నివాసం ఉంటున్న బాలమ్మను (62) ఆమె సొంత మనవడే ప్రశాంత్ (22) ఇంట్లోని చిన్న సిలిండర్‌తో తల పగలగొట్టి శుక్రవారం అర్ధరాత్రి హత్య చేశాడు. నిందితుడు ప్రశాంత్.. తన నానమ్మ బందెల బాలమ్మను, తండ్రి మధును తనకు డబ్బులు ఇవ్వాలని కోరగా వారు నిరాకరించడంతో కల్లు తాగి అదే మత్తులో బాలమ్మను ఇంట్లోని చిన్న గ్యాస్ సిలిండర్‌తో తలపై కొట్టి హత్య చేశాడు. అంతకుముందు తన తండ్రి మధును సైతం విచక్షణ రహితంగా కొట్టాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నీలిమ మెడికల్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ అవగాహనా సదస్సు



నవతెలంగాణ-ఘట్కేసర్
నీలిమ మెడికల్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్‌పై శనివారం విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నీలిమ మెడికల్ కాలేజీ డీన్ డా. లక్ష్మి ప్రసన్న , పోచారం ఎస్సై నాగేశ్వర్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మెడికల్ విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, సామజిక బాధ్యత మీద అవగాహన కల్పించారు. ర్యాగింగ్ చేయడంతో కలిగే పరిణామాలు స్పష్టంగా తెలిపారు. ర్యాగింగ్ చట్టరిత్యా నేరం అని పలు చట్టాలను వివరించారు. కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ డైరెక్టర్ అఫ్ అడ్మిషన్స్ డా. మహిమతి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా. సి. మల్లేషా , ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 ప్రోగ్రాం ఆఫీసర్ డా. జె. రాజేంద్ర కుమార్, నిమ్స్ డిపార్టుమెంట్ కోఆర్డినేటర్ డా. సంధ్య డా. జియా ప్రొఫెసర్లు, ఎన్ ఎస్ ఎస్ ట్రైనీలు ఎంఎస్ఎస్ వలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై బొంతు శ్రీదేవి సమీక్ష



నవతెలంగాణ-కాప్రా
చర్లపల్లి డివిజన్‌లోని వివిధ కాలనీలలో జరుగుతున్న పనులు, పెండింగ్ లో ఉన్న పనులపై చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ శనివారం జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ డీ ఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి,, సైట్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

విఠల్ నాయక్‌కు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-కాప్రా
మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్‌గా నియమితులైన కాంగ్రెస్ నాయకులు విఠల్ నాయక్‌కు పలువురు కాంగ్రెస్ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ధీరావత్ శేఖర్ నాయక్, ధీరావత్ బాలాజీ నాయక్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కాలనీల అభివృద్ధే ప్రధాన ధ్యేయం : శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా
కాలనీల అభివృద్ధే ప్రధాన ధ్యేయమని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. చర్లపల్లి డివిజన్‌లోని కుషాయి గూడ ప్రైమరీ స్కూల్ వెనకాల డ్రయినేజీ సమస్యకు పరిష్కరించాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌కు లోకమత కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీసీ రోడ్ల వేయాలని వినతి పత్రం అందజేశారు. బీఆర్ అంబేద్కర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రయినేజీ పైపులైన్, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్‌కు విన్నవించారు. అధికారులతో సర్వే చేయించి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని కార్పొరేటర్ వారికి హామీ ఇచ్చారు.

చికెన్, మటన్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా
మల్లాపూర్ మనిక్ చంద్ రోడ్డు శ్రీకర పబ్లిక్ స్కూల్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీబాలాజీ చికెన్, మటన్ షాప్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన చికెన్, మటన్ అందజేయాలని షాప్ యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, హమాలీ శ్రీనివాస్, దయాకర్ రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న ప్రతీ కార్యకర్తను అదుకుంటా

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్
ఆపదలో ఉన్న ప్రతీ కార్యకర్తను ఆదుకుంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చిల్కానగర్ డివిజన్ మల్లికార్జున్ నగర్‌కు చెందిన బీఆర్ఎ స్ నాయకులు రామచందర్ నాయక్ భార్య తులసి అనారోగ్యంతో బాధపడు తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి శనివారం బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామచంద్రనాయక్‌తో మాట్లాడుతూ.. చికిత్సకు కావాల్సిన ఎలాంటి సహాయం అయినా చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీకి అంకిత భావంతోపని చేసే ప్రతి కార్యకర్తకు ఏ ఆపద వచ్చినా తాను ఆదుకుంటానని తెలిపారు.కార్యక్రమంలో మల్లికార్జున్ నగర్ నాయకులు అశోక్ చారి, ఉపేందర్, సుందర్, సంతోష్, ఓర్సు పెంటయ్య తదితరులున్నారు.

నాచారంలో అధికారులు, కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా
కాప్రా సర్కిల్‌కు కొత్తగా వచ్చిన ఈఈ నాగేందర్, డీఈ రూప, ఏఈ శ్రవంతిలతో కలిసి కార్పొరేటర్ శాంతి సాయి జన్‌శేఖర్ నాచారంలో పర్యటించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద భవానీ నగర్ ప్రధాన రోడ్డులో ఉన్న పాత బ్రిడ్జి స్థానంలో సుమారు రూ. 94 లక్షల వ్యయంతో మంజూరైన నూతన బ్రిడ్జి పనులను తక్షణమే ప్రారంభించాలని, అలాగే అంబేద్కర్ నగర్ పోచమ్మ గుడి వద్ద సుమారు రూ.54 లక్షల వ్యయంతో మంజూరైన నూతన బ్రిడ్జి పనులను ప్రారంభించాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేఖర్, విఠల్ యాదవ్, రామకృష్ణ, మధుసూదన్ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, సుగుణాకర్ రావు, కిష్టయ్య, గణేష్, నర్సింగ్ రావు, సుధాకర్, హరిప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తదితరులు ఎబాల్గొన్నారు.

ఫ్లో మీటర్‌తో ప్రతి చుక్కా లెక్కగట్టాలి

- ఉస్మాన్ నగర్‌లో జంట రిజర్వాయర్ల ట్రయల్ రన్
- 1.27 లక్షల మందికి చేకూరనున్న లబ్ధి
- నవంబర్ మొదటి వారంలోగా ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎండీ ఆదేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో
ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో విస్తరించిన గ్రామాలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు తాగునీటి సరఫరా చేసేందుకు జలమండలి చేపట్టిన ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్ - 2, ప్యాకేజీ 2 లో ఉన్న పటాన్ చెరు నియోజకవర్గంలోని ఉస్మాన్ నగర్‌లో నిర్మిస్తున్న 4, 2 ఎంఎల్ సామర్థ్యం కలిగిన జంట రిజర్వాయర్ల ట్రయల్ రన్‌ను ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడు తూ.. పటాన్ చెరు నియోజకవర్గంలోని తెల్లాపూర్ మున్సిపాలిటీ లో తాగునీటిని ఈ రెండు రిజర్వాయర్ల నుంచి సరఫరా చేస్తామని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ లైన్లు పూర్తయి రిజర్వాయర్ల నిర్మాణం దాదాపు చివరి దశకు చేరుకుందన్నారు. ఇప్పటికే 2 ఎంఎల్ రిజర్వాయర్ ఇన్ లెట్, అవుట్ లెట్ నిర్మాణం పూర్తి కావడంతో ప్రయోగాత్మకంగా ట్రయల్ రన్ నిర్వహించామన్నారు. మిగిలిన ఎలక్ట్రికల్ పనులు, క్లోరిన్ రూమ్, 4 ఎంఎల్ రిజర్వాయర్‌కు సంబంధించిన పెండింగ్ పనులు పూర్తిచేసి నవంబర్ మొదటి వారంలోగా ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ ఉస్మాన్ నగర్ రిజర్వాయర్ల సర్వీస్ ఏరియాకు సబంధించిన వాటర్ ఆడిట్‌ను ప్రారంభించాలని సూచించారు. ప్రయోగాత్మకంగా ఈ రిజర్వాయర్ల నుంచి సరఫరా చేస్తున్న ప్రతి చుక్కనూ లెక్క కట్టేలాగా ఫ్లో మీటర్ ను పెట్టి, చివరి వినియోగదారుని వద్ద కూడా మీటర్ రీడింగ్ సరిపోయేలా లెక్క కడితే ట్రాన్స్ మిషన్ లాస్ తెలుస్తుందన్నారు. దాని ద్వారా వథాగా పోతున్న నీటిని గుర్తించి దాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకునే అవకాశముంటుందని చెప్పారు. ఫలితంగా ఖర్చు కూడా తక్కువ అవుతుందన్నారు. రూ.30 కోట్లతో నిర్మిస్తున్న ఈ రెండు రిజర్వాయర్లు అందుబాటులోకి వస్తే దాదాపు లక్ష మంది జనాభాకు శుద్ధి చేసిన తాగునీరు లభిస్తుందని వివరించారు. 120 బల్క్ కనెక్షన్లు రానున్నట్లు, అందుకోసం ఇప్పటికే 22 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ లైన్లను నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీజీఎం పద్మజ, జీఎంలు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మూడు రోజులపాటు టెక్నికల్ సెమినార్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో
ప్రయివేటు సెక్టార్‌లో పని చేస్తున్న ప్రయివేటు ఎలక్ట్రిషన్ల కోసం పోలీ క్యాబ్ కంపెనీ వారు మూడు రోజులపాటు టెక్నికల్ సెమినార్లు నిర్వహించనున్నారు. ఎలక్ట్రిషన్ ప్రయోజనాల కోసం ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఈనెల 21, 22 తేదీల్లో మదీనాగూడ రావిలా బ్రాండ్ బంక్వ్యాట్ హాల్‌లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు రోజులపాటు టెక్నికల్ సెమినార్ ఉంటుందనీ, 23వ తేదీన నాగోల్ ప్రాంతంలో వైట్ పెర్ల్ బంక్వ్యాట్‌లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 6:30 వరకు టెక్నికల్ సెమినార్ ఉంటుందని తెలంగాణ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రయివేటు సెక్టార్‌లో పని చేస్తున్న ఎలక్ట్రిషన్లు గానీ, సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్న ఎలక్ట్రిషన్‌గానీ, ఇండస్ట్రియల్‌లో పని చేస్తున్న ఎలక్ట్రిషన్లు గానీ, గహ సముదాయంలో పని చేస్తున్న ఎలక్ట్రిషన్లు గానీ ఈ టెక్నికల్ సెమినార్‌కు హాజరు కావాలని కోరారు. పోలిక్యాబ్ కంపెనీ వారు ఈ సెమినార్‌కు హాజరైన ప్రతి ఒక్కరికీ ఇన్సూరెన్స్ సౌకర్యంతోపాటు, ఎలక్ట్రికల్స్‌లో మెలుకువలను నేర్పిస్తారని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్ ప్రమాదం జరగకుండా ఉండాలంటే ఇలాంటి సెమినార్లు ఎంతో అవసరం. ఈ టెక్నికల్ సెమినార్‌ను ప్రతి ఎలక్ట్రిషన్ సద్వినియోగం చేసుకోవాలని కంపెనీ ప్రతినిధులు, అసోసియేషన్ వారు పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఇలాంటి సెమినార్లు నిర్వహించడం ఇదే మొదటిసారి అని అసోసియేషన్ అధ్యక్షుడు నక్క యాదగిరి తెలిపారు.

రూ.8000 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్
- ఈసీఐఎల్ రాధిక ఎక్స్ రోడ్డులో విద్యార్థులతో కలిసి రాస్తారోకో



నవతెలంగాణ-కాప్రా
ఆరేండ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. ప్రయివేట్ డిగ్రీ, పీజీ, మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలతో చర్చించి విద్యార్థుల ఫీజు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శనివారం ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ రాధిక ఎక్స్ రోడ్డులో రాస్తారోకో చేశానెరు. ఈ సందర్భంగా సంతోష్ రాథోడ్ మాట్లాడుతూ.. ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా రకాల ప్రవేశ పరీక్షలు రాసి ఉన్నత చదువులకు వెళ్ళే విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. పేద విద్యార్థులు అప్పులు చేసి మరీ సర్టిఫికేట్స్ తీసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం యాజమాన్యాలతో చర్చించి పేద విద్యార్థులకు నష్టం లేకుండా నిధులు విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలు కంటే ప్రయివేట్ కళాశాలలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. వాటిలో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. విద్యలో విప్లవాత్మక మార్పులంటూ ఇంటర్నేషనల్ స్కూల్స్ ప్రారంభిస్తూనే గత ప్రభుత్వం వలె విద్యారంగానికి ప్రాధాన్యత తగ్గించి విద్యను ప్రయివేట్ పరం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థుల కలిసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కెమికల్స్ దుర్వాసన నుంచి కాపాడాలి

- జీహెచ్ఎంసీ కాప్రా తసర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు పులుగు దేవేందర్ ఫిర్యాదు



నవతెలంగాణ-కాప్రా
కాప్రా డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ బేరింగ్స్ ఆఫీసర్స్ కాలనీలో నివాస గృహాల మధ్య ఏర్పాటు చేసిన డై కెమికల్స్ దుర్వాసన భారీ నుంచి కాలనీవాసులను కాపాడాలని కోరుతూ కాలనీకి చెందిన పులుగు దేవేందర్ జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కాలనీలోని నివాస గృహాల మధ్య పెద్ద షెడ్డును ఏర్పాటు చేసుకొని క్లాత్ డైయింగ్ యూనిట్ ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ యూనిట్ ద్వారా వచ్చే వ్యర్థాలు పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు కలుషితం కావడంతో పాటు వాయు కాలుష్యం ద్వారా కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారని వివరించారు. ఈ దుర్వాసన భరించలేక కిటికీలు, తలుపులు మూసుకొని జీవిస్తున్నామన్నారు. ఈ ఉద్గారాల వల్ల వృద్ధాప్యంలో ఉన్న తమ తల్లిదండ్రులుకు ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్న మవుతున్నాయని వివరించారు. చిన్న పిల్లలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆయన వివరించారు. కాలనీలో అనధికార వాణిజ్య కార్యకలాపాలను నిరోధించి తమకు స్వేచ్ఛాయుత జీవితాన్ని ప్రసాదించాలని ఆయన వేడుకున్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్లకు ఫిర్యాదు చేస్తే నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకొని పక్షంలో కాలనీవాసులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఎద్దు గానుగ నూనె ప్రయోజనాలపై అవగాహన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యం వల్ల ప్రజలు ఒకపక్క రోగాలను బారిన పడుతుంటే, మరోపక్క నాణ్యతలేని వంటనూనెలను వాడుతూ ప్రజలు ఉబ్బకాయం, గుండె వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ప్రజలకు తెలపాలని గత మూడేండ్లుగా మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని చింతల్ బస్తీలో ఎద్దు గానుగ నూనె పరిశ్రమను ఆయుశ్రిత నేషనల్ అనే పేరుతో లాభాపేక్ష లేకుండా జగదీష్ నిర్వహిస్తూ ఉన్నారు. రాబోయే తరాలకు వంట నూనె వల్ల జరిగే ప్రమాదాలపై శనివారం చింతల్ బస్తీలోని శ్రీకృష్ణ టాలెంట్ స్కూల్‌లోని 200 మంది విద్యార్థులకు ఎద్దు గానుగ నూనెపై అవగాహన కల్పించారు. గానుగ యంత్రంలో విద్యార్థుల ముందు పల్లీలు వేసి చుట్టూ ఎద్దును తిప్పి నూనెను తీసి, గానుగ నూనె వల్ల కలిగే లాభాలను వారికి వివరించారు. వంట నూనెను ఎలా పరీక్షించాలో అనే ఒక చిట్కాను తెలిపారు. మార్కెట్‌లో దొరికే వంట నూనె మనిషి శరీరంపై ఒక చుక్క నూనె వేసి పరీక్షిస్తే మనిషి శరీరం ఏమాత్రం ఆ నూనెను స్వీకరించకుండా అలాగే వది లేస్తుందనీ, అదే ఎద్దు గానుగ నూనె మనిషి ఒంటిపై ఒక చుక్క వేసి ప్రయోగం చేస్తే మనిషి శరీరం వెంటనే ఆ నూనెను శరీరం పీల్చుకుటుందని, దీంతో మనిషి శరీరానికి ఏ నూనె మంచిదో మీరు తెలుసుకోవాలని విద్యార్థులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ.. స్వచ్ఛమైన వంటనూనె వాడిన రోజే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఇటీవల విద్యుత్‌తో నడిచే యంత్రాలు వచ్చిన అవి ఏమాత్రం సురక్షితం కాదన్నారు. ప్రతి తల్లి తండ్రి తమతోపాటు తమ పిల్లల ఆరోగ్యం ఉండడానికి ఎద్దు గానుగ నూనె వాడాలన్నారు. తల్లిదండ్రులు నెలకు ఒక్కసారి పిల్లలతో ఎద్దుగానుగా పరిశ్రమలను సందర్శించి వాటి ఉపయోగాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

మల్లికార్జున్ నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

- హై టెన్షన్ వైర్ల కింద నిర్మాణాలకు నిబంధనలు ఉండవా
- డ్వాక్రా భవనం స్థలం కబ్జా
- కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేత



నవతెలంగాణ-బోడుప్పల్
నిబంధనలకు విరుద్ధంగా హై టెన్షన్ విద్యుత్ వైర్ల కింద చేపడుతున్న ఇంటి నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నేత కవిడ కుమార్ అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ అమర్ సింగ్, కమిషనర్ త్రిలేశ్వర్ రావులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీర్జాదిగూడ కార్పొరేషన్ 10వ డివిజన్ మల్లికార్జున నగర్ ఈస్‌లో హై టెన్షన్ విద్యుత్ లైన్ల కింద ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా రెండు అంతస్తుల భవనం నిర్మాణం చేస్తున్నారని ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని భవిష్యత్తులో ప్రమాదాలు జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా వెస్ట్ మల్లికార్జున నగర్‌లో డ్వాక్రా భవనాన్ని ఆక్రమించి ఓ ప్రజాప్రతినిధి భర్త యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తె కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ అంశంపై మేయర్ అమర్ సింగ్, కమిషనర్ త్రిలేశ్వర్ రావులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-మేడ్చల్
మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి రాఘవేంద్ర నగర్, బాలాజీ నగర్ కాలనీలో కొంతమంది నిర్మాణదారులు అనుమతి పొందిన దానికన్నా అదనంగా నిర్మాణలు చేస్తూ చేసి రోడ్డు, పార్క్ స్థలాలు కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీవాసులు శనివారం జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీ 70 ఎకరాల లేఔట్ అని , కానీ ఒక్క గజం పార్కు స్థలం కూడా లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పార్కుల స్థలాలు, రోడ్లు ఆక్రమించుకొని నిర్మాణాలు చేశారని తెలిపారు. బాలాజీ నగర్ కాలనీలో సైతం 20 ఫీట్ల రోడ్డులతో నిర్మాణల అనుమతి తీసుకుని సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపట్టారని అన్నారు. మున్సిపాలిటీలో ఇంటి నిర్మాణానికి కనీసం 30 ఫీట్ల రోడ్డు ఉండాలని, 20 ఫీట్ల రోడ్డు రెండు పక్కల 5 ఫీట్లలో సెట్ బ్యాక్ ఉండాలని తెలిపారు. కాగా అట్టి రోడ్డు స్థలం వదిలి పెట్టకుండా అక్రమంగా నిర్మాణలు చేపట్టారని అన్నారు. జాతీయ రహదారి 44నుండి కిష్టాపూర్ వరకు వయా కేఎల్ఆర్ బాలాజీ నగర్ మీదుగా 100 ఫీట్ల రోడ్డు ప్రపోజ్ చేశారని పేర్కొన్నారు.



నిర్లక్ష్యంగా మూత్రనాళాన్ని కట్ చేసిన సీఎంఆర్ ఆస్పత్రి పై కఠిన చర్యలు తీసుకోవాలి





- బాధితురాలి కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-మేడ్చల్
ఓ మహిళ మూత్రనాళాన్ని సీఎంఆర్ ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యంగా కట్ చేయడంతో యూరిన్ లీకేజీ సమస్యతో బాధపడుతున్న ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణానికి చెందిన అరుణ (42)రక్తహీనత సమస్యతో బాధపడుతూ గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ సీఎంఆర్ ఆస్పత్రిలో చేరారు. ఇంతలో గర్భసంచికి వాపు రావడంతో చికిత్స చేసి తొలగించారు. ఆ తర్వాత కూడా రక్తహీనత సమస్య ఉండడంతో డాక్టర్ల సూచనల మేరకు మూడు నెలపాటు మందులు వాడారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో 22ఏప్రిల్ 2024 నాడు గైనకాలజిస్ట్ డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో బాధిత మహిళకు హిస్టరెక్టమీ లాపరోస్కోపీ ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ చేసిన డాక్టర్లు ఎలాంటి సమస్యను గుర్తించలేదని 100 మందిలో ఒకరికి ఇలా జరుగుతుందని చెప్పారు. ఆపరేషన్ చేసిన 15రోజుల తర్వాత సదరు బాధిత మహిళ అరుణకు స్పృహ లేకుండా యూరిన్ లీకేజీ సమస్య ఉత్పన్నం కావడంతో డాక్టర్లకు తెలిపారు. పరీక్షలు నిర్వహించిన వారు హిస్టరెక్టమీ ఆపరేషన్ చేసే సమయంలో మూత్రనాళం పైపు కట్ అయిందని తిరిగి 4నెలల తర్వాత ఆపరేషన్ చేయాలని సూచించారు. దీంతో తిరిగి 29 ఆగస్టు 2024న యూరాలజీ డాక్టర్ అవినాష్ ఆధ్వర్యంలో సదరు బాధిత మహిళ అరుణకు ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ అనంతరం కూడా యూరిన్ లీకేజీ సమస్య కొనసాగుతుందని బాధిత మహిళ కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూరిన్ లీకేజీ సమస్యకు ఆస్పత్రి వైద్యులే కారణమని శనివారం హాస్పిటల్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా డీఎంహెచ్‌వో, ప్రభుత్వం స్పందించి సీఎంఆర్ హాస్పిటల్ పై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా బాధిత మహిళ శరీరం సహకరించకపోవడం వల్లే సమస్య తీవ్రమైందని ఆస్పత్రి డీన్ వెంకట్రామయ్య తెలిపారు.

గ్రూప్-1 పరీక్ష ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కోసం ఏర్పాట్లను శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రాధికాగుప్తా) పరిశీలించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మేడ్చల్‌లోని హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజిమెంట్, దూలపల్లిలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కాలేజీలైన పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను రాధికాగుప్తా తనిఖీ చేసి పరిశీలించారు.



నగరంలోని చార్మినార్ నందు రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర 34 వ సంవత్సరం కొప్పిశెట్టి నిరంజన్ వారి కుమారుడు కొప్పిశెట్టి రాఘవేందర్, రాజీవ్ సద్భవన్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గీతారెడ్డి దంపతులకు రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ శాలువాతో సత్కరించి మెమెంటో బహుకరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవరావు, సునీల్ యాదవ్, ప్రవీణ్ కుమార్, ఫణింద్ర కుమార్, పాల్గొన్నారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వ్యాయామం ఆరోగ్యానికి ఉపయోగకరం



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

నగరంలో కాలుష్యం, ఉద్యోగ ఒత్తిడి అధిగమించడానికి వ్యాయామం చేయడం ఆరోగ్యానికి ఉపయోగకరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి ఐడియల్ చెరువు వద్ద నేటి స్త్రీ సంస్థ ఆధ్వర్యంలో... శనివారం 3కే వాక్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో.. హైదరాబాద్ మహానగరంలో మొట్టమొదటి మహిళా పార్క్ ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వంలో మహిళలకు మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో వ్యాయామం చేసుకోవడానికి అనుకూలంగా పార్కులకు పెద్దపీట వేశారన్నారు. హైదరాబాదులో మొట్టమొదటి మహిళా పార్కును కూడా కూకట్‌పల్లిలో ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన స్త్రీసంస్థ వారికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులకు స్థలం కేటాయించండి



- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్
- కార్మిక శాఖ అధికారికి సీపీఐ, ఏఐటీయూసీ నేతల వినతి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట బస్ స్టాప్‌లో గతంలో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో ప్రస్తుతం నిలబడే పరిస్థితి లేదని అక్కడ మొత్తం భవనాలు, బస్సులు, ప్రయాణికులతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ అన్నారు. జగద్గిరిగుట్టలో పని చేస్తున్న సుమారు 500 మంది భవన నిర్మాణ కార్మికులకు శాశ్వతమైన అడ్డాను చూపించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో.. నగరంలోని అంజయ్య భవన్‌లో గల కార్మిక శాఖ కార్యాలయంలో కార్మిక శాఖ ఉపకార్యదర్శి ఈ.గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా భవన నిర్మాణ కార్మికులకు శాశ్వతమైన అడ్డాను ఏర్పాటు చెయ్యాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక వినతులు ఇచ్చామని నేటి వరకు అమలుకావట్లేదని, జగద్గిరిగుట్టలో ప్రభుత్వ భూమి ఉందని అది అన్యక్రాంతం అవుతుందని,స్థలం ఉన్నపుడే తగిన నిర్ణయం తీసుకుంటే వందలాది కార్మికులకు సహాయం చేసిన వాళ్ళు అవుతారని వినతిలో పేర్కొన్నారు. కార్మిక శాఖ నుండి జిల్లా కలెక్టర్‌కు స్థలం కేటాయింపు కొరకు లేఖ రాస్తే స్థలం కేటాయిస్తారని తెలిపారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందిస్తూ సంబంధించిన శాఖకు తెలియచేసి కార్మికుల సమస్యను తీరుస్తామని అధికారి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమామహేష్, ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.హరినాథ్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రవి, రాము, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహనా సదస్సు..





నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో హాల్‌లో శనివారం రోడ్డు భద్రతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ దీరేంద్ర సామినేని ఐడీఓసీ ఉద్యోగులు, అధికారుల డ్రైర్లకు అవగాహన కల్పించి శిక్షణ కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి రవాణాశాఖ అధికారి ఎం.రఘునందన్ గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ కడారు వెంకటరెడ్డి, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎల్.రామ్మోహన్, జిల్లా క్రీడాశాఖ అధికారి గోపాల్‌రావు పాల్గొన్నారు.

విద్యాకమిషన్ సభ్యురాలుగా జోత్స్నా శివారెడ్డి



నవతెలంగాణ-బాలానగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా కమిషన్ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ.. ఉత్తర్వులు జారీచేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కొంపల్లి ప్రాంతానికి చెందిన మున్సిపాలిటీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి జోత్స్నా శివారెడ్డి విద్యా కమిషన్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రీ ప్రైమరీ నుంచి యూనివర్సిటీ స్థాయివరకు విద్యా రంగంపై సమగ్ర విద్యా విధానాన్ని రూపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. చైర్మెన్‌తో పాటు విద్యాశాఖలో నిపుణులైన ముగ్గురు సభ్యులతో కమిషన్‌ను ఏర్పాటు చేశారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు (జీవోనెంబర్ 194) విడుదల చేశారు. చైర్మెన్‌తో సహా ముగ్గురు సభ్యు లు ఈ కమిషన్‌లో ఉంటారని గతంలోనే స్పష్టం చేసిన విషయం తెలిసిందే.. దీంతో విద్యా కమిషన్ చైర్మెన్‌గా ఆకునూరి మురళిని గతనెల మూడో తేదీన ప్రభుత్వం నియమించింది. తాజాగా విద్యా కమి షన్ సభ్యులుగా టీజేఎస్ నాయ కులు పీఎల్ విశ్వేశ్వర రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేష్, మహిళా కాంగ్రెస్ నాయకులు జ్యోత్స్నా శివారెడ్డిని నియ మిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారి పదవీ కాలం రెండేండ్ల పాటు పీఎల్వీ, చారకొండ వెంకటేష్, జ్యోత్స్నా శివారెడ్డికి చోటు రెండేండ్ల పాటు పదవీకాలం ఉంటుం దని వివరించారు. ప్రాథ మిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విద్యారంగంలో చేపట్టాల్సిన మార్పులు, తేవాల్సిన సంస్కరణల గురించి విద్యా కమిషన్ సమగ్రం గా చర్చించి, అందరితో సంప్రదించి నివేదికను రూపొం దించనున్నట్లు వారు తెలిపారు.

కేపీహెచ్‌బీ : తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్‌గా ప్రొఫెసర్. వి.బాలకృష్ణ రెడ్డి, వైస్ చైర్మెన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సందర్భంగా శనివారం హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య, జేఎన్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రంజిత్ కుమార్ కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలి పారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంతో పోటీ పడాలంటే రాష్ట్రంలో జాతీయ విద్యా విదానాన్ని అమలు చేయాలన్నారు. ఉన్నత విద్యాభివృద్ధిలో కాలాను గుణంగా మార్పులు తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిస్ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ, జేఎన్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మం ద రంజిత్ కుమార్, రాష్ట్ర జాక్ కమిటీ సభ్యులు, ఎమ్మా ర్పీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



60 రోజుల్లో కులగణన జరగాలి



- దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కే.ఏసురత్నం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అరవై రోజుల్లో కులగణన జరగాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కే.ఏసురత్నం ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షులు కత్తుల దుర్గయ్య, కార్యదర్శి కొమ్ము వెంకటేష్ ఆధ్వర్యంలో..జగద్గిరిగుట్ట దళిత హక్కుల పోరాట సమితి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల గణన గురించి జీవో విడుదల చేసిందని జీవో ప్రకారం వెంటనే కులాల లెక్కలు చేయాలని డిమాండ్ చేశారు. దాని వలన ఎస్సీలకు రావలసినటువంటి ఆర్థిక పరమైన బడ్జెట్ కేటాయించుటకు సానుకూలంగా ఉంటుందని అన్నారు. రాజకీయంగా రిజర్వేషన్లు జరగాలని రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలలో సరియైన వాట కేటాయించాలని డిమాండ్ చేశారు. సబ్ ప్లాన్ నిధులు వెంటనే నిరుద్యోగులకు, పరిశ్రమలు నెలకొల్పుటకు భూమి కేటాయించి ప్రాజెక్టు ప్రకారం నిధులు కేటాయించి నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు. డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టులలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థిలకు, అన్ని కులాల వారికి న్యాయం చేయాలని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రాములు నియోజకవర్గం ఇన్చార్జి వి.హరినాధరావు. ఎస్సీ,ఎస్టి విభాగం అధ్యక్షులు సిహెచ్. దాసు,తొండ వెంకట్,నాయకులు ఇమాం భాయ్,సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలో తూము



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ జనతా నగర్‌లోని శ్రీ విఠల రుక్మిణీ మందిరంలో, శ్రీ హరినామ పఠనం చివరి రోజు సందర్భంగా.. నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు జిల్లా గోపాల్, పంచశీల శ్రీనివాస్, రమేష్ గౌడ్, కే.గోపాల్, వై.శ్రీనివాస్, మనోజ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విషవాయువులను గాలిలోకి వదులుతున్న పరిశ్రమలు

- ప్రాణాలు పోతున్న పట్టించుకోని పీసీబీ అధికారులు
- ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి
- బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు రవిసింగ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల, బొల్లారం కాజిపల్లి, పారిశ్రామికవాడలోని రసాయన పరిశ్రమలు రాత్రివేళ వర్షం పడితే చాలు ఏరులై పారుతున్నా.. రసాయనలు విషవాయువులతో బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. రాత్రి అయ్యింది అంటే చాలు కాలనీ, బస్తీలలో పొగమంచులా వాయువులు కమ్ముకుంటున్నాయి. ఈ వాయువులు పీల్చి అనేక మంది రోగాల బారినపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని రసాయన పరిశ్రమలను మూసివేయాలి అని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ డిమాండ్ చేశారు. కార్మిక నాయకుడు రవిసింగ్ మాట్లాడుతూ పరిశ్రమక వాడలో రసాయన ఘాటుతో నిత్యంప్రజలు కాలుష్య ఇబ్బంది పడుతున్నారు. నియంత్రణ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసిన ఏమాత్రం చలనం ఉండడం లేదు.. గతంలో పీసీబీ కార్యాలయంలో పీరియడ్ చేస్తే... కొంత సమయం కేటాయించి పట్టించుకునేవారు.. ఇప్పుడు ఎంత ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరుఎత్తినట్టు ప్రభుత్వం, పీసీబీ అధికారులు వ్యవహరిస్తున్నారని.. వెంటనే స్పందించి విషవాయులను కొలిచే యంత్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి ఉమాదేవినగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాలలో జులాయిల, ఆకతాయిలా ఆగడాలు మితిమీరిపోతున్నాయని సంక్షేమ సంఘం సభ్యులు పి.సమ్మయ్య యాదవ్, కూరపాటి కరుణాకర్ రాజు, ఎస్ కృష్ణమూర్తి గుప్తా అన్నారు. ఈ మేరకు శనివారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో సీఐ కేతూరి నరసింహకు వినతిపత్రం అందజేశారు. గత 15 రోజుల నుండి తమ ప్రాంతాల్లో మందుబాబుల, ఆకతాయిల చేష్టలతో ఇబ్బందులు పడుతున్నామని ఉదయం సాయంత్రం వేళల్లో వీరి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని వినతిలో పేర్కొన్నారు. స్పందిం చిన సీఐ పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఎక్కువసార్లు పంపిస్తామని ఆకతాయిలను గుర్తించి వారికి సరైన శిక్ష వేస్తామని హామీ ఇచ్చారు. కాలనీ వాసులు కూడా జాగ్రత్తగా ఉండి వారు కనబడితే వెంటనే పోలీసు సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. అనంతరం నూతనంగా వచ్చిన సిఐని వారు శాలువాతో సన్మానించారు.

వ్యాపారంలో భాగస్వామ్యం ఇస్తామని మోసం

- రూ.కోట్లు కాజేసిన దంపతుల అరెస్టు
- సీసీఎస్‌తోపాటు పలు స్టేషన్లలో కేసులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తన పరిశ్రమలో పెట్టుబడి పెడితే కమీషన్‌తోపాటు పార్ట్‌నర్‌షిప్ ఇస్తామని నమ్మించి పలువురి నుంచి రూ.కోట్ల రూపాయలు దండుకుని మోసగించిన దంపతులను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అరెస్టున దంపతులపై బోయిన్‌పల్లి, తిరుమలగిరి, మహంకాళి పోలీసు స్టేషన్లలో చీటింగ్ కేసులు ఉన్నాయి. పోలీసుల కథనం మేరకు చిక్కడపల్లికి చెందిన హెచ్.దినేష్ (50), జ్యోతి (47) అనే దంపతులు సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో 'శ్రీరామా ఎంటర్‌ప్రైజెష్' పేరుతో హెూల్‌సేల్ కిరాణం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. దీంతోపాటు కీసరలో అభినవ్ ఇండస్ట్రీస్ పేరుతో పేపర్ తయారీ పరిశ్రమను కూడా నిర్వహిస్తున్నారు. తమ వ్యాపార సంస్థలలో పెట్టుబడులు పెడితే మంచి కమీషన్‌తోపాటు పార్ట్‌నర్‌షిప్ అవకాశం ఇస్తామని నమ్మించి పలువరి నుంచి రూ.కోట్లు దండుకున్నారు. ఈ క్రమంలోనే సికింద్రాబాద్ చెందిన వ్యాపారి పి.లక్ష్మణ్‌ను ఈ దంపతులు నమ్మించడంతో రూ.1.10 కోట్లు పెట్టుబడి పెట్టాడు. రెపోమాపో పార్ట్‌నర్‌షిప్ ఇస్తానని దంపతులు నమ్మిస్తూ వచ్చారు. ఇలా ఆరు నెలలు గడిచినా పార్ట్‌నర్‌షిప్ ఇవ్వకుండా మోసగించారు. తాను పెట్టిన పెట్టుబడి డబ్బులు తిరిగివ్వాలని లక్ష్మణ్ నిలదీశాడు. దాంతో దంపతులు నెల రోజుల క్రితం రూ.1.10 కోట్లకు చెక్ ఇచ్చారు. ఆ చెక్ బ్యాంక్‌లో చెల్లకపోవడంతో బాధితుడు లక్ష్మణ్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దంపతులను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

సీసీరోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని కమలమ్మ కాలనీలో పదహారు లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న.. నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా.. ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాండుగౌడ్, జిల్లా గణేష్, శివరాజ్ గౌడ్, కె.నరసిం హులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని మరోసారి మోసం చేసిందని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాటలు రైతాంగానికి కన్నీరు కారించేలా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు భరోసా పథకం కింద ఏడాదికి రూ.15 వేలు ఇస్తానన్న హామీని, రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న హామీలన్ని తుంగలో తొక్కిందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వానాకాలం పంటకు రైతు భరోసా లేదనడం బాధాకరం అన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చి 10 నెలలు గడిచినా రైతాంగాన్నికి ఇచ్చిన హామీలను నేటికీ ఒక్కటి కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదన్నారు. వానాకాలం పంట కోసం రైతులు అప్పుల తెచ్చి పెట్టుబడి పెట్టారనీ, మరో పక్క రుణమాఫీ కూడా నేటికీ సగం మంది రైతాంగానికి పూర్తి కాలేదన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. వానకాలం పంట పెట్టుబడి సహాయం రైతు భరోసాను రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగం పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ప్రజా పార్టీ రైతుల పక్షాన నిలబడి ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తుందన్నారు.

నిర్మాణ రంగంలో అగ్రగామిగా హైదరాబాద్

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నిర్మాణ రంగంలో హైదరాబాద్ నగరం దేశంలోని అన్ని నగరాలతో పోటీపడి అగ్రగామిగా నిలుస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. శనివారం కాంగ్రెస్ సీనియర్ నేత మైనంపల్లి హన్మంతరావుతో కలిసి కొంపల్లిలోని ఆస్పేసియస్ కన్వెన్షన్ సెంటర్‌లో రూఫ్ అండ్ ఫ్లోర్ ప్రాపర్టీ ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం బిల్డర్లు, రియల్ డెవలపర్లతో మాట్లాడారు. హైడ్రా గురించి రెచ్చగొట్టేవారి మాటలు విని ఆందోళన చెందవద్దని నిర్మాణ సంస్థల ప్రతినిధులకు సూచించారు. ఉత్తర హైదరాబాద్ ఇంకా విస్తరించి నివాస సముదాయాలు, విల్లాలతో శోభిల్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రదర్శనలో 15 మంది డెవలపర్లు సుమారు 100 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇండ్ల కొనుగోలుదారులకు విస్తృత శ్రేణి నివాస ప్రాపర్టీలను అన్వేషించడానికి, నిపుణుల సలహా పొందడానికి, ప్రముఖ డెవలపర్లతో మాట్లాడే అవకాశాన్ని ఈ ప్రదర్శన అందించింది. ఈ ప్రదర్శన నేడు కూడా కొనసాగనుంది. ఈ ప్రదర్శనలో అపర్ణా కన్స్ట్రక్షన్స్, ప్రైమార్క్, సాకేత్ డెవలపర్స్, సుబిషి ఇన్ఫ్రా, శిల్పా ఇన్ఫ్రాటెక్, మోడీ బిల్డర్స్, శాంతా శ్రీరామ్, గోల్డెన్ కీ, గ్రోత్ స్టోరీస్, లెక్సస్ గ్రూప్, ఎస్ క్యూబ్, తదితర సంస్థలు పాల్గొన్నాయి.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
10
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
ఆదివారం | అక్టోబర్ 20, 2024 | www.navatelangana.com

డిప్యూటీ మేయర్‌ను కలిసిన వెంకట్ సాయి



నవతెలంగాణ-ఓయూ

జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్‌కు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన వెంకట్ సాయి శనివారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ అభివద్ధి, మునిసిపల్ సౌకర్యాల విస్తరణ, ప్రజల సమస్యలు మొదలైన అంశాలపై చర్చించారు. వెంకట్ సాయికి తమ పూర్తి సహకారం అందిస్తామని డిప్యూటీ మేయర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈ సువర్ణ, ఏఈ వేణు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

పార్కు పరిశీలన



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్ డివిజన్‌లోని రామంతపూర్‌లో మధురానగర్ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేసి స్థలానికి అనుగుణంగా అమర్చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వెంకటరెడ్డి నగర్‌లోని వీధి నెంబర్ 8, 9లలో కొత్త రోడ్డు వేయాలని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగమణి , ఏఈ సాయికిరణ్ స్థానికులు పాల్గొన్నారు.

నేను అనేది ఉండదు..



- ఓయూ వీసీ ప్రో.ఎం.కుమార్
- బాధ్యతలు స్వీకరించిన వీసీ

నవతెలంగాణ-ఓయూ

నేను అనేది ఉండదని..మనమంతా జట్టుగా ఓయూ అభివద్ధికి కృషి చేయాలని ఓయూ వీసీ ప్రో.ఎం.కుమార్ పిలుపునిచ్చారు. ఓయూ వీసీగా ఆయన శనివారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 107 ఏండ్ల ఓయూకు వీసీ గా అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు ఈ సందర్భంగా ఆయనకతజ్ఞతలు తెలిపారు. అనంతరం సెనేట్ హాల్లో జరిగిన కార్యక్రమంలో తనను కలిసిన అభినందనలు తెలిపిన ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకులను ఉద్దేశించి మాట్లాడారు.

ఉస్మానియాలోనే విద్యాభ్యాసం చేసి ఇక్కడే అధ్యాపకుడిగా పనిచేస్తూ వీసీగా బాధ్యతలు చేపట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రానికే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలున్న ఓయూ ఖ్యాతిని నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నాణ్యమైన విద్య పరిశోధనలకు ప్రాధాన్యతే తన ముందున్న కర్తవ్యమని, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా సమస్యలను అధిగమిస్తూ ఓయూ ఔన్నత్యాన్ని నిలబెడతానని హామీ ఇచ్చారు. నా అనే పదానికి విలువలేదని.. మనంగా కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. తక్కువగా మాట్లాడి ఎక్కువగా పనిచేయటం తన విధానమని, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా విద్యారంగంలో చేపట్టాల్సిన సంస్కరణలు, నైపుణ్యాభివద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై దష్టి సారిస్తామని తెలిపారు. న్యాక్ గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయటం తక్షణ కర్తవ్యమన్నారు. నాణ్యమైన పరిశోధనలతో నూతన ఆవిష్కరణల దిశగా విశ్వవిద్యాలయాన్ని తీసుకెళ్తామని కలిసికట్టుగా భవిష్యత్తు తరాలకు గొప్ప విద్యా విధానాలు అందిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ బి. రెడ్యానాయక్, ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, డీన్లు, డైరెక్టర్లు, అధ్యాపకులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.



సిండ్రెల్లా డిజైనర్ వస్త్ర ప్రదర్శన షురూ



నవతెలంగాణ - బంజారా హిల్స్

భారతీయ సంస్కృతి లో సిల్క్, హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని ప్రముఖ సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్ సతీమణి పద్మావతి బెల్లంకొండ అన్నారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన సిండ్రెల్లా డిజైనర్ వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిల్క్,హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలేదని, నేటి తరం యువత కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఆదరిస్తున్నారని తెలిపారు. చేనేత అమ్మ చల్లని ఒడిలా పద్మావతి అభివర్ణించారు. ఇక్కడి ప్రదర్శనలో కొలువుదీరిన విభిన్న రకాల ఉత్పత్తులు ఎంతో ఆకట్టుకుంటున్నాయన్నారు. నిర్వాహకులు జ్యోతి చలసాని మాట్లాడుతూ.. ఈ నెల 23 తేది వరకు కొనసాగనున్న ప్రదర్శనలో చేనేత కారులు తమ సిల్క్ అండ్ హ్యాండ్ లూమ్, బాగల్ పూర్, పటోలా, గద్వాల్‌తో పాటు ఫ్యాన్సీ చీరలు డ్రెస్ మెటీరియల్, డిజైనర్ దుస్తులు, జ్యూవెలరీ, హెూమ్ డెకార్ వంటి 50 వేల రకాల డిజైన్లు అందు బాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లం కొండ సురేశ్ సోదరి నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు బ్యాక్ లాగ్ పరీక్షలూ నిర్వహించాలి

- ఏఐడీఎస్ఓ కమిటీ



నవతెలంగాణ-ఓయూ

ఓయూ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు నవంబర్‌లో జరిగిపోయే రెగ్యులర్ పరీక్షల తో పాటు బ్యాక్ లాగ్ పరీక్షలు కూడా నిర్వహించాలని ఏఐడీఎస్ఓ కమిటీ కోరింది. ఏఐడీఎస్ఓ కమిటీ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో శనివారం ఓయూ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత కార్యవర్గ సభ్యులు, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి డా. ఆర్. గంగాధర్, మాట్లాడారు. సంవత్సరానికి ఒకసారి మాత్రమే బ్యాక్ లాగ్స్ పెట్టడం వల్ల విద్యార్థులు అన్ని పరీక్షలు ఒకేసారి రాయలేకపోతున్నారని తెలిపారు. ప్రతి సెమిస్టర్ రెగ్యులర్‌తో పాటు బ్యాక్ లాగ్ పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. దీని వలన విద్యార్థులకు ఎప్పటికప్పుడు అన్ని పరీక్షల్లో పాస్ అవుతూ ముందుకు వెళ్లడంతో పాటు ఒక సంవత్సరం కోల్పోవాల్సిన అవసరం కూడా రాదన్నారు. ప్రతి రెగ్యులర్ పరీక్షలతో పాటు బ్యాక్ లాగ్ పరీక్షలు కూడా నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థుల కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఏఐడీఎస్ఓ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమం లో అఖిలభారత కార్యవర్గ సభ్యులు డా.. ఆర్ గంగాధర్ ఏఐడీఎస్ఓ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, అజయ్, నరేష్, వర్ధన్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రో.సత్యనారాయణకు నివాళులు

నవతెలంగాణ-ఓయూ



మాజీ డీన్ ప్రొఫెసర్ సత్యనారాయణ శుక్రవారం ఆకస్మిక మృతికి డిపార్ట్మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులందరూ బీఈడీ కళశాలలో శనివారం శ్రద్ధాంజలి ఘటించారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ గా ప్రొఫెసర్ సత్యనారాయణ అందించిన సేవలు గుర్తు చేసుకున్నారు. వారి ఆకస్మిక మరణం ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీకి తీరని నష్టమని ఆచార్యులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవీంద్రనాథ్‌కే మూర్తి, హెచ్‌ఒడీ ప్రొఫెసర్ మణాళిని, బోర్డ్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ సునీత, డా. లలిత అధ్యాపకులు డా. దుర్గేశం, డా. సుజాత డా.పి. శంకర్ ,డా. షెహనాజ్ , పరిశోధక విద్యార్థులు.. వడ్డేపల్లి సత్యనారాయణతో తమకున్న అనుభవాన్ని పంచుకుని సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో వారి కుటుంబానికి భగవంతుడు అన్ని విధాల ధైర్య స్థైర్యాలను అందించాలని వారి వెంటే తామంతా ఉంటామని కుటుంబానికి మనోధైర్యాన్ని సంతాప సందేశాన్ని అందించారు.

వెస్లీ విద్యా సంస్థలు ఉపాధికి పెట్టింది పేరు..



- డైరెక్టర్ డా.బి.విమల్స్ కుమార్
- ఘనంగా మెరిట్ సర్టిఫికేట్స్ పంపిణీ

నవతెలంగాణ-ఓయూ

వెస్లీ విద్యా సంస్థలు ఉపాధికి క్రమశిక్షణ కు పెట్టింది పేరు అని వెస్లీ పీజి కళాశాల డైరెక్టర్ డా.బి.విమల్స్ కుమార్ అన్నారు. శనివారం వెస్లీ పీజీ కళాశాలాలో ఎంబీఏ (2022 -2024) విద్యార్థులకు జరిగిన మెరిట్ సర్టిఫికేట్స్ ప్రదానం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి అన్నారు. ఇక్కడ సువిశాల వాతావరణంలో విద్యార్థులకు నిష్ణాతులైన అధ్యాపకులు భోదిస్తున్నట్టు చెప్పారు. మెరిట్ లో నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికేట్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.పి.యం. యోహాన్ విభాగం అధ్యాపకులు, పేరెంట్స్ ,ఉద్యోగులు విద్యార్థులు పాల్గొన్నారు.

టాస్ పబ్‌లో అశ్లీల నృత్యాలు..

- టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి.. 100 మంది యువకులు, 40 మంది యువతులు అరెస్ట్

నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో 'టాస్' పబ్‌లో అశ్లీల నత్యాలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారంతో శుక్రవారం రాత్రి టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. పబ్‌లో ఉన్న 100 మంది యువకులను, 42 మంది యువతులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. టాస్ పబ్ నిర్వాహకులు ఉద్యోగాల ఆశ చూపి యువతులను అశ్లీల నత్యాలకు ఉపయోగించుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రతీ వారాంతంలో తమకు పబ్‌కు వచ్చి కస్టమర్లతో చనువుగా ఉంటూ వారితో ఎక్కువ బిల్లులు వేయించాలని యువతులకు ఆదేశాలు ఇచ్చేవారని తెలిసింది. ఇలా కస్టమర్‌తో ఎక్కువ బిల్ చేయించిన యువతికి కమీషన్ ఇస్తున్నట్టు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు పబ్‌పై దాడి చేసి యువకులు, యువతులను అరెస్ట్ చేశారు. పబ్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధర్నాలతో అట్టుడికిన అశోక్‌నగర్





- గ్రూప్ 1 పోస్ట్ పోన్ చేయాలని విద్యార్థుల ఆందోళన
- అభ్యర్థులకు మద్దతు తెలిపిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- అరెస్టు చేసిన పోలీసులు
- బీఆర్ఎస్, బీజేపీ వర్గాల మధ్య వాగ్వాదం

నవతెలంగాణ - ముషీరాబాద్

హైదరాబాద్ అశోక్ నగర్ చౌరస్తా విద్యార్థుల ధర్నాలతో అట్టుడికింది. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష పోస్ట్ పోన్ చేయాలని మూడు రోజులుగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. శనివారం శనివారం కేంద్ర మంత్రి బండి సంజయ్, భారీ స్థాయిలో బీజేపీ కార్యకర్తలు, మహిళ విభాగం నాయకులతో కలిసి అశోక్ నగర్ చౌరస్తా వద్దకు వచ్చి విద్యార్థులకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. అనంతరం అభ్యర్థులతో కలిసి సెక్రటేరియట్ ముట్టడికి బయలుదేరిన కేంద్ర మంత్రిని పోలీసులు అరెస్టు చేశారు.

బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం

అదే సమయంలో అభ్యర్థులకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ముఠా జై సింహా కవాడిగూడ కట్ట మైసమ్మ ఆలయం వద్ద ధర్నా నిర్వహించి సెక్రటేరియట్ ముట్టడికి బయలుదేరగా మార్గమధ్యలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరు పార్టీల కార్యకర్తలు పోటా పోటీగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో విద్యార్థులకు చేసిందేమీ లేదని బీజేపీ నాయకులు నినాదాలు చేయగా బండి సంజయ్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. ఈ పరిణామంతో అశోక్ నగర్ కవాడిగూడ ప్రాంతం దద్దరిల్లి పోయింది. పోలీసులు వెంటనే రంగ ప్రవేశం చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ధర్నాలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు రెండు మూడు గంటల పాటు అశోక్ నగర్ ప్రాంతంలో వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్ క్లియరెన్స్ చేయడానికి నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ జీవో 29 వల్ల నష్టం జరుగుతుందని, జీవో 55 అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదన్నారు. గ్రూప్ వన్ మెయిన్స్ కు సంబంధించిన దాదాపు 22 కేసులు కోర్టులో ఉన్నప్పటికీ ప్రభుత్వం మొండిగా పరీక్ష నిర్వహిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయపరమైన సమస్యలు అన్నీ తీరినప్పుడు మాత్రమే ఎగ్జామ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.



వీసీల నియామకాల్లో మాలలకు తీవ్ర అన్యాయం



- అంసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మంచాల లింగస్వామి

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలకు ప్రకటించిన వీసీల నియామకాల్లో మాలలకు తీవ్రమైన అన్యాయం జరిగిందనిఅంసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మంచాల లింగస్వామి అన్నారు. ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ముందు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో యావత్తు మాల సమాజం కాంగ్రెస్‌కు వెన్నుముకగా నిలబడిందని, ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో కీలకమైన పాత్ర పోషించిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాలలను పూర్తిగా విస్మరించిందన్నారు. తొమ్మిది యూనివర్సిటీలకు వీసీలను ప్రకటిస్తే ఒక్క మాల ప్రొఫెసర్‌ను కూడా ఎంపిక చేయకపోవడం శోచనీయమన్నారు. తెలంగాణ ఉద్యమంలో విద్యావంతులుగా, మేధావులుగా తమ రచనలతో, ప్రసంగాలతో ఉద్యమానికి ఊపిరి పోసిన మాల ప్రొఫెసర్లను ప్రభుత్వం విస్మరించడం సిగ్గు చేటన్నారు. ఇంకా వీసీలను ప్రకటించని జే.ఎన్.టి.యు, డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జే.ఎన్.ఏఫ్.యు, వెటర్నరీ యూనివర్సిటీ, కాళోజీ హెల్త్ యూనివర్సిటీల్లో మాలలకు తగిన అవకాశం కల్పించి ముగ్గురిని వీసీలుగా నియమించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీని మాల వ్యతిరేక పార్టీగా ప్రకటించి రాబోయే పంచాయతీ ఎన్నికల్లో, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓడిస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో అంసా రాష్ట్ర కార్యదర్శి నీరడి సూర్యం, ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, రాష్ట్ర నాయకులు దుగ్గి సురేష్, గాజుల నవీన్ పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల దారుణ హత్య

- బాగ్ అంబర్‌పేట సాయిబాబానగర్ లో దారుణం...

నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఒంటరి వృద్ధులను టార్గెట్ చేసి నగల కోసం గుర్తు తెలియని దుండగులు హత్య చేశారు. ఇద్దరి తలపై గాయాలు ఉండడంతో వారిని కొట్టి చంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జె. నర్సయ్య, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాగ్ అంబర్‌పేట సాయిబాబా నగర్ కాలనీలో పొద్దుటూరు లింగారెడ్డి(80).. ఊర్మిలాదేవి(75).. అనే వృద్ధ దంపతులు నివాసం ఉంటున్నారు. లింగారెడ్డి పంజాబ్ నేషనల్ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. శ్రీలత, ఉమ, లక్ష్మీ. పెద్ద కుమార్తె శ్రీలత కుటుంబం కొంపల్లిలో నివసిస్తుండగా ..మిగిలిని ఇద్దరు కూతుళ్లు ఉమ, లక్ష్మీ వారి కుటుంబాలతో అమెరికాలో స్థిరపడ్డారు. కాగా ఈనెల 17వ తేదీ గురువారం ఉదయం కొంపల్లిలో ఉండే తన పెద్ద అల్లుడు జైపాల్ తో లింగారెడ్డి దంపతులు చివరి సారి ఫోన్లో మాట్లాడారు. శనివారం ఉదయం అల్లుడు ఫోన్ చేయడంతో లిఫ్ట్ చేయలేదు. అనుమానం వచ్చిన జైపాల్ స్నేహితుడి రవీంద్రకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఆయన ఉదయం 11గంటల సమయంలో ఇంటికి వెళ్లి తలుపులు తెరిచి చూడగా తీవ్ర గాయాలలో కుళ్లిన స్థితిలో దారుణ హత్యకు గురైన మృత దేహాలు కనిపించాయి. వెంటనే రవీంద్ర 100 కు డయల్ చేసి విషయాన్ని పోలీసులకు చెప్పాడు. ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, ఏసీపీ రఘు తదితరులు సంఘటన స్థలానికి వచ్చారు. వారితో పాటు సంఘటనా స్థలానికి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంవచ్చింది. మూడంతస్తుల భవనంలో కింద ఫ్లోర్ లో నివాసముంటున్న లింగారెడ్డి మృతదేహం బెడ్ రూంలో తీవ్రగాయాలతో రక్తపు మడుగులో పడి ఉండగా, అతిని భార్య ఊర్మిల దేవి మృతదేహం బాత్ రూంలో పడి ఉంది. వీరిని బలమైన వస్తువులతో కొట్టి హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఊర్మిలదేవి చేతికి ఉండాల్సిన బంగారు గాజులతో పాటు మెడలో పుస్తెల తాడు లేదని పోలీసులు గుర్తించారు. వృద్ధ దంపతుల మృత దేహాలు పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉండడంతో ఈ హత్యలు గురువారం మధ్యాహ్నం తరువాత జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. డాగ్ స్క్వాడ్ టీమ్తో వచ్చిన జాగిలాలు సాయిబాబానగర్ నుంచి శివం మెయిన్ రోడ్డు వరకు వెళ్లాయి. మృత దేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రజాభవన్ వద్ద కారు బోల్తా

పల్టీలు కొట్టుకుంటూ..

నవతెలంగాణ-బంజారాహిల్స్

నగరంలోని పంజాగుట్టలో ప్రజాభవన్ వద్ద అతివేగంగా వచ్చిన ఓ కారు పల్టీలు కొట్టుకుంటూ బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పంజాగుట్ట ఫ్లైఓవర్ మీద సికింద్రాబాద్ వైపు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా వచ్చి సినిమాలో మాదిరిగా పల్టీలు కొట్టుకుంటూ బోల్తా పడింది. దాంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. దయమే ఈ ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసి.. ప్రమాదానికి గురైన కారు అక్కడి నుంచి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీసీల నియామకాల్లో గిరిజన ప్రొఫెసర్లకు అన్యాయం

నవతెలంగాణ-ఓయూ



వీసీ ల నియామకాల్లో గిరిజన ప్రొఫెసర్లకు తీవ్రమైన అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఆల్ ఇండియా బంజారా స్టూడెంట్ ఆర్గనైజేషన్,గిరిజన చైతన్య వేదిక అధ్యక్షుడు డా.కరాటే.రాజు నాయక్ అన్నారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుబంధ కళాశాలలు లేని ప్రభుత్వ గుర్తింపు కూడా సరిగా లేని మహిళ యూనివర్సిటీకి గొప్ప ప్రతిభ ఉన్న గిరిజన మహిళ ప్రొఫెసర్ సూర్యదనున్జాయ్‌కి ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ ఇవ్వడమంటే గిరిజన మహిళ ప్రొఫెసర్‌ను అవమానించడమేనన్నారు. రాష్ట్రంలో 9 యూనివర్సి టీలకు వీసీలకు గాను ఒక్క గిరిజన ప్రొఫెసర్‌ను కూడా వీసీ గా నియమిం చకపోవడం సిగ్గు చేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గిరిజనులకు ముఖ్యంగా బంజారా ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నాడని, అందుకు ఉదాహరణలు విద్య కమిషన్‌లో ఒక్క బంజారా ప్రొఫెసర్‌కు కానీ విద్యావంతులకు ఇవ్వకపోవడం, అలాగే ఎడ్యుకేషన్ అడ్వైసరి కమిటీలో, హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ లో కూడా ఒక్క గిరిజన మేధావులకు ఇవ్వకపోవడం గిరిజనులకు అవమానించడమే అవుతుందని తెలిపారు. ప్రతి తండా కదిలి గిరిజన ఓట్లు కాంగ్రెస్ పార్టీకి వేసి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ని చేసి అధికారం ఇస్తే 10 నెలలుగా 12 శాతం ఉన్న గిరిజనులకు గిరిజన శాఖకు గిరిజన మంత్రి లేకపోవడంతోనే ఇది గిరిజన వ్యతిరేక ప్రభుత్వం అని తెలుస్తుందన్నారు. గిరిజన శాఖకు బంజారా మంత్రిని చేయకపోతే రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి పదవి నుండి దింపుడు ఖాయమని హెచ్చరించారు..



బన్సీలాల్ పేట్ డివిజన్ బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు సకత్ వాళ వంశీ కూతరు వన్సిక మొదటి పుట్టిన రోజు వేడుకలు న్యూ బోయిగూడ పార్థివాడలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వై సురేష్ కుమార్, అంగముత్తు శ్రీనివాస్, సాయిరాం, యస్. రాజు, గుంటి సత్యనారాయణ , మంచాల గోపి , చంద్ర పాల్ రెడ్డి , పిట్ల శ్రీని వాస్ , పార్శి పరమేశ్ , బొజ్జ నర్సింగ్ రావు , అభినవ్ గంగిరెడ్డి , దాసరి సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-బేగంపేట

సీఎంను కలిసిన శ్రీరాం శివ్ కుమార్

నవతెలంగాణ-ఓయూ



సీఎం రేవంత్ రెడ్డిని శనివారం వారి నివాసంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి .బాల కిష్టా రెడ్డి, వైస్ చైర్మెన్ ప్రొ. ఇటికాల పురుషోత్తం, యశోద బాయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ హైదరాబాద్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్ ఉన్నారు.



నూతన కోర్టు నిర్మాణ పనుల పరిశీలన

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నూతన కోర్టు నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. నేరెడమేట్ లో డైట్ కాలేజీలో నూతన కోర్టు నిర్మాణం పనులను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కోట రామచంద్ర రెడ్డి , ఆర్ అండ్ బీ ఏఈ, డీఈ భారతి పరిశీలించారు. ఎంతవరకు నిర్మాణం పనులు సాగాయి.. ఇంకా ఎంతవరకు ఉన్నది ,ముందే వేసుకున్న షెడ్యూల్డ్ ప్రకాంం పని ఎంతవరకు జరిగింది కాంక్రీట్ పని ఎంతవరకు వచ్చింది. సెల్లార్ వర్క్ ఎంతవరకు పని ముందుకు సాగిందని పరిశీలన చేశారు. మిగిలి ఉన్న సమయము కేవలం 18 నెలలు అని చెప్పి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. సాధ్యమైనంత త్వరగా పనులు జరగాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
ఆదివారం | అక్టోబర్ 20, 2024 | www.navatelangana.com

ఉర్దూను రెండో అధికార భాషగా ప్రకటించాలి

● ఆవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్

నవతెలంగాణ-ధూల్ పేట్

ఉర్దూ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్ అన్నారు. ఆవాజ్, సుఫీ ఓలమా ఏ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఉర్దూగర్ మొగల్‌పూరలో ముషాయిరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉర్దూ రెండవ అధికార భాషగా అమలు చేస్తామని గత ప్రభుత్వం అనేకసార్లు వాగ్దానం చేసిందన్నారు. అది నేటికీ అమలు చేయలేదని ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైన అమలు చేయాలని కోరారు. సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని ఉర్దూ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. దీనికై ఉర్దూ కవులను సమీకరించి విజ్ఞప్తి చేశామని తెలిపారు. మనమందరం ఉర్దూ అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా నాయకులు మెహబూబ్ అలి, హఫీజ్ సయీద్ ఆఫ్తెఖార్, ఎండి ఫయాజ్, అధ్యక్షులు మౌలానా, ఫైరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ క్రీడాతో మేధా శక్తి..

● ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు అబ్దుల్ ఖాదర్



నవతెలంగాణ-ధూల్‌పేట్

చెస్ క్రీడా అట విద్యార్థులకు మేధా శక్తి పెంపొందిస్తుందని హఫీజ్ బాబా నగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు అబ్దుల్ ఖాదర్ అన్నారు. శనివారం మొగల్‌పూర ఉర్దూ ఘర్ లో ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చెస్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. వివిధ రాష్ట్రల, జిల్లాల నుండి 150 టిమ్ లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెస్ టోర్నమెంట్ వల్ల క్రీడాకారులో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు, అబ్దుల్ హై ఖాద్రి, ఖాదీరుల్లాహ్, జుబైర్ అమోది, సిరాజ్, ఖమ్మృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

'డీఎస్సీ కౌన్సిలింగ్' అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

● టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా కమిటీ డిమాండ్



ఫైల్

నవతెలంగాణ-సిటీబ్యూరో

డీఎస్సీ కౌన్సిలింగ్‌లో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జి.రాజారావు, ప్రధాన కార్యదర్శి ఎ.శ్యామ్ సుందర్ కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెగా డీఎస్సీలో హైదరాబాద్ జిల్లాకు 878 పోస్టులు కేటాయించగా, 584 పోస్టులు నింపినట్టు తెలిపారు. నూతన నియామకాల ద్వారా అవసరం ఉన్న అన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించే అవకాశం ఉన్నప్పటికీ కొంతమంది అధికారుల నిర్లక్ష్య, స్వార్థపూరిత వైఖరితో అవసరం లేకపోయినా కొన్ని పాఠశాలలకు అధికంగా ఉపాధ్యాయులను కేటాయించడం సరికాదనీ, అవసరం ఉన్న కొన్ని పాఠశాలలను విస్మరించిన ఫలితంగా అనేకమంది విద్యార్థులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. తిరిగి అనేక మందిని డిప్యూటేషన్‌ల ద్వారా సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కౌన్సిలింగ్‌పై పూర్తి స్థాయి విచారణ జరిపించి సంబంధిత అధికారులు, ఈ ప్రక్రియలో భాగస్వాములుగా ఉండి వ్యవస్థను పక్కదారి పట్టించిన అందరిపై చర్యలు తీసుకుని హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ విద్యారంగాన్ని గాడిలో పెట్టాలని టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా కమిటీ పక్షాన విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు.

కొన్ని అవకతవకలు ఇలా..

1.ఉదయం 9 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించాల్సి ఉండగా, 8.30 గంటల వరకు ఖాళీల జాబితాలను బహిర్గతం చేయలేదు. దీంతో నష్టపోయే పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలకు అవసరమైన పోస్టుల గురించి తెలియజేసే అవకాశం లేకుండా పోయింది.

2.ఖైరతాబాద్ డివిజన్‌లోని అమీర్‌పేట-1 (జవహర్‌నగర్) పాఠశాలలో 452 మంది విద్యార్థులు ఉండగా, ఒక్క హిందీ టీచర్ కూడా లేరు. ఇక్కడ రెండు ఖాళీలు ఉన్నప్పటికీ ఒక్క పోస్టును కూడా కేటాయించలేదు. కానీ 245 మంది విద్యార్థులు ఉన్న సెయింట్ పీటర్స్ పాఠశాలలో ఒక హిందీ టీచర్ ఉన్నప్పటికీ మరో టీచర్‌ను కేటాయించారు.

3.గత పదోన్నతుల సందర్భంగా అవసరం లేకపోయినా ప్రాక్టీసింగ్ పాఠశాలకు రెండు హిందీ పోస్టులు కేటాయించి, చింతల్‌గూడ పాఠశాలకు ఒక్క హిందీ టీచర్ కూడా లేకుండా చేశారు.

4.జీపీఎస్ ఎల్లారెడ్డిగూడ పాఠశాలలో 176 మంది విద్యార్థులకు ఒక హెచ్‌ఎం, ఇద్దరు టీచర్స్ పని చేస్తున్నారు. జీవో 25 ప్రకారం ఇక్కడ ఇంకా ముగ్గురు టీచర్స్ అవసరం ఉన్నప్పటికీ ఒక్క ఖాళీని కూడా చూపకుండా విద్యార్థులకు అన్యాయం చేశారు.

5.ఖాళీలు చూపకపోవడం వల్ల జీపీఎస్ వెంగళ్‌రావు నగర్ ఉర్దూ మీడియం పాఠశాలలో 12 మంది విద్యార్థులకు ఒక్క టీచర్ కూడా లేని పరిస్థితి ఏర్పడింది.

6.బహదూర్‌పుర-2 మండలంలోని జీపీఎస్ నంది ముసలాయిగూడ పాఠశాలలో 68 మంది విద్యార్థులు ఉండగా, త్వరలో రిటైర్ కాబోయే ఒక్క టీచర్ మాత్రమే పని చేస్తున్నారు. ఇక్కడ ఇంకా ఇద్దరు టీచర్స్ అవసరం ఉండగా ఒక్క పోస్ట్ కూడా కౌన్సిలింగ్‌లో చూపించలేదు.

7.ముషీరాబాద్-2 మండలంలోని జీపీఎస్ మైలార్‌గడ్డ పాఠశాలలో 140 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 5 మంది టీచర్స్ అవసరం ఉండగా ముగ్గురు పని చేస్తున్నారు. మరో 2 పోస్టులు అవసరం ఉన్నా చూపించలేదు.

8.ఖాళీలు చూపకపోవడం వల్ల ఆసిఫ్‌నగర్ మండలంలోని జీపీఎస్ బౌలి గులాబ్ సింగ్‌లో 40 మంది విద్యార్థులకు ఒక్క టీచర్ కూడా లేరు.

9.జీపీఎస్ ఇమామ్‌పురలో 34 మంది విద్యార్థులకు ఒక్క టీచర్‌ను కూడా ఇవ్వలేదు. జీవో 25 ప్రకారం ఇక్కడ ఇద్దరు టీచర్స్ అవసరం. గతంలో ఈ పాఠశాలలో 200 కు పైగా విద్యార్థులు ఉండేవారు.

10.ఖైరతాబాద్‌లోని జీపీఎస్ వినాయకనగర్‌లో 120కి పైగా విద్యార్థులు ఉండగా అక్కడ ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారు. జీవో 25 ప్రకారం మరో ముగ్గురు ఉపాధ్యాయులు అవసరం ఉన్నప్పటికీ కేవలం ఒక్క పోస్ట్ మాత్రమే చూపించారు.

11.జీపీఎస్ సాయిబాబానగర్ పాఠశాలలో 160 మంది విద్యార్థులకు ఒక హెచ్‌ఎం, ఐదుగురు ఎస్‌జీటీలు ఉన్నప్పటికీ అవసరం లేకపోయినా అదనపు పోస్ట్ చూపించారు.

12.జీపీఎస్ ఎర్ర మంజిల్‌లో 109 మంది విద్యార్థులకు ఒక హెచ్‌ఎం, ఒక ఎస్‌జీటీ ఉండగా, ఇక్కడ మరో రెండు పోస్టులు అవసరమైతే ఒకటి అదనంగా కలిపి 3 పోస్టులు చూపించారు.

13.ఆసిఫ్‌నగర్ మండలంలోని జీపీఎస్ రహీంపుర పాఠశాలలో 22 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఒక టీచర్ పని చేస్తున్నారు. మరో టీచర్ మాత్రమే అవసరం ఉండగా ఇద్దరిని కేటాయించారు.

14.బండ్లగూడ మండలంలోని జీపీఎస్ లలితాబాగ్‌లో ఆరుగురు విద్యార్థులకు ఒక హెచ్‌ఎం, ఒక ఎస్‌జీటీ పని చేస్తుండగా అవసరం లేకపోయినా మరో ఖాళీ చూపించారు.

15.బండ్లగూడలోని జీపీఎస్ పర్వతినగర్‌లో 16 మంది విద్యార్థులకు గాను ఒక హెచ్‌ఎం, ఒక టీచర్ ఉండగా, మరో టీచర్‌ను అదనంగా కేటాయించారు.

16.బండ్లగూడలోని జీపీఎస్ శివాజీనగర్‌లో 50 మంది విద్యార్థులకు ఒక హెచ్‌ఎం ఇద్దరు టీచర్స్ ఉండగా, అవసరం లేకపోయినా మరో ఇద్దరు టీచర్స్‌ను కేటాయించారు.

17.బండ్లగూడలోని జీపీఎస్ అయోధ్యనగర్‌లో 45 మంది విద్యార్థులకు నలుగురు టీచర్స్ ఉండగా మరో టీచర్‌ను కేటాయించారు.

18.బండ్లగూడలోని జీపీఎస్ ఇందిరానగర్‌లో 120 పైగా పిల్లలు ఉండి ముగ్గురు టీచర్స్ పని చేస్తున్నారు. ఇంకా ఇద్దరు టీచర్స్ అవసరం ఉన్నప్పటికీ ఒక్క ఖాళీని కూడా చూపలేదు.

19.షేక్‌పేట మండలంలోని జీపీఎస్ ఇందిరానగర్‌లో 166 మంది విద్యార్థులకు ఒక హెచ్‌ఎం, ఒక ఎస్‌జీటీ పని చేస్తున్నారు. జీవో 25 ప్రకారం మరో నలుగురు టీచర్స్ అవసరం ఉండగా, 3 పోస్టులు మాత్రమే నింపారు.

20.నాంపల్లి మండలం రామ్‌కోఠి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. అక్కడ ఒక టీచర్ ఉండగా, మరో టీచర్ అవసరమైతే ఇద్దరిని ఇచ్చారు.

21.బండ్లగూడ మండలంలోని జీపీఎస్ ఇందిరానగర్‌లో 116 మంది విద్యార్థులకుగాను ముగ్గురు టీచర్స్ పని చేస్తున్నారు. మరో పోస్ట్ అవసరం ఉండగా ఖాళీలో చూపించలేదు.

సృజనాత్మకత స్ఫూర్తినిచ్చే కళా నైపుణ్యం..

"డైవర్స్ వాయిస్.. ఆర్ట్ బియాండ్ బౌండరీస్" ఎగ్జిబిషన్ లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



నవతెలంగాణ-ధూల్ పేట్

కళాకారులు సృజనాత్మకత స్ఫూర్తినిచ్చే కళా నైపుణ్యం అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. సాలార్ జంగ్ మ్యూజియంలో వెస్టర్న్ బ్లాక్‌లో ఆర్ట్ శాంక్చురీ సహకారంతో నిర్వహించిన "డైవర్స్ వాయిస్.. ఆర్ట్ బియాండ్ బౌండరీస్" ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మ్యూజియం అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. వారి కళా ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రదర్శన సంస్కృతి సంప్రదాయాలను ధిక్కరించి, మనందరికీ మరింత వర్తమానన్ని గుర్తు చేస్తుందన్నారు. ఈ కళా సృజనాత్మకంగా ఉండేలా స్ఫూర్తినిచ్చే కళాకారుల యొక్క అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తుందన్నారు. సెక్రటరీ ఆర్ట్ శాంక్చురీ షాలినీ గుప్తా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని సాలార్ జంగ్ మ్యూజియం, భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ సహకారంతో, భారతదేశంలోని వివిధ మూలల నుండి వచ్చిన న్యూరోడైవర్స్ కళాకారుల 100 కళాకృతులను 2024 అక్టోబర్ 19 నుండి 27 వరకు ప్రదర్శించబోతున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ చూడతానికి ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం అధికారులు, మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, అతియా అమ్జాద్ పాల్గొన్నారు.

వినియోగదారుల నమ్మకం పొందడమే మా లక్ష్యం

● కొత్త మాసు కుమార్ విజయభాస్కర్



నవతెలంగాణ-బంజారా హిల్స్

కొత్త మాసు తులసీదాసు నటరాజ్ జూలరి మార్ట్‌ను వినియోగదారుల నమ్మకం కోసమే ప్రారంభించామని నిర్వాహకులు కొత్త మాసు కుమార్ విజయ్ భాస్కర్ తెలిపారు. శనివారం పంజాగుట్టలో నూతన స్టోర్‌ను కుటుంబ సభ్యులతో కలిసి ముందుగా భారతీయ హిందూ సాంప్రదాయ ప్రకారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంజాగుట్టలో అనేక నగల వ్యాపార సంస్థలు దుకాణాలు ఉన్నాయనీ వాటి కన్నా విభిన్నంగా తాము ఏమి ఇవ్వాలో అది వినియోగదారుల నుండి ప్రారంభిస్తామని దాని కొరకు వారి నమ్మకాన్ని పొందడమే లక్ష్యంగా పనిచేసే నాణ్యమైన నగల ఇతర వస్తువులను అమ్ముతూ స్థిరమైన వ్యాపారాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులతో పాటు వారి కుటుంబ సభ్యులు వారి బంధువులు సంస్థలో పనిచేసే సుమారు 20 నుంచి 30 మంది సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠ రేపిన టీజీవోస్ ఎన్నికలు

● టీజీవోస్ హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షునిగా కృష్ణ యాదవ్
● కార్యదర్శిగా మహ్మద్ అబ్దుల్ ఖాదర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షునిగా ఎంబీ కృష్ణ యాదవ్, కార్యదర్శిగా మహ్మద్ అబ్దుల్ ఖాదర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాంపల్లిలోని టీజీఓ భవనంలో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శి ఏ. సత్యనారాయణ సమక్షంలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా సహదేవ్, సహాయ ఎన్నికల అధికారిగా టీ.లక్ష్మణ్ వ్యవహరించారు. రెండు రెవెన్యూ డివిజన్లు, 16 మండలాల, 55 ప్రభుత్వ కార్యాలయాల యూనిట్స్‌తోకలిపి 3200 సభ్యులున్నారు. శనివారం జరిగిన హైదరాబాద్ జిల్లా శాఖా ఎన్నికలు ఉత్కంఠ భరితంగా మొదలై, నువ్వానేనా అనే తీరులో కొనసాగాయి. చివరకు సుభ్యుల ఏకగ్రీవంతో, ఏకగ్రీవంగా సభ్యులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో హైదరాబాద్ జిల్లా అధ్యక్షునిగా ఎం.బీ. కష్ణయాదవ్, సహా అధ్యకులుగా ఆశన్న, కార్యదర్శిగా మహ్మద్ అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యకులుగా డా. ఎన్. సురేందర్, రాజేందర్, ఎంజులారెడ్డి. సహకార్యదర్శులుగా మహ్మద్ గౌస్, శ్రీరామ్, డా. సునీతజోషి, కోశాధికారిగా ఎం.వీ. రమణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా పూనం, ప్రచార కార్యదర్శిగా మంచాల రవీందర్, కార్యాలయ కార్యదరిగా గోపాలకష్ణ, సాంస్కతిక కార్యదర్శిగా డా.రమేష్, క్రీడా కార్యదర్శిగా డా. సందీప్ కుమార్, కార్యవర్గసభ్యులుగా శ్రవణ్ కుమార్ రెడ్డి, జే.నర్సింగ రావు, బీ.శ్రవణ్ కుమార్ గౌడ్, పావని ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు మాట్లాడుతు నూతనంగా ఎన్నికైన హైదరాబాద్ జిల్లా శాఖా అధ్యక్షులు కష్ణ యాదవ్, కార్యదర్శిగా ఎన్నికైన మహ్మద్ అబ్దుల్ ఖాదర్‌తో పాటు ఇత కార్యవర్గాన్ని అభినందించారు. ప్రభుత్వ అధికారులుగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పని చేస్తూనే ప్రజలలో భాగమై మన హక్కుల కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యద ఏనుగుల సత్య నారాయణ నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. అధికారులందరు. ఐక్యమత్యంతో కేంద్ర సంఘ ఆదేశాల ప్రకారం కార్యాచరణలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యామ్, ట్రెజరర్ ఉపిందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు, జాయింట్ సెక్రెటరీ పరమేశ్వర్‌రెడ్డితోపాటు దీపరెడ్డి, యాదగిరి, వెంకటేశ్వర్లు, డా.హరి కృష్ణ, కొటాజి, పవన్ కుమార్, రామారావు పాల్గొన్నారు.

నిరుద్యోగులను పోలీసులతో కొట్టించడం దారుణం'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా నినదిస్తున్న నిరుద్యోగులపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో కొట్టించడం దారుణమని భారత లోక్ దళ్ పార్టీ జరిగిన ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు అన్నారు. శనివారం హిమాయత్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూల్ ఆఫ్ రిజర్వేషన్లు లేకుండా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వానికి వచ్చిన తొందర ఏమిటని ఆయన ప్రశ్నించారు. జీవో 29ని రద్దు చేయాలని, నిరుద్యోగ అభ్యర్థులకు మేలు చేయని అనేక తప్పిదాలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాకే గ్రూప్-1 పరీక్షలు నిర్వహించాలని కోరడం ప్రభుత్వానికి నేరంలా కనిపించడం శోచనీయమన్నారు. నిరుద్యోగులకు మేలు జరుగుతుందని కాంగ్రెస్‌ని గెలిపిస్తే పోలీసులతో కొట్టించడం హేయమైన చర్య అన్నారు. నిరుద్యోగులు ఉంటున్న హాస్టళ్లు, గదుల్లోకి చొచ్చుకెళ్లి మరీ పోలీసులు లాఠీలతో తీవ్రంగా కొట్టడం ద్వారా అనేక మంది నిరుద్యోగులు తీవ్ర గాయాలపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
ఆదివారం | అక్టోబర్ 20, 2024 | www.navatelangana.com

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీ నగర్ డివిజన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాంధీనగర్, ముషీరాబాద్, అడిక్‌మెట్ డివిజన్‌లో లబ్దిదారులకు దరఖాస్తు చేసుకున్న సీఎం రిలీఫ్ ఫండ్ 3,55,000 విలువ గల చెక్కులను చెక్కులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిక్ మెట్ సురేందర్, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ముఠా నరేష్, శ్యాంసుందర్ చిట్టి, అస్లం, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, రాంనగర్ డివిజన్ ప్రెసిడెంట్ శంకర్ ముదిరాజ్, మాధవ్, శ్రీధర్ చారి, ఆకుల శ్రీనివాస్, పాశం రవి, రాజ్ కుమార్, శివ యాదవ్, బలవంత రాజ్, విటల్, తదితరులు పాల్గొన్నారు.

పాడి పంట బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

- ప్రభుత్వానికి మీకు మధ్య వారధిగా ఉంటాను
- గోపాల మిత్రల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-ముషీరాబాద్

పాడి పంట బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, గోపాల మిత్రల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర గోపాల మిత్రల సంఘం ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఆత్మీయ సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గోపాల మిత్రల చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పాడిపంట బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నేను రైతు బిడ్డని పార్లమెంట్ సభ్యుడుగా ఉన్నప్పుడు కూడా పశువులను పెంచానన్నారు. ఇప్పుడు కూడా నాకు వ్యవసాయం పశు పోషణ మీద గౌరవం ఉంటుంది. రైతుబిడ్డగా చెబుతున్నాను ప్రభుత్వానికి మీకు మధ్య వారధిగా ఉంటానని నేను మీ గొంతుకగా మీ సమస్యల పై ఒక నివేదిక తీసుకొని ముఖ్యమంత్రితో చర్చిస్తానని తెలిపారు. లక్షల పశువులకు ఉపయోగపడే విధంగా గోపాల మిత్రలు పని చేస్తున్నారని మీ ఆరోగ్యానికి ప్రత్యేకంగా న్యాయం జరిగేలా చొరవ తీసుకుంటానన్నారు. గౌరవ వేతనం పెరగడం, ఫేజ్‌లో వారీగా వెటర్నరీ డాక్టర్ సహాయకులుగా నియామకాలు అయ్యేలా చూస్తా గోపాల మిత్రలు వెటర్నరీలు వేరు కాదని తెలిపారు. హుస్నాబాద్‌లో పాల ఉత్పత్తిదారుడు కల్తీ లేని పాలు పోస్తారు. హుస్నాబాద్‌లో తప్ప మిగిలిన అన్నిచోట్ల పాల ఉత్పత్తులు కల్తీ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాల్సిన చిన్న వయస్సు నుండే పాలలో కల్తీ వల్ల అనారోగ్యం భారిన పడుతున్నారు. కల్తీ నిరోధించబడి ఆరోగ్య తెలంగాణగా రూపుద్దిదుకోవాలని సమృద్ధిగా పాల ఉత్పత్తి జరిగినప్పుడే కల్తీని నిరోధించవచ్చునన్నారు. రాష్ట్రంలో 12,700 గ్రామ పంచాయతీలలో పాల ఉత్పత్తి వేగంగా జరిగితే మన సమస్యకు మార్గాన్ని కూడా మనమే పరిష్కారం అయ్యేలా చూసుకుందామన్నారు. నవంబర్ మొదటి వారంలోపు ముఖ్యమంత్రి దగ్గరకు తీసుకుపోతా మీ సమస్య పరిష్కారమైన తరువాత ముఖ్యమంత్రిని సన్మానించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో మల్లీశ్వరి , రిటైర్డు ఐఎఎస్ ఎంవి రెడ్డి, వెటర్నరీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ బాబు, ఇతర అధికారులు, గోపాల మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదివే సంస్కృతి పెరగాలి



- 37వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- డిసెంబర్ 19 నుంచి 29 వరకు పుస్తక మహోత్సవం

నవతెలంగాణ-ముషీరాబాద్

నేటి సమాజంలో పుస్తకాలు చదివే సంస్కృతి మరింత పెరగాలని తెలంగాణ సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన క్యాంప్ ఆఫీస్‌లో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. యేటా హైదరాబాద్‌లో జరిగే బుక్ ఫెయిర్ సమాజంలో పుస్తకాలు చదివే సంస్కృతిని పెంచుతుందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 19 నుంచి 29 వరకూ ఎన్టీఆర్ స్టేడియంలో పదిరోజుల బుక్ ఫెయిర్ జరుగుతుందని, ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అనుకూలంగా హైదరాబాద్ నగరంలో పుస్తక మహోత్సవం నిర్వహించే ఆనవాయితని కొనసాగించడం హర్షనీయమని బుక్‌ఫెయిర్ నిర్వహకులను అభినందించారు. పుస్తక ప్రియులు, విద్యార్థులు, రచయితలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అధ్యక్షులు యాకూబ్ మాట్లాడుతూ.. బుక్‌ఫెయిర్ నిర్వహణకు సహకారం అందిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బుక్‌ఫెయిర్‌లో ప్రచురణ కర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బుక్ ఫెయిర్ జనరల్ సెక్రటరీ ఆర్.వాసు మాట్లాడారు. బుక్ ఫెయిర్‌లో విజిటర్లకు, రచయితలకు, స్టాల్ నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సుమారు 250కి కు పైగా జాతీయ, అంతర్జాతీయ పబ్లిషర్లు పాల్గొంటారని, పదిలక్షలకుపై పైగా జనం విజిట్ చేసారని తెలిపారు. విద్యార్థులకు తమ ఐడీ కార్డులతో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని ఆయన వివరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో కోశాధికారి నారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు కె. బాల్‌రెడ్డి, శోభన్‌బాబు, జాయింట్ సెక్రటరీలు కె. సురేశ్, ఎం. సూరిబాబు, ఈసీ సభ్యులు జనార్ధన్ గుప్తా విజయారావు, మధుకర్, కోటేశ్వర రావు, శ్రీకాంత్, శ్రీనివాసరావు, సాంబశివరావు, స్వరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరించి పబ్బం కడుపుకోవడం ఆ యూట్యూబర్స్ నైజం



నవతెలంగాణ-బంజారాహిల్స్

తనపై తన సంస్థపై గతంలో కొంతమంది యూట్యూబర్స్ యూట్యూబ్ వేదికగా అసత్య ప్రచారాలు చేసి తనను భయపెట్టడానికి ప్రయత్నం చేశారని అదృష్ట స్టార్ జువెల్స్ చైర్మన్ రమణ యోగి లాల్ ఆరోపణలు చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనపై వచ్చిన అసత్య ఆరోపణలు ఖండిస్తూ తాను ఆ యూట్యూబర్స్‌ను ప్రశ్నించగా వారు పొరపాటు జరిగిందని భవిష్యత్తులో ఇకపై పొరపాటు జరగదని చెప్పి తనకు దగ్గరయ్యారన్నారు. తర్వాత వారు తమకు ఆర్థికంగా సహాయం చేయమని అడిగితే తాను కొంత మొత్తంను వారికి ఇవ్వడం జరిగిందని అక్కడితో ఆగకుండా వారు తనను ఇంకా ఎక్కువ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడంతో తాను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు వారికి సంబంధించిన ఆధారాలు ఇవ్వడంతో తనపై కక్ష పెంచుకొని అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచారు.

4వ రోజుకు చేరిన తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగుల దీక్ష



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సుప్రీంకోర్టు నిర్ధారించిన క్యాట్ ఉత్తర్వులను, పోస్టల్ డైరెక్టరేట్ ఆదేశాలను యధాతథంగా అమలు చేయడంతో పాటు క్యాట్ ఆర్డర్ ప్రకారం సర్వీస్ క్రమబద్ధీకరించాలని తపాలాశాఖ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు యర్రంశెట్టి దుర్గాప్రసాద్ అన్నారు. విశ్రాంత తపాలా ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో విశ్రాంత తపాలా ఉద్యోగులు, రిజర్వ్ ట్రైన్డ్ పూల్ స్కీమ్ ఉద్యోగులు అబిడ్స్‌లోని జనరల్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న నెహ్రూ విగ్రహం వద్ద మండుటెండలో చేస్తున్న దీక్ష నాల్గొవ రోజుకు చేరుకుంది. ఇప్పటికైనా అధికారులు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'నారాయణగూడలో అక్రమ పార్కింగ్ స్థలాల తొలగింపు'

- నారాయణగూడ ట్రాఫిక్ సీఐ ఎం.సత్యనారాయణ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రోప్ ఆపరేషన్ లో భాగంగా సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్ పిలుపు మేరకు శనివారం జీహెచ్ఎంసీ అధికారులు, నారాయణగూడ ట్రాఫిక్ సీఐ ఎం.సత్యనారాయణ, ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో కలిసి డివిజన్ లోని నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తా, రెడ్డి మహిళా కాలేజ్ నుండి కింగ్ కోఠి వరకు అక్రమణలకు గురైన ఫుట్ పాత్ లు, అక్రమ పార్కింగ్ స్థలాలను గుర్తించి తొలగించారు. ఈ మేరకు అక్రమ ఫుట్ పాత్, పార్కింగ్ లకు పాల్పడిన వారిపై



జరిమానాలు విధించినట్లు సీఐ ఎం.సత్యనారాయణ తెలిపారు.

వ్యవసాయ అధికారులకు ప్రమోషన్లు కల్పించాలి

- తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న వ్యవసాయ అధికా రులకు సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వ్యవసాయ అధికారుల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైద్యనాథ్ మాట్లాడుతూ.. అన్ని కేడర్‌లోని సీనియార్టీ ప్రకారం జాబితాను తయారు చేయాలని ఆయన కోరారు. ప్రతి వ్యవసాయ అధికారికి వాహనంతో పాటు ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, అధికారులకు ఇతర సౌకర్యాలు కూడా కల్పించాలని ఆయన కోరారు. వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే బదిలీలు సైతం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కృపాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు శశిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ అనురాధ, కోశాధికారి రవీందర్, మహిళా ఉపాధ్యక్షురాలు వీణా రెడ్డి, ప్రచార కార్యదర్శి మానస తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిపులు పెంచాలి

- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య
- సంక్షేమ భవన్‌ను ముట్టడించిన విద్యార్థులు



నవతెలంగాణ-మెహిదీపట్నం

పెరిగిన ధరల ప్రకారం ప్రభుత్వం వెంటనే విద్యార్థుల మెస్‌చార్జీలు, స్కాలర్‌షిపులు పెంచాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల స్కాలర్‌షిపు, మెస్ చార్జీలు పెంచాలని అలాగే విద్యార్థుల ఫీజు బకాయిలను చెల్లించాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం నాయకులు వేముల రామకృష్ణ నాయకత్వంలో వందలాది మంది విద్యార్థులు మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పెరిగిన ధరల ప్రకారం విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిపు పెంచాలని, విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.4000 కోట్లు చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని, పై చదువులకు దూరం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిపులు పెంచాలని, వారికి పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వాలని, కొత్త కాలేజీ హాస్టల్‌లు ప్రారంభించాలని, వాటికి నూతన భవనాలు నిర్మించాలని, ప్రయివేటు కళాశాలలో రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటం తప్పదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నీలా వెంకటేష్, గుజ్జ కృష్ణ, నందగోపాల్, అనంతయ్య, రాజేందర్, ఉదయ్, మహేష్, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల వీసీల నియామకాలలో బీసీలకు తీవ్ర అన్యాయం

- బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీలపల్లి అంజి



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 9 యూనివర్సిటీల వీసీల నియామకాలలో కేవలం బీసీలకు ముగ్గురికి మాత్రమే నియమించడం తీవ్ర అన్యాయమని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీలపల్లి అంజి శనివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. 54 శాతం ఉన్న బీసీలకు కేవలం మూడు స్థానాలు నియమించడం సరికాదని ప్రభుత్వం ప్రకటించబోయే మూడు యూనివర్సిటీలలో రెండు వాస్ ఛాన్సులర్స్ పోస్టులు బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1అభ్యర్థులు చేస్తున్న పోరాటం పూర్తిగా న్యాయమైనదని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని నమ్మి లక్షలు ఖర్చుపెట్టి కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకుంటే జీవో 29 నిరుద్యోగుల పక్షాన శాపంగా పారిన మారిందని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని జీవో 29 బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ తూట్లు పడడమే ప్రభుత్వం తక్షణమే జీవో నెంబర్ 29 రద్దు చేయకపోతే ప్రభుత్వంపై పోరాడుతామని ఆయన హెచ్చరించారు.

ఆధార్ సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలి

- బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి సాయి కిరణ్



నవతెలంగాణ-ధూల్ పేట్

ఆధార్ సర్వీస్‌లను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ బహదూర్ పుర నియోజకవర్గం ఇన్‌చార్జి సాయి కిరణ్ అన్నారు. కిషన్ బాగ్ పార్టీ కార్యాలయంలో ఆధార్ అప్ డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధార్ అప్‌డేట్ కోసం స్థానిక ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆధార్ కార్డులోని ఏదైన తప్పులు సరి చేసుకోవడం, అప్‌డేట్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, ఆధార్ కో ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హామీలు అమలు చేయాలి

- గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడ్ ధర్మానాయక్



నవతెలంగాణ-ధూల్‌పేట్

గిరిజన హామీలు అమలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడ్ ధర్మానాయక్ డిమాండ్ చేశారు. ఖమ్మం పట్టణంలో జరిగే గిరిజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని నగరం పాతబస్తీ ఫలక్నామా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజనులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఇప్పటికి రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని కేటాయించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఏడాది కావొస్తున్న చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ధర్మ గూగులోత్ మొదటివర్ధంతి సభ ఉంటుందని, వారి స్ఫూర్తిని తీసుకొని తెలంగాణ రాష్ట్ర సమ స్యల సాధన కోసం జరిగే ఈ సమ్మేళనానికి గిరి జన పెద్దలు, విద్యార్థులు, యువకులు, మేధావులు మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కరపత్రం విడుదల కార్యక్రమంలో గిరిజన సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు వీ.రాంకుమార్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలు నాయక్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఏ కృష్ణా నాయక్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ కిషన్ నాయక్, లక్ష్మి, బుజ్జి, నరి, చిన్న శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గద్దగూటి ఎట్టయ్య మహాత్మ గాంధీ గ్లోబల్ పీస్ అవార్డుకు ఎంపిక



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రముఖ హైకోర్టు న్యాయవాది, సంఘ సేవకులు గద్దగూటి ఎట్టయ్య మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు-2024కు ఎంపిక చేసినట్టు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షు లు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తెలి పారు. పర్యావరణ పరిరక్షణ, శాంతి, మత సామరస్యం, జాతీయ సమైక్యత, ఉచిత న్యాయ శిబిరాలను గత 15 సంవత్సరాలుగా నిర్విరామంగా నిర్వహిస్తున్నందుకు ఈ అవార్డుకు ఎన్నిక చేసినట్టు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలోని న్యాయ కళాశాల నుండి ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పట్టా పొందారని, రంగారెడ్డి వైద్య ఆరోగ్య శాఖలో 104లో వైద్య సేవలు అందిసున్నారని, సివిల్, క్రిమినల్, ఫ్యామిలీ కంపెనీ, వినియోగదారుల ఫోరం, లేబర్ కోర్టు బ్యాంక్, హైకోర్టులో ఎంతో సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. యువకులు, మహిళలకు వారి హక్కుల పట్ల ఎన్నో ఉచిత శిబిరాలు నిర్వహించి వాళ్లకు అవగాహన కలిగించారని, ప్రభుత్వ, ప్రయివేట్ బ్యాంకింగ్ సంస్థలకు పానెల్ అడ్వకేట్‌గా ఉన్నారని వివరించారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు మహాత్మా గాంధీ జయంతి, అంతర్జాతీయ అహింస దినోత్సవం ముగింపు ఉత్సవాల సందర్భంగా ఈ అవార్డు బహుకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మెన్, ఎమ్మెల్సీ, మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బండా ప్రకాష్, పార్లమెంట్ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్, మాజీ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మెన్ గోపిశెట్టి నిరంజన్, సుప్రీంకోర్టు న్యాయవాది డి.ఎల్. పాండు తదితరులు పాల్గొని, ప్రసంగిస్తారని ఆయన తెలిపారు.

జీఓ 29ను ప్రభుత్వం రద్దు చేయాలి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

గ్రూప్-1 అభ్యర్థుల రిజర్వేషన్లకు ఇబ్బందికరంగా ఉన్న జీఓ 29ను వెంటనే రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యురాలు డా.జి.అనూహ్య రెడ్డి శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభు త్వం అవలంబిస్తోన్న వింత పోకడల కారణంగా అభ్య ర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సోమవారం ఓ పక్కన సుప్రీంకోర్టులో కేసు వాదనలు, మరో పక్క రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్-1 పరీక్ష నిర్వహణ జరుగుతోందన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించిన విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయొద్దని ప్రభుత్వానికి సూచించారు. గతంలో ఉన్న జీఓ 55ను అమలు చేసే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. జీఓ 29 వల్ల లక్షలాది మంది విద్యార్థులు గ్రూప్-1 చదవలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఇంకా మొద్దు నిద్ర వీడకపోతే మరిన్ని ఉద్యమాలకు తాము పిలుపునివ్వాల్సి వస్తుందని అనూహ్య రెడ్డి హెచ్చరించారు.

అఖిల భారత బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల ధర్నా



నవతెలంగాణ-ముషీరాబాద్

అఖిల భారత బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన మహా ధర్నాలో మాట్లాడిన వక్తలందరు బ్యాంకు వర్కింగ్ ఉద్యోగులతో సమానంగా వారి జీత భత్యాలు పెంచినప్పుడు పింఛన్ కూడా పెంచాలని, కమ్యూటెడ్ పింఛన్ పదేండ్ల తరువాత రిస్టోర్ చేయాలని, విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య భీమా బ్యాంకులే కటాలని, అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల సమాఖ్యతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ ధర్నాలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, దేనా బ్యాంక్, యూనియన్ బాంక్ ఆఫ్ ఇండియా, ఫెడరల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌ల (ఏఆర్ఎస్ఈ) ప్రతినిధులు డాక్టర్ అనంత కృష్ణారావు, మధుసూదన్, రోహిణి రావు, ఉప్పు సుధాకర్, మురళి, సూర్యనారాయణ, మూర్తి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- జోనల్ కమిషనర్ టి.వెంకన్న



నవతెలంగాణ-ధూల్‌పేట్

టౌన్ ప్లానింగ్ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. జోన్ పరిధిలోని టౌన్ ప్లానింగ్ సమస్యలపై చాంద్రాయణగుట్ట నర్కీపూల్ బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో శనివారం జోనల్ కమిషనర్ వెంకన్న ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన అన్ని అంశాలపై సంబంధిత ఏసీపీలు ఎప్పటికప్పుడు తమ సిబ్బందితో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులకు ఎప్పటికప్పుడు హాజరవుతూ.. వాటిని పరిష్కరించాలన్నారు. ఇంటి నిర్మాణాల కొరకు టీజీబీ పాస్‌లో అందే దరఖాస్తులను పరిశీలించి వాటికి ఎప్పటికప్పుడు అనుమతులు ఇవ్వాలన్నారు. గుర్తించిన ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై సంబంధిత సర్కిల్ అధికారులు నోటీసులు జారీ చేస్తూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎస్టిఎఫ్‌టీల సమన్వయంతో అక్రమ నిర్మాణలను తొలగించాలన్నారు. ప్రజల నుండి అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మలక్ పేట్, సంతోష్ నగర్, చాంద్రాయణగుట్ట, ఫలక్ నుమా, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్లు జయంత్, శైలజ, సురేందర్, అరుణ కుమారి, రవికుమార్, జోనల్ టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మజీద్, ఏసీపీలు గజానంద్, స్వామి, భానుచందర్, రాందాస్, మెహ్రా, శ్రీధర్, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రయివేట్ బ్యాంక్ ఉద్యోగి అదృశ్యం



నవతెలంగాణ-ధూల్ పేట్

ప్రయివేట్ బ్యాంక్ ఉద్యోగి అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ అస్లం తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్ నగర్, సీతారామ్ బాగ్ ప్రాంతానికి చెందిన ప్రిథ్వీ రాజ్ అలియాస్ రాహుల్(29) హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్‌లో ఉద్యోగి. ఈ నెల 15వ తేదీ సాయంత్రం ఇంట్లో నుండి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు స్థానిక స్నేహితులు, బంధు మిత్రులు, రక్త సంబంధులతో వాకాబు చేశారు. ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్ అభయ హస్తం పథకం ప్రారంభించాలి

తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గడ్డ యాదయ్య మాదిగ



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం పథకం వెంటనే ప్రారంభించి నిధులు విడుదల చేయాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గడ్డ యాదయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంబేద్కర్ అభయ హస్తం పథకంపై నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గడ్డ యాదయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు రమేష్ కుమార్, బంధు సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు పల్లెల వీరస్వామి, తెలంగాణ దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దొమ్మాటి శివకుమార్, తెలంగాణ దండోరా విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మీసాల ఎల్లేష్ మాదిగ, ఉస్మానియా యూనివర్సిటీ డాక్టర్ నలనియెలు, మహా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు నరసయ్య, హాజరయ్యారు. ఈ సందర్భంగా గడ్డ యాదయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా స్వయం ఉపాధి రంగాలకు ఎటువంటి నిధులను విడుదల చేయలేదని తెలిపారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం కంటే కూడా రెండు లక్షలు ఎక్కువగా ఇస్తామని చెప్పి ఒక కుటుంబానికి 12 లక్షల చొప్పున అంబేద్కర్ అభయహస్తం పేరుతో పథకాన్ని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని వెంటనే ప్రారంభించి నిధులు విడుదల చేయాలని ఎంపిక చేసే వారిలో తమ యొక్క నిజాయితీని చాటుకోవాలని కోరారు.

మహిళా ఉద్యమ పునర్నిర్మాణానికి వేదిక ఖమ్మం



అక్టోబర్ 21,22,23 తేదీల్లో కొత్తగూడెం పట్టణం మహిళా సంఘం మహాసభలకు వేదిక కాబోతోంది. రెండు తెలుగు రాష్ట్రాలకు ఇది గర్వించే విషయం. ఈ సందర్భంగా ఒక్కసారి చరిత్రలోకి వెళ్దాం. ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా ఉద్యమం నుండి స్ఫూర్తి పొందుదాం...

1974లో ఖమ్మం పట్టణంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం మూడో మహాసభలు జరిగాయి. కావడానికి మూడో మహాసభలు అయినా 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత జరిగిన మొట్టమొదటి మహాసభ 74లో ఖమ్మంలో జరిగిన ఈ మహాసభ. అంతకు ముందు ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో ఉన్న జిల్లాలు నిజాం పాలనలోనూ, ఇప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లాలతో పాటు బళ్ళారి మద్రాస్ ప్రెసిడెన్సీ లోనూ ఉండేవి. ఆంధ్ర రాష్ట్ర మొదటి మహాసభ 1947 ఫిబ్రవరిలో గుంటూరు జిల్లా చిలువూరులో జరిగింది. రెండవ మహాసభ 1948లో విజయవాడలో జరపాలని తలపెట్టారు. అయితే ప్రభుత్వం మహాసభను నిషేధించింది. అప్పుడే ఆంధ్ర వనిత పత్రికను ప్రచురించారు. పత్రిక కాపీలు కూడా ప్రభుత్వం నిషేధించింది. ఆ తర్వాత కృష్ణాజిల్లా అంగలూరులో రెండవ మహాసభ జరిగిందని చెబుతారు. తదనంతర కాలంలో ఆరంభం నుండి మహిళా ఉద్యమాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించింది వామ పక్ష ఉద్యమం. అయితే వామపక్ష ఉద్యమంలోనే వచ్చిన అనేక ఆటుపోట్లు కారణంగా మహిళా సంఘం కార్యక్రమాలు కూడా కుంటుపడ్డాయి.

ఉద్యమ విస్తరణ

1967లో గుంటూరు జిల్లా కాజా గ్రామంలో వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న మహిళా నాయకులు, కార్యకర్తలకు క్లాసులు నిర్వహించారు. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో అంటే ప్రస్తుత రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కలిపి మహిళా ఉద్యమాన్ని కాస్త పట్టాలెక్కించేందు 1974లో ఖమ్మం పట్టణంలో మహాసభలు జరిగాయి. మోటూరు ఉదయం కార్యదర్శిగా అంతకుముందు కార్యదర్శిగా ఉన్న మానికొండ సూర్యావతి అధ్యక్షురాలుగా, మల్లు స్వరాజ్యం, కొండపల్లి దుర్గాదేవి వంటి నేతలతో ఒక కార్యవర్గం ఏర్పడింది. అప్పటినుండి వెనుతిరిగి చూడకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు మహిళా ఉద్యమం విస్తరించింది.



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మహిళా ఉద్యమ నేత, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మహిళా ఉద్యమ అభివృద్ధికి విశేష కృషి చేశారు



కొత్తగూడెం డివిజన్‌లో కూలి, భూమి పోరాటాలకు నాయకత్వం వహించిన నాయకురాలు

స్త్రీల ధైర్య సాహసాలు అనేకం

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకించి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఒక గొప్ప స్థానం ఉన్నది. దొరల పీడనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం సాగితే ఆ పోరాటంలో భాగంగా మహిళలు తుపాకీ శిక్షణ అందుకొని పురుషులతో భుజం భుజం కలిపి పోరాడారు. దొరల పెత్తనాన్ని తరిమికొట్టారు. ఇదే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం ప్రాంతం సింగరేణి బొగ్గు గనుల కేంద్రం. ఆ రోజుల్లో ఆడవాళ్లు కూడా గనుల్లో పనిచేసేవారు. గని కార్మికుల పోరాటాల్లోనూ, నాయకుల్ని రక్షించుకోవడంలోనూ గని కార్మిక స్త్రీల ధైర్య సాహసాలు అనేకం ఉన్నాయి. అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తారమైన అటవీ ప్రాంతం, గిరిజనుల ఆవాసాలు ఉన్నాయి. ఇటు నైజాం సర్కారు దోపిడీకి అటు బ్రిటిష్ వాళ్ళ దోపిడీకి కూడా గిరిజనం అణగారిపోయారు. అటవీ హక్కుల కోసం గిరిజనులు ఎన్నో పోరాటాలు చేశారు. వాటన్నిటిలోనూ స్త్రీల పాత్ర ఉన్నది.

ప్రజలే చరిత్ర నిర్మాతలు

తమ బతుకుల బాగుకోసం ప్రజలు చేసే పోరాటాలే చరిత్ర. ఇది కమ్యూనిస్టు మేనిఫెస్టోలోని మొట్టమొదటి వాక్యంలో ఉన్న సారాంశం. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజా ఉద్యమాల్లో మహిళల పాత్ర ఓ చెరగని ముద్ర. ఎందరో నేతలు ప్రాణత్యాగాలకు కూడా వెనకాడ లేదు. భర్తను పోగొట్టుకున్న స్త్రీలు ఏడుస్తూ మూలన పడి ఉండక ఉద్యమ పతాకాలు భుజాలకు ఎత్తుకొని మోశారు. నాయకత్వం వహించారు. అటువంటి వారికి ఓ ఉదాహరణ బత్తుల హైమావతి. అంతకుముందే భద్రాచలం ప్రాంతంలో గిరిజన నేత రాజేశ్వరమ్మ, ఖమ్మం, కొత్తగూడెం ప్రాంతంలో ఏలూరు జయమ్మ కొండపల్లి దుర్గాదేవి ఆ తర్వాత భూస్వాముల దాడులకు గురై హత్యగావించబడిన గండ్లూరి కిషన్ రావు భార్య నర్సుబాయమ్మ వంటి నేతలు ఆరంభంలో ఉద్యమానికి సారథ్యం వహించారు. అలాగే పాయం సీతమ్మ పర్స భారతి మహిళా ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించి నేటి నాయకత్వానికి ఆదర్శంగా నిలిచారు. వీరంతా 1974లో జరిగిన మహాసభలకు వెన్నుదన్నుగా నిలబడ్డారు. ఈ మహాసభల కంటే ముందే ఇల్లెందు తాలూకాలోని బయ్యారంలో మహిళా కార్యకర్తలకు క్లాసులు జరిగాయి.



మణుగూరు ప్రాంతంలో మహిళా, ప్రజాపోరాటాలకు నాయకత్వం వహించారు

స్నేహ హస్తం అందిస్తూ...

అక్షరాస్యత ఉద్యమంలో, రిజర్వేషన్ల ఫలితంగా స్థానిక సంస్థల్లో వివిధ స్థానాల్లో ఎన్నికైన మహిళలు ఏమాత్రం వెనుకంజ వేయకుండా శక్తి సామర్థ్యాలు నిరూపించుకున్నారు. అబల అనే పదాన్ని తుడిచిపెట్టారు. రైతాంగ పోరాటాల్లో, వ్యవసాయ కార్మిక పోరాటాల్లో, సారా వ్యతిరేక ఉద్యమాల్లో వేల సంఖ్యలో మహిళలు కదిలి వచ్చారు. ఈ ఉద్యమాలు ఎందరో నేతల్ని సృష్టించాయి. ఆనాటి నుండి ఇంటా బయట సాగే హింస కారణంగా కుమిలిపోతున్న స్త్రీలకు అండగా నిలబడి నేనున్నాను అని స్నేహ హస్తం అందించి, తోటి మహిళల్ని సమీకరించి ఉద్యమాలు సాగిస్తోంది అఖిల భారత మహిళా సంఘం.

- ఎస్.పుణ్యవతి,
ఐద్వా జాతీయ నాయకులు

వ్యాధుల నివారణకు...

జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కాలంతో పరిగెత్తే ఉరుకుల పరుగుల జీవితం.. ఒత్తిడితో కూడిన జీవనశైలి కారణంగా పట్టణ ప్రాంతాల్లో నివసించే వారి కంటే గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు సాపేక్షంగా ఆరోగ్యంగా ఉన్నారని ఒక అధ్యయనం



కనుగొంది. ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల రకరకాల వ్యాధులు వస్తాయి. దానివల్ల హైపర్‌టెన్షన్, టైప్ 2 డయాబెటిస్ వంటి జీవనశైలి వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువ. జీవనశైలి వ్యాధులను నివారించడానికి ఇక్కడ గుర్తుంచుకోవలసిన కొన్ని విషయాలు...

ఆకలితో ఉన్నప్పుడు జంక్ ఫుడ్స్ తినడం మానుకోండి.

రోజూ వ్యాయామం చేయండి. నడవండి లేదా యోగా, ఏరోబిక్స్, జుంబా వంటి వ్యాయామాలు చేయండి. వ్యాయామం చేయడం వల్ల శరీరం ఫిట్‌గా ఉండటమే కాకుండా వివిధ రకాల వ్యాధులను నివారిస్తుంది.

మీరు ప్రతిరోజూ మూడు నుంచి నాలుగు లీటర్ల నీరు తాగాలి. శరీరంలో నీటి స్థాయి తగ్గినప్పుడు డీహైడ్రేషన్ సమస్య వస్తుంది. ఇది వేసవిలో మాత్రమే వస్తుందనుకుంటాం. కానీ శీతాకాలంలోనూ మన శరీరానికి అదే మొత్తంలో నీరు అవసరం. డీహైడ్రేషన్ శరీరంలోని వివిధ భాగాలలో సమస్యలను కలిగిస్తుంది, కాబట్టి శరీరంలో అవసరమైన ఆక్సీకరణను నిర్వహించడానికి తగినంత నీరు తాగటం అవసరం. 7 గంటల మంచి నిద్ర అవసరం. కొందరు ఉద్యోగ రీత్యా నైట్ డ్యూటీలు చేసి ఉదయం నిద్రపోతుంటారు. కానీ.. ఆరోగ్యమైన జీవనశైలిలో రాత్రి నిద్రనే ఉత్తమం. నిద్రపోవడానికి, మేల్కోడానికి ఒక సాధారణ షెడ్యూల్ చేయండి. ఈ విధంగా శరీరానికి అవసరమైన విశ్రాంతి లభిస్తుంది.

మీకు నలభై ఏళ్ల నిండిన తర్వాత, కనీసం ఆరు నెలలకు ఒకసారి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకోండి.

రైతుభరోసా ఇవ్వకుండా మోసం చేస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు చేస్తున్న అన్యాయాన్ని బీఆర్ఎస్ సహించబోదని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి కుట్రలు రైతులకు తెలిసేలా బీఆర్ఎస్ కార్యకర్తలు చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాం రాం చెబుతుందని ఎన్నికలకు ముందే కేసీఆర్ చెప్పారని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పుడు ఆ మాటలను రేవంత్ రెడ్డి సర్కార్ అక్షరాల నిజం చేసిందని తెలిపారు. వానాకాలం పంట సీజన్‌కు రైతు భరోసాను పూర్తిగా ఎగ్గొట్టి లక్షలాది మంది రైతుల నోట్లో రేవంత్ రెడ్డి మట్టి కొట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా ఇచ్చేందుకు పైసలు లేకపోవటంతోనే సబ్ కమిటీ అంటూ కాలయాపన చేశారనీ, చివరకు చేతులేత్తేశారని కేటీఆర్ తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోన్న కాంగ్రెస్ సర్కార్‌కు వారి ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. పేదల కడుపు కొట్టి రూ. లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణ చేసేందుకు డబ్బులున్నాయి గానీ రైతులకు రూ. 15 వేల కోట్లు ఇచ్చేందుకు పైసలు లేవా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పదివేలు ముష్టి వేస్తున్నాడు...మేము రూ. 15 వేలు ఇస్తామన్న సిపాయి ఇప్పుడు ఎక్కడా అంటూ కేటీఆర్ నిలదీశారు. రేవంత్ రెడ్డి రైతుల వద్దకు వెళ్తే ఆయన వీపు చింతపండు అవటం ఖాయమన్నారు.

పచ్చి అబద్ధాలు, మోసాలతో రైతులను కాంగ్రెస్ దగా చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికలకు ముందు రుణమాఫీ, రైతు భరోసా పేరుతో ఎకరానికి ఏటా రూ.15 వేలు, రైతు కూలీలకు, కౌలు రైతులకు కూడా ఆర్థిక సాయం, ధాన్యానికి రూ. 500 బోనస్ అని బోగస్ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని తెలిపారు. కాంగ్రెస్ దగాకోరు మాటలు నమ్మిన రైతులను ఇప్పుడు అరిగోస పెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ పేరుతోనూ రైతులకు చేసిన మోసం చాలదన్నట్టు, ఇప్పుడు రైతు భరోసా విషయంలోనూ దగా చేస్తున్నారని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు ఇస్తామన్న వానాకాలం రైతు భరోసా ఇవ్వాల్సిందేనని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ ముట్టడిస్తామని హెచ్చరించారు.

గ్రూప్ 1 అభ్యర్థులతో చర్చించాలి

పరీక్ష వాయిదా వేయాలని కోరుతున్న గ్రూప్ 1 అభ్యర్థులతో చర్చించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తార్నాకలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. పరీక్ష వాయిదా వేయకుండా ఎందుకు మొండిగా వ్యవహరిస్తున్నారో చెప్పాలని కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు పోలీస్ సెక్యూరిటీ ఇచ్చి ర్యాలీ చేయించిన సీఎం రేవంత్ రెడ్డి, తమ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ముఠా గోపాల్ తదితరులతో పాటు గ్రూప్ 1 అభ్యర్థులను అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బండి సంజయ్‌కు పేపర్ లీకేజీ తప్ప ఏమీ తెలియదని ఎద్దేవా చేశారు. ఇప్పటికే గ్రూప్ 1 పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు సుప్రీంకోర్టుకు వెళ్లారనీ, సోమవారం ఉదయం విచారణ ఉందని తెలిపారు. గతంలో ఒక రాష్ట్రంలో సుప్రీంకోర్టు వాయిదా వేయాలని ఆదేశించిందని గుర్తుచేశారు. ప్రజాపాలన అంటూ, తమ వద్దకు రావాలంటూ, సమస్యలు పరిష్కారం చేస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్న కాంగ్రెస్ అభ్యర్థులను ఎందుకు అరెస్టు చేస్తున్నదని విమర్శించారు.

హైదరాబాద్‌ను స్టార్టప్ సంస్థలకు కేరాఫ్ అడ్రస్ గా తీర్చిదిద్దాం : ఇస్పాకాన్ సదస్సులో కేటీఆర్

హైదరాబాద్ నగరాన్ని స్టార్టప్ సంస్థలకు కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దామని ఐటీశాఖ మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్‌క్లూజివ్ గ్రోత్ అనే మూడు సూత్రాలతో నగరంలో స్టార్టప్ ఎకో సిస్టమ్‌ను నిర్మించామన్నారు. తార్నాకలోని సీసీఎంబీలో జరిగిన ఇస్పాకాన్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కల్పించాలంటే స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించటమే సరైన మార్గమని తాను భావించానని చెప్పారు. టీ హబ్ గ్రోత్ స్టోరీని ఈ సందర్భంగా కేటీఆర్ వివరించారు. టీ హబ్, టీ వర్క్స్, ఇమ్మేజ్ టవర్స్ పేరుతో దేశంలోనే అతి పెద్ద ఇంక్యుబేటర్ సెంటర్ హైదరాబాద్‌లో తీర్చిదిద్దామన్నారు. 2 వేల స్టార్టప్ కంపెనీల కెపాసిటీతో ప్రారంభమైన టీ హబ్ సక్సెస్ కావటంతో ఆ తర్వాత టీ వర్క్స్ , ఇమ్మేజ్ టవర్స్ పేరుతో ఒకే చోట 5 వేల స్టార్టప్ కంపెనీలకు గైడెన్స్ చేసే విధంగా తీర్చిదిద్దామన్నారు.

2014లో హైదరాబాద్‌లో 200 స్టార్టప్ కంపెనీలుంటే ప్రసుత్తం 5 వేలకు పైగా స్టార్టప్ కంపెనీలు పనిచేస్తున్నాయని తెలిపారు. రతన్ టాటా లాంటి గొప్ప వ్యక్తి టీ హబ్‌ను ఆధునిక భారత ముఖచిత్రం అంటూ ప్రశంసించటాన్ని ఎంతో గర్వంగా భావించానని కేటీఆర్ గుర్తుచేసుకున్నారు. భారత్ స్వదేశీ టెక్నాలజీతో ప్రయోగించిన మొదటి శాటిలైట్ ప్రయోగంలో హైదరాబాద్‌లోని స్టార్టప్ కంపెనీయే కీలక పాత్ర పోషించిందని అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న మొత్తం స్టార్టప్ కంపెనీలు ఏటా 3.5 బిలియన్ డాలర్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చెప్పారు. టైర్-2, టైర్-3 నగరాలకు కూడా ఈ ఎకో సిస్టమ్ విస్తరించాల్సిన అవసరముందని ఈ సందర్భంగా మాజీ మంత్రి అభిప్రాయపడ్డారు.

గ్రూప్-1కు సర్వం సిద్ధం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. హెచ్ఎండీఏ పరిధిలో ఈనెల 27వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. 2011 తర్వాత గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలు జరుగుతున్నాయి. దీంతో అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) సర్వం సిద్ధం చేసింది. ఏ విధమైన పొరపాట్లకు తావు లేకుండా, అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసింది. హైదరాబాద్‌లో ఎనిమిది, రంగారెడ్డిలో 11, మేడ్చల్ మల్కాజిగిరిలో 27 కలిపి మొత్తం 46 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ 9న నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. వారిలో 31,383 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు విస్తృతమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సీసీ టీవీలను ఏర్పాటు చేసి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. టీజీపీఎస్సీ కార్యాలయంలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయి. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉండబోదని అధికారులు స్పష్టం చేశారు. సకాలంలో చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేకంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు జరిగే సమయంలో నిరంతరం విద్యుత్ సరఫరా అందించేలా విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. పరీక్షలు నిర్వహించే రోజుల్లో అన్ని కేంద్రాలకూ ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్టు సంబంధిత అధికారులు ప్రకటించారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల కోడ్, వివిధ కారణాల రీత్యా రెగ్యులరైజ్ చేయలేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. దీంతో వారు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిగతావారిని కూడా తక్షణమే రెగ్యులరైజ్ చేసి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. గతేడాది మూడో తేదీన కొంతమంది కాంట్రాక్టు అధ్యాపకులను 16 జీవో ద్వారా ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిందని తెలిపారు. కానీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ వృత్తివిద్యా కోర్సుల్లో అధ్యాపకులుగా పని చేస్తున్న 410 మందిని, జనరల్ విభాగంలో 23 మందిని, ఉర్దూ మీడియం లాంగ్వేజ్ సమస్య ఉన్న 13 మందిని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నెట్/స్లెట్/పీహెచ్‌డీ అదనపు అర్హతలున్న 150 మందిని, 2014, జూన్ రెండు తర్వాత అర్హతలున్న 24 మందిని, ఈ ఏడాది జూన్ రెండు తర్వాత అదనపు అర్హతలు సాధించిన 11 మందిని రెగ్యులరైజ్ చేయలేదని వివరించారు. అదే విధంగా కాంట్రాక్టు అధ్యాపకులుగా నియామకం సమయంలో సరైన అర్హతలున్నప్పటికీ, ప్రస్తుతం అదనపు అర్హతలకోసం మరో 515 మందిని కూడా రెగ్యులరైజ్ చేయలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో ఉన్న అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

మరో అవకాశమివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం వరంగల్ జిల్లా రంగసాయిపేట ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ ఓటరు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత గల ఉపాధ్యాయులందరూ నవంబర్ 6వ తేదీలోపు ఓటరుగా పేరు నమోదు చేయించుకోవాలన్నారు. ఎమ్మెల్సీగా తనను మరోసారి గెలిపిస్తే ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణకు కృషి చేస్తానని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి నిరంతరం నిజాయితీగా పనిచేస్తానని అన్నారు. అనంతరం కాశిబుగ్గ, శివనగర్, పైడిపల్లి, ఆరెపల్లి ప్రభుత్వ పాఠశాల పాఠశాలలను నర్సిరెడ్డి సందర్శించి తనకు మరోసారి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాటికాయల కుమార్, సుజన్ ప్రసాదరావు, కోశాధికారి రావుఫ్, కార్యదర్శి నామోజు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ ప్రధాని నివాసమే లక్ష్యంగా డ్రోన్ దాడి

జెరూసలేం : పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సిజేరియాలోని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నివాసమే లక్ష్యంగా డ్రోన్ దూసుకొచ్చింది. ఈ దాడిలో ఎవరూ గాయపడలేదని ఇజ్రాయిల్ ప్రభుత్వం వెల్లడించింది. ఆ సమయంలో ప్రధాని, ఆయన సతీమణి నివాసంలో లేరని పేర్కొంది. అయితే శనివారం ఉదయం లెబనాన్‌వైపు నుంచి డ్రోన్లు దూసుకొస్తున్న తరుణంలో ఇజ్రాయిల్‌లో సైరన్లు మోగాయి.

ప్రస్తుతం ఇజ్రాయిల్.. హమాస్, హెజ్‌బొల్లా గ్రూప్‌ల అంతమే లక్ష్యంగా దాడులు చేస్తోంది. హమాస్ అధినేత యాహ్యా సిన్వర్‌తో సహా నాయకత్వ హోదాలో ఉన్న పలువురిని నెతన్యాహు సేనలు (ఐడీఎఫ్) హతమార్చాయి. అలాగే లెబనాన్‌లోని హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా సహా పలువురు కీలక కమాండర్లను మట్టుపెట్టింది. సిన్వర్ మతి తర్వాత స్పందించిన హెజ్‌బొల్లా.. తమ పోరాట దశను మార్చేలా ప్రణాళికలు వేసుకున్నామని తెలిపింది. క్షిపణులు, డ్రోన్లతో దాడులు తీవ్రం చేయనున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో హెజ్‌బొల్లా కేంద్రమైన లెబనాన్ వైపు నుంచి మూడు డ్రోన్లు దూసుకొచ్చినట్టు ఇజ్రాయిల్ దళాలు వెల్లడించాయి. సిజేరియాలోకి ఒక భవనాన్ని డ్రోన్ ఢీకొట్టినట్టు తెలిపాయి. మరో రెండింటిని అడ్డుకున్నామని పేర్కొన్నాయి.

ఇదిలా ఉంటే.. సిన్వర్ మతితో యుద్ధం కీలకమలుపు తిరిగే అవకాశం ఉందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇజ్రాయిల్ మాత్రం తమ బందీలు విడుదలయ్యే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేసింది. హమాస్ మిలిటెంట్లు ఆయుధాలను వదిలి.. బందీలను విడుదల చేస్తే వెంటనే యుద్ధం ముగిస్తామని నెతన్యాహు ప్రకటించారు. ఆపై హమాస్ తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితం గడిపే అవకాశం కల్పిస్తామన్నారు. లేదంటే వెంటాడి మరీ వారిని హతమారుస్తామని హెచ్చరించారు.

దానికి తగ్గట్టే ఉత్తర గాజాలోని జబాలియా శిబిరంపై శుక్రవారం రాత్రి ఇజ్రాయిల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడిలో 33 మంది పాలస్తీనా వాసులు మతి చెందగా.. అందులో 21 మంది మహిళలే ఉన్నారు. ఇజ్రాయిల్ దాడుల కారణంగా ఇప్పటి వరకు 42,500 మందికి పైగా మతి చెందినట్టు గాజా ఆరోగ్య శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

మా జీవితాలు బుగ్గిపాలు చేయొద్దు

నవతెలంగాణ-రామన్నపేట

కాలుష్య కారక సిమెంట్ పరిశ్రమను పెట్టి మా జీవితాలు బుగ్గిపాలు చేయొద్దు.. అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును విరమించుకోవాలంటూ విద్యార్థులు నినదించారు. అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానిక వివిధ పాఠశాలల విద్యార్థులు, యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. సుభాష్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా చేసే అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ మాకొద్దంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. పర్యావరణాన్ని, ప్రజా ఆరోగ్యాన్ని విధ్వంసం చేసి.. ప్రమాదకర రసాయనాలతో గాలిని కలుషితం చేసి.. ప్రాణాంతక వ్యాధులకు కారణమయ్యే ఫ్యాక్టరీని నిర్మిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈనెల 23న నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ జల్లెల పెంటయ్య, కో-కన్వీనర్ మహమ్మద్ రెహాన్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోచబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి బలరాం, టీడీపీ నాయకులు ఫజల్ బేగ్, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు గూనిరాజు, డీఎస్పీ నాయకులు నకిరేకంటి నరేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, టీఎంఎస్ఎఫ్ నాయకులు నకిరేకంటి గణేష్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు గంటేపాక శివకుమార్, పాఠశాలల కరస్పాండెంట్లు తిరుగుడు మల్లికార్జున్, మార్టిన్, గంగుల నరేందర్‌రెడ్డి, ప్రజాసంఘాల నాయకులు, ఎస్‌కె.చాంద్, నీలాఐలయ్య, పోచబోయిన మల్లేశం, శానకొండ వెంకటేశ్వర్లు, మేకలజలంధర్, పుట్టల ఉదయ్ కుమార్, తుర్కపల్లి నరేష్, పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీఆర్ ఏకపాత్రాభినయం అట్టర్ ప్లాప్

టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ ఎద్దేవా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మూసీ నది పునరుజ్జీవం అనే అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ అంతా ఆత్మస్తుతి, పరనిందలా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. ఆయన ఏకపాత్రాభినయం అట్టర్ ప్లాప్ షో అని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేటీఆర్ వాస్తవాలను వక్రీకరించి, అవాస్తవాలను వల్లెవేస్తూ, తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించారని విమర్శించారు.

విద్యాకమిషన్ సలహాకమిటీ నియామకం

హరగోపాల్ సహా మరో ఐదుగురికి అవకాశం

ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ విద్యాకమిషన్ సలహాకమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. విద్యాకమిషన్ సలహా కమిటీలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాల యం (హెచ్‌సీయూ)లో పనిచేసిన రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్, కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)లో పనిచేసిన రిటైర్డ్ ప్రొఫెసర్ కె మురళీ మనోహర్, అదే వర్సిటీకి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ కె వెంకట నారాయణ, శాతవాహన విశ్వవిద్యాలయం (ఎస్‌యూ) ప్రొఫెసర్ ఎస్ సుజాత, ఎంవీఎఫ్ జాతీయ కన్వీనర్ ఆర్ వెంకట్‌రెడ్డి, యూనిసెఫ్ విద్యానిపుణులు కెఎం శేషగిరి సభ్యులుగా ఉంటారని తెలిపారు. విద్యా కమిషన్ చైర్మెన్‌గా ఆకునూరి మురళిని గతనెల మూడో తేదీన ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈనెల 18న విద్యా కమిషన్ సభ్యులుగా టీజేఎస్ నాయకులు రిటైర్డ్ ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేశ్, మహిళా కాంగ్రెస్ నాయకులు జ్యోత్స్న శివారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విద్యారంగంలో చేపట్టాల్సిన మార్పులు, తేవాల్సిన సంస్కరణల గురించి విద్యాకమిషన్ సమగ్రంగా చర్చించి, అందరితో సంప్రదించి నివేదికను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. విద్యా నిపుణుల మార్గదర్శకత్వంలో విద్యావిధానాన్ని రూపొందించాల్సి ఉంటుంది. విద్యారంగంలో క్షేత్రస్థాయిలో పనిచేసే వారి అభిప్రాయాలు అందుకు దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తున్నది.

కబ్జాదారులకే కూల్చివేతల భయం

బడాబాబుల పాలిట హైడ్రా అంకుశం

- రాజీవ్ సద్భావన యాత్ర సంస్మరణ దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ - ధూల్‌పేట్

"ప్రభుత్వ భూములు, నాలాలు, చెరువులను ఆక్రమించుకుని పెద్ద పెద్ద భవంతులు కట్టిన కబ్జాదారులకే కూల్చివేతల భయపట్టుకుంది.. బడాబాబుల పాలిట హైడ్రా అంకుశంగా మారింది.. కానీ పేదలకు మేలు జరుగుతుంటే కొందరు ఓర్వలేకపోతున్నారు" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద శనివారం నిర్వహించిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర సంస్మరణ దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాజీవ్ గాంధీ సద్భావన అవార్డును మాజీ మంత్రి గీతారెడ్డికి బహూకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గాంధీ కుటుంబం తీసుకున్న నిర్ణయాలతోనే కాంగ్రెస్ హయాంలో దేశంలో పేదలకు మేలు జరిగిందన్నారు. సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలందించిన మాజీ మంత్రి గీతారెడ్డిని సద్భావన అవార్డుకు ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. రాజకీయాల్లో పదవుల కోసం పాకులాడే వారిని చూసాం కానీ, 2023 ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పిన గొప్ప వ్యక్తి గీతారెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణం అర్పించారన్నారు. ప్రధాని పదవులను త్యాగం చేసిన ఘనత సోనియా గాంధీ, రాహుల్ గాంధీలదని అన్నారు. గాంధీ కుటుంబానికి, దోపిడీ చరిత్ర ఉన్న వారికి పోలికా అని ప్రశ్నించారు. దేశ సమగ్రత కోసం 34 ఏండ్ల కిందట రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర చేపట్టారని గుర్తు చేశారు. ఆ యాత్రను స్ఫూర్తితో మత సామరస్యాన్ని కాపాడుకుంటూ తెలంగాణ అభివృద్ధికి ముందుకు సాగుతామన్నారు. ఆక్రమణలకు పాల్పడిన బడా బాబుల పట్ల హైడ్రా భూతమని, ప్రభుత్వ భూములను, నాళాలు, చెరువులను ఆక్రమించుకుని పెద్ద పెద్ద భవంతులు కట్టిన వారిపట్ల హైడ్రా అంకుశం లాంటిదని చెప్పారు. కొందరు దీన్ని అడ్డుకోవాలని, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ దెబ్బతీయాలని కుట్ర చేస్తున్నారన్నారు. ఇలాంటి వాటికి రియల్ ఎస్టేట్ సంస్థలు భయపడొద్దని, వారికి తాను హామీ ఇస్తున్నానని అన్నారు. చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారు, 111 జీవోను ఉల్లంఘించిన వారు మాత్రమే హైడ్రాను చూసి భయపడుతున్నారన్నారు. హైడ్రా అనగానే హరీశ్‌రావ్, కేటీఆర్ బయటకు వస్తున్నారని, పేదలకు మేలు జరిగితే ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. మూసీలో మగ్గిపోతున్న వారికి ఇండ్లు ఇచ్చి, వ్యాపారాలు చేసుకునేందుకు మహిళలకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. తాము వారిని గుండెల్లో పెట్టుకుంటుంటే బీఆర్ఎస్ నేతలు చూడలేక గుండెలు బాదుకుంటున్నారన్నారు. బిల్లా, రంగాలు వచ్చి బుల్డోజర్లకు అడ్డు పడతామంటున్నారు.. అక్కడికి ఇక్కడికి కాదు.. జన్వాడ ఫామ్‌హౌస్‌కు పోదాం పదా అన్నారు. గుల్బాపూర్ నాలాను ఆక్రమించుకుని కేటీఆర్ ఫామ్‌హౌస్ కట్టలేదా? ఫామ్‌హౌస్‌కు బుల్డోజర్ వస్తుందనే ఇక్కడ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. హరీశ్.. "నీలాంటి చెప్పులు మోసే వారు కాదు.. ఫామ్‌హౌస్‌లో పడుకున్న వాళ్లను రమ్మను.. నేను వస్తా" అని సవాల్ విసిరారు. "నీది ఒక స్థాయేనా..నా ఇంటి ముందుకు వచ్చి చేతులు కట్టుకుని నిలబడిన రోజులు మర్చిపోయావా?.. అక్కడికి ఇక్కడికి కాదు.. ఎప్పుడైనా ఫామ్‌హౌస్‌కు రావాలి.. వాళ్ల ఫామ్‌హౌస్‌ల వద్దకు ఎప్పుడు రావాలో హరీశ్ చెప్పాలి.. హరీశ్, కేటీఆర్ ఫామ్‌హౌస్‌ల విషయంపై అఖిలపక్షాన్ని పిలుద్దాం.. నిజ నిర్ధారణ కమిటీతో నిగ్గు తేలుద్దాం.." అని సవాల్ విసిరారు. ఆ తరువాత మూసీ దగ్గరకా.. ఇంకెక్కడికైనా వెళదామన్నారు.

మూసీ పునరుజ్జీవనం వేరు.. హైడ్రా వేరని స్పష్టం చేశారు. మూసీలో హైడ్రా ఎలాంటి కూల్చివేతలూ చేపట్టలేదన్నారు. ట్రాఫిక్ సమస్య, నాలాల పునరుద్ధరణ, చెరువుల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడానికే హైడ్రా అన్నారు. మురికి కూపంలో మగ్గిపోతున్న నిరుపేదలకు మంచి భవిష్యత్ అందించాలన్న లక్ష్యంతోనే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టామన్నారు. నగరంలోని మెహిదీపట్నం, బోజ గుట్ట ప్రాంత వాసుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు.నా

గ్రూప్-1 మెయిన్స్‌కు సిద్ధమవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

అప్రమత్తమై అరికట్టాలని ఆయన పోలీసు అధికారులను కోరారు. సైబర్ నేరాల నివారణలో దేశంలో రాష్ట్ర పోలీసులు మొదటి స్థానంలో నిలిచి, అవార్డును పొందారంటూ సీఎం.. పోలీసు అధికారులను అభినందించారు. విధి నిర్వహణలో పోలీసులు చేస్తున్న త్యాగాలను గుర్తించి, వారి పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రత్యేకించి విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. గ్రేహౌండ్స్ కార్యాలయం పక్కన 50 ఎకరాలలో నిర్మించబోయే ఈ ప్రత్యేక స్కూల్ కార్పొరేట్ స్థాయిని తలదన్నేదిగా ఉంటుందని అన్నారు. మొదట 5 నుంచి 8వ తరగతి వరకు క్లాసులు ప్రారంభించి, తర్వాత డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్ విద్యా సంస్థల వరకు విస్తరిస్తామనీ, ఇందులో హోంగార్డు నుంచి డీజీపీ పిల్లల వరకు చదువుకునే అవకాశముంటుందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇకపై డ్యూటీ మీట్‌లో మొదటిస్థానం పొందినవారికి రూ.5 లక్షలు, రెండో స్థానానికి రూ.3 లక్షలు, మూడో స్థానానికి రూ.లక్ష నగదు బహుమతి ఇస్తామని ఆయన ప్రకటించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నివారణలో రాష్ట్ర పోలీసులు సాధించే ఫలితాలు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపజేస్తాయనీ, వారు చేసే ఒక్క పొరపాటు కూడా ప్రభుత్వ స్థాయిని దిగజారుస్తాయన్నది మరువరాదని ముఖ్యమంత్రి అన్నారు.పోలీసు డ్యూటీ మీట్ ఇన్‌చార్జి షికా గోయెల్ మాట్లాడుతూ.. మొత్తం 26 జిల్లాల నుంచి 460కి మందికి పైగా పోలీసులు 13 టీమ్‌లుగా డ్యూటీమీట్‌లో పాల్గొన్నారని తెలిపారు. ఇందులో శాస్త్రీయ దర్యాప్తు, సైంటిఫిక్ ఎవిడెన్స్, డాగ్స్ స్క్వాడ్, యాంటీ సబాటేజ్ చెక్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు అవార్డులను బహూకరించామని ఆమె చెప్పారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. పోలీసు డ్యూటీ మీట్‌లో పోలీసులలో నిమిడీకృతమైన పరిణితిని మరింతగా వికసింపజేస్తాయని, ఈ పోటీలలో గెలిచినవారు జాతీయస్థాయి పోలీసు డ్యూటీ మీట్‌లకు ఎంపికయ్యారని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పోలీసు అధికారులు రవిగుప్తా, శివధర్‌రెడ్డితో పాటు పలువురు పోలీసు అధికారులు హాజరయ్యారు. డ్యూటీ మీట్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది నుంచి ముఖ్యమంత్రి గౌరవ వందనాన్ని స్వీకరించారు.

రేపటినుంచి 'ఎస్‌ఏ-1' పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సోమవారం నుంచి ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-1) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 28 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి అకడమిక్ క్యాలెండర్‌లోనూ ఎస్‌ఏ-1 పరీక్షల నిర్వహణ వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. నవంబర్ రెండున జవాబుపత్రాల మూల్యాంకనం చేసి ఫలితాలను ప్రకటించాలని విద్యాశాఖ షెడ్యూల్ ను రూపొందించింది. అదేనెల ఐదున విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని తెలిపింది. అదేనెల 16న తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాన్ని నిర్వహించాలనీ, విద్యార్థుల మార్కులు, వారి ప్రతిభపై చర్చించాలని కోరింది.

పారిశ్రామిక కార్మికులకు 39 పాయింట్ల వీడీఏ పెంపు

- వ్యవసాయ కార్మికులకు 38 పాయింట్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని పారిశ్రామిక కార్మికులకు 39 వీడీఏ పాయింట్లు, వ్యవసాయ కార్మికులకు 38 వీడీఏ పాయింట్లను పెంచుతున్నట్టు కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య.ఎస్ ప్రకటించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పారిశ్రామిక కార్మికులకు 1849 నుంచి 1888కి వీడీఏను పెంచారు. వ్యవసాయ కార్మికులకు ప్రస్తుతం ఉన్న 1421 పాయింట్లను 1459కి పెంచారు. ఇది ఈ నెల నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు వర్తించనున్నది.

కివీస్ లక్ష్యం 107

- 10 వికెట్లపై భారత్ గురి
- రసకందాయంలో తొలి టెస్టు
- మెరిసిన సర్ఫరాజ్ ఖాన్,రిషబ్ పంత్
- భారత్ రెండో ఇన్నింగ్స్ 462/10



వరుణుడు ఆటంకం కలిగిస్తున్న బెంగళూర్ టెస్టు రసకందాయంలో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే కుప్పకూలినా.. భారత బ్యాటర్లు రెండోసారి కదం తొక్కారు. సర్ఫరాజ్ ఖాన్ (150), రిషబ్ పంత్ (99), విరాట్ కోహ్లి (70), రోహిత్ శర్మ (52) మెరువగా భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 462 పరుగుల భారీ స్కోరు చేసింది. న్యూజిలాండ్‌కు 107 పరుగుల సవాల్‌తో కూడిన లక్ష్యాన్ని నిర్దేశించింది. నేడు ఆఖరు రోజు ఆటలో విజయం వేటలో న్యూజిలాండ్‌కు 107 పరుగులు అవసరం కాగా.. భారత్‌కు 10 వికెట్లు అవసరం!.

నవతెలంగాణ-బెంగళూర్

యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ (150, 195 బంతుల్లో 18 ఫోర్లు, 3 సిక్సులు) కెరీర్ తొలి సెంచరీతో చెలరేగాడు. ఎక్స్‌ఫ్యాక్టర్ రిషబ్ పంత్ (99, 105 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సులు) మరోసారి తనదైన ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. మిడిల్ ఆర్డర్‌లో ఇద్దరు ధనాధన్ యువ ఆటగాళ్లు చెలరేగటంతో న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 462 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. విరాట్ కోహ్లి (70, 102 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్ శర్మ (52, 63 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. టాప్, మిడిల్ ఆర్డర్ మెరిసినా.. లోయర్ మిడిల్ ఆర్డర్ వైఫల్యంతో భారత్ ఆశించిన స్కోరు అందుకోలేదు. కొత్త బంతిపై 54 బంతుల్లోనే చివరి ఏడు వికెట్లు కోల్పోయిన టీమ్ ఇండియా.. న్యూజిలాండ్‌కు 107 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 0.4 ఓవర్లలో 0/0 పరుగులు చేసింది. ఓపెనర్లు టామ్ లేథమ్ (0), డెవాన్ కాన్వే (0) అజేయంగా నిలిచారు. వెలుతురు లేమితో నాల్గో రోజును ముందుగానే నిలిపివేశారు.



సర్ఫరాజ్, పంత్ ఫటాఫట్

ఓవర్‌నైట్ స్కోరు 231/3తో నాల్గో రోజు ఉదయం బ్యాటింగ్‌కు వచ్చిన భారత్‌కు యువ ఆటగాళ్లు సర్ఫరాజ్ ఖాన్, రిషబ్ పంత్ అదిరే భాగస్వామ్యం అందించారు. ఎడాపెడా బౌండరీలు బాదిన ఈ జోడీ స్కోరు బోర్డును పరుగులు పెట్టింది. రిషబ్ పంత్ ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో 55 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. అంతకుముందే సర్ఫరాజ్ ఖాన్ 110 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సులతో కెరీర్ తొలి శతకం సాధించాడు. పంత్, సర్ఫరాజ్ ధనాధన్‌తో తొలి ఇన్నింగ్స్ లోటు కరిగి పోతుండగా.. వర్షం అంతరాయం కలిగించింది. తొలి సెషన్ ఆఖర్లో, లంచ్ విరామం తర్వాత ఆరంభంలో వరుణుడు ఆటను సాగనివ్వలేదు. లంచ్ విరామ సమయానికి భారత్ 344/3తో నిలిచింది. తొలి ఇన్నింగ్స్ లోటు 12 పరుగులే కావటంతో.. భారత్ కనీసం 200 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశిస్తుందనే అంచనాలు నెలకొన్నాయి.

కొత్త బంతితో పాత కథ

కొత్త బంతి అందుకున్న తర్వాత న్యూజిలాండ్ గేర్ మార్చింది. అప్పటివరకు పరుగుల వేటలో టీమ్ ఇండియా జోరు చూపించగా.. ఆ తర్వాత కివీస్ వికెట్ల జాతర సాగించింది. సర్ఫరాజ్ ఖాన్ 194 బంతుల్లో 150 పరుగులు మైలురాయి చేరుకోగా.. టీ విరామానికి ముందే భారత్ కీలక వికెట్లు చేజార్చుకుంది. రిషబ్ పంత్, సర్ఫరాజ్ ఖాన్ సహా కెఎల్ రాహుల్ పెవిలియన్‌కు చేరుకున్నారు. 408/3తో పటిష్టంగా కనిపించిన భారత్.. 54 పరుగుల వ్యవధిలోనే చివరి ఏడు వికెట్లు చేజార్చుకుంది. విలియం ఓరౌర్క్, మాట్ హెన్రీ లోయర్ ఆర్డర్, టెయిలెండర్ల కథ ముగించారు. రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ అంచనాలను అందుకోలేదు. దీంతో భారత్ 462 పరుగులకే కుప్పకూలింది. న్యూజిలాండ్ బౌలర్లలో మాట్ హెన్రీ, విలియం ఓరౌర్క్ మూడేసి వికెట్లు పడగొట్టారు.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : 46/10

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ : 402/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (స్టంప్డ్) బ్లండెల్ (బి) అజాజ్ పటేల్ 35, రోహిత్ శర్మ (బి) అజాజ్ పటేల్ 52, విరాట్ కోహ్లి (సి) బ్లండెల్ (బి) ఫిలిప్స్ 70, సర్ఫరాజ్ ఖాన్ (సి) అజాజ్ పటేల్ (బి) సౌథీ 150, రిషబ్ పంత్ (బి) ఓరౌర్క్ 99, కెఎల్ రాహుల్ (సి) బ్లండెల్ (బి) ఓరౌర్క్ 12, రవీంద్ర జడేజా (సి) యంగ్ (బి) ఓరౌర్క్ 5, రవిచంద్రన్ అశ్విన్ (ఎల్బీ) హెన్రీ 6, కుల్దీప్ యాదవ్ నాటౌట్ 6, జశ్‌ప్రీత్ బుమ్రా (సి) బ్లండెల్ (బి) హెన్రీ 0, మహ్మద్ సిరాజ్ (సి) సౌథీ (బి) హెన్రీ 0, ఎక్స్‌ట్రాలు : 18, **మొత్తం :** (99.3 ఓవర్లలో ఆలౌట్) 462.

వికెట్ల పతనం : 1-72, 2-95, 3-231, 4-408, 5-433, 6-438, 7-441, 8-458, 9-462, 10-462.

బౌలింగ్ : టిమ్ సౌథీ 15-2-53-1, మాట్ హెన్రీ 24.3-3-102-3, విలియం ఓరౌర్క్ 21-4-92-3, అజాజ్ పటేల్ 18-3-100-2, గ్లెన్ ఫిలిప్స్ 15-2-69-1, రచిన్ రవీంద్ర 6-0-30-0.

తెలుగు టైటాన్స్ పరాజయం

44-29తో తమిళ్ తలైవాస్ విజయం



హైదరాబాద్: తొలి మ్యాచ్‌లో ఘన విజయంతో ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌ను ఆరంభించిన ఆతిథ్య తెలుగు టైటాన్స్ రెండో మ్యాచ్ లో నిరాశ పరిచింది. నరేందర్ ఖండోలా, సచిన్ సూపర్ టెన్స్ విజృంభించడంతో తమిళ్ తలైవాస్ టోర్నమెంట్‌ను భారీ విజయంతో ఆరంభించింది. శనివారం రాత్రి ఇక్కడి జీఎంసీ బాలయోగి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ జట్టు 44-29 తేడాతో తెలుగు టైటాన్స్ ను చిత్తుగా ఓడించింది. మొదట్లో విజృంభించిన పవన్ సెహ్రావత్ (10) వరుసగా రెండో సూపర్ టెన్ సాధించినా తర్వాత తడబడ్డాడు. విజయ్ మాలిక్ (9) పోరాడినా ఫలితం లేకపోయింది. తమిళ్ తలైవాస్ జట్టులో నరేందర్, సచిన్ చెరో పది పాయింట్లు రాబట్టగా.. డిఫెండర్ సాహిల్ గులియా ఐదు పాయింట్లతో హై ఫైవ్ సాధించాడు.

నరుడి బ్రతుకు నటన రిలీజ్‌కి రెడీ



నితిన్ ప్రసన్న, శివకుమార్ రామచంద్రవరపు

శివ కుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. శృతి జయన్, ఐశ్వర్య అనిల్ కుమార్, వైవా రాఘవ్ ఇతర ప్రముఖ తారాగణం.

రిషికేశ్వర్ యోగి దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డాక్టర్ సింధు రెడ్డి నిర్మించగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరించారు. సుధీర్ కుమార్ ప్రాజెక్ట్ హెడ్. ఈ మూవీ ఈనెల 25న రాబోతోంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో సుధీర్ బాబు, దర్శకులు వీరశంకర్, వీజే సన్నీ, శ్రీరామ్ ఆదిత్య, వితిక షేరు తదితరులు విచ్చేశారు. సుధీర్ బాబు మాట్లాడుతూ, 'ఈ మూవీ ట్రైలర్ చూశాను. శివ, నితిన్ ప్రసన్న ఎంతో ఇంటెన్స్‌గా నటించారు. నా చిత్రంలో ఏదైనా మంచి పాత్రలుంటే వారినే రిఫర్ చేయాలని అనుకుంటున్నాను. రిషి ఈ మూవీని అద్భుతంగా తీశాడు. ఈ మూవీ చాలా కొత్తగా, రీఫ్రెషింగ్‌గా ఉండబోతోందనిపిస్తోంది. అందరూ చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు.

డైరెక్టర్ రిషికేశ్వర్ యోగి మాట్లాడుతూ, 'ప్రేక్షకులను కచ్చితంగా మా సినిమా మెప్పిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని తెలిపారు. సినిమా చాలా బాగా వచ్చింది. అన్నీ పరిస్థితులు అనుకూలిస్తే.. నేషనల్ అవార్డు కూడా వస్తుంది' అని శివ కుమార్ రామచంద్రవరపు చెప్పారు. నితిన్ ప్రసన్న మాట్లాడుతూ, 'ప్రీమియర్లలో మాకు మంచి రెస్పాన్స్ వచ్చింది. యూనివర్సల్ సబ్జెక్ట్ కావడంతో అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. 'మూవీని చూసి, కంటెంట్ నచ్చి విశ్వ ప్రసాద్ ముందుకు వచ్చారు. మాకు పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ హెల్ప్ దొరికింది. అందుకే ఇక్కడి వరకు వచ్చాం. మా సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాం' అని నిర్మాత డా. సింధు రెడ్డి చెప్పారు.

> ప్యాషన్, డబ్బులుంటే సినిమాల్ని తీయలేం. ఒకవేళ తీసినా వాటిని రిలీజ్‌ని చేయటం కష్టం. ఒకప్పుడు నేనూ ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నా. అందుకే ఈ చిత్ర బృందాన్ని చూసినప్పుడు నాకు పాత రోజులు గుర్తుకు వచ్చాయి. దీంతో వారికి సాయం చేయాలని ముందుకు వచ్చాను.
>
> - నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్

నవచిత్రం

వాటికి మించి వినోదం

'భూల్ భూలయ్యా 3' టైటిల్ ట్రాక్ లాంచ్ ప్రమోషనల్ టూర్‌లో భాగంగా కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్ హైదరాబాద్‌లో సందడి చేశారు.

ఇప్పటికే ఈచిత్ర ట్రైలర్ అత్యధికంగా వీక్షించిన ట్రైలర్‌గా నిలిచింది.

ఈ నేపథ్యంలో రిలీజైన టైటిల్ ట్రాక్ కూడా ట్రైలర్‌కి మించిన స్థాయిలో విశేష ఆదరణ పొందుతోంది.

మిస్టర్ వరల్డ్‌వైడ్‌గా పిలువబడే పిట్‌బుల్, గ్లోబల్ పంజాబీ సంచలనం దిల్జిత్ దోసాంజ్ ఈ టైటిల్ ట్రాక్‌ను అత్యద్భుతంగా పాడారు. టైటిల్ ట్రాక్ ఫీవర్‌ను దేశంలోని వివిధ మూలలకు తీసుకెళ్లడం కోసం కార్తీక్ ఆర్యన్ నగర పర్యటనను ప్రారంభించాడు.

ఆ పర్యటన ప్రస్తుతం హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ టైటిల్ ట్రాక్ ప్రతి ఒక్కరినీ మ్యాజిక్‌లో ఉంచి, సినిమా విడుదల కోసం ఉత్సాహాన్ని నింపింది.

బ్లాక్‌బస్టర్ 'భూల్ భూలయ్యా 2' నుండి రూహ్ బాబా పాత్రను కార్తీక్ ఆర్యన్ తిరిగి పోషించారు. త్రిప్తి దిమ్రీ, మంజులిక, విద్యాబాలన్ , మాధురీ దీక్షిత్‌లతో కలిసి కార్తీక్ ఆర్యన్ కనిపిస్తాడు.

బాజ్మీ దర్శకత్వం వహించారు భూషణ్ కుమార్ ప్రారంభించిన ఈ హర్రర్ కామెడీ ఫ్రాంచైజీ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఈ సినిమా వారధిగా పని చేయనుంది. భయపడుతూనే నవ్వుకునేందుకు ఈ దీపావళికిగా సిద్ధంగా ఉండండి అంటూ మేకర్స్ తెలిపారు. దీపావళి కానుకగా నవంబర్ 1న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



విద్యాబాలన్

> ఈ చిత్రంలోని హర్రర్, కామెడీ, థ్రిల్..ఇలా ప్రతీదీ గత చిత్రాలకు మూడు రెట్లు ఎక్కువగా ఉంటుంది. దీన్ని కుటుంబ సమేతంగా చూస్తే మరింత మజాగా ఉంటుంది. ఈ సినిమాలో నా పాత్రతోపాటు ఇతర పాత్రలు చేసే మ్యాజిక్ మిమ్మల్ని తప్పకుండా మెప్పిస్తుంది. అంతేకాదు ఎంతగా భయపడతారో అంతకంటే ఎక్కువగా నవ్వుతారు. ఆ నవ్వులకు సిద్ధంగా ఉండండి.
>
> - హీరోయిన్ విద్యాబాలన్

> ఈ చిత్ర కథ చాలా కొత్తగా, గత రెండు సినిమాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. దీంట్లో నా పాత్ర ఎలా ఉంటుంది?, ఈసారి ఏం చేయనుంది అనేది తెలియాలంటే దీపావళి గిఫ్ట్‌గా థియేటర్లలోకి వస్తున్న మా సినిమా చూడాల్సిందే. మీరు కచ్చితంగా సరికొత్త అనుభూతికి లోనవుతారు.
>
> - హీరో కార్తీక్ ఆర్యన్

టిట్లలాంటి పవర్‌ఫుల్ రోల్ చేశా..



అజయ్

యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో సాహిత్ మోత్కూరి డైరెక్ట్ చేస్తున్న రూరల్ యాక్షన్ డ్రామా 'పొట్టేల్'.

ఈ చిత్రంలో అజయ్ పవర్ ఫుల్ రోల్ పోషిస్తున్నారు.

నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిశాంక్ రెడ్డి కుడితి, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్‌పై సురేష్ కుమార్ సడిగే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈనెల 25న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నటుడు అజయ్ మీడియాకి పలు విశేషాలను షేర్ చేశారు.

- దర్శకుడు సాహిత్ కథ చెప్పినప్పుడు చాలా క్యాజువల్‌గా విన్నాను. రెండు గంటల నేరేషన్ తర్వాత ఈ సినిమాలో క్యారెక్టర్ డెఫినెట్‌గా చేయాలనిపించింది. అంతేకాదు నా క్యారెక్టర్‌ని చాలా బాగా చేయాలి, లేకపోతే సినిమా పాడైపోతుందనే ఫీలింగ్‌ని డైరెక్టర్ కలిగించగలిగారు. కథని ఎంత అద్భుతంగా చెప్పాడో సినిమాని కూడా అంత అద్భుతంగా తెరకెక్కించాడు.
- మూఢ నమ్మకాలు, మూఢ నమ్మకల్ని అడ్డం పెట్టుకుని బతికే మనుషుల గురించి, మొండితనం గురించి, గ్రామదేవతల గురించి.. ఇలా మల్టీ లేయర్స్‌లో ఈ సినిమా ఉంటుంది. ముఖ్యంగా పాప చదువు కోసం ఫైట్ చేసే బ్యాక్ డ్రాప్ ఉంది. ఇలాంటి కథలు చెప్పినప్పుడు కొన్నిసార్లు సందేశం ఎక్కువైపోయే అవకాశం ఉంది. దీన్ని కమర్షియల్‌గా తీసుకురావడం చాలా కష్టం. డైరెక్టర్ సాహిత్ ఈ కథని మంచి కమర్షియల్ ఎలిమెంట్స్‌తో మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా తీర్చిదిద్దాడు. ఇందులో విజిల్స్ పడే సీన్స్ ఉంటాయి.
- విక్రమార్కుడు తర్వాత అంతా టెర్రిఫిక్ విలన్ వేషాలు తక్కువే వచ్చి ఉంటాయి. అవి కూడా చాలా వరకు రాజమౌళి సినిమాలోనే ఉన్నాయి. టిట్ల లాంటి క్యారెక్టర్స్ రెగ్యులర్‌గా రావు. అదొక మ్యాజిక్ లాగా జరిగిపోయింది. ఈ సినిమాలో చేసిన పటేల్ క్యారెక్టర్‌లో చాలా షేడ్స్ ఉన్నాయి. అందుకే చాలా రోజుల తర్వాత నాకు నచ్చిన రోల్ దొరికిందని చెప్పాను.
- దర్శకుడు కొరటాల శివకి సినిమా చూపించాను. ఆయనకి చాలా నచ్చింది. అలాగే దర్శకుడు సందీప్ రెడ్డి వంగా చూశారు. ఆయనకీ నచ్చింది. కమర్షియల్ సక్సెస్ తో పాటు అవార్డ్స్ కూడా ఈ సినిమాకు వస్తాయని డైరెక్టర్‌తో ఆయన చెప్పారు.

కేసీఆర్ లక్ష్యం ఏంటి?

రాకింగ్ రాకేష్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్).

గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ మూవీకి గరుడవేగ అంజి దర్శకత్వం వహించారు.

అనన్య కృష్ణన్ కథానాయిక.

రాకింగ్ రాకేష్ స్వయంగా నిర్మించిన ఈ చిత్రం లంబాడీ వర్గానికి చెందిన యువకుడి రియల్ లైఫ్ నుంచి స్ఫూర్తి పొందింది. మేకర్స్ శనివారం చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో రాకింగ్ రాకేష్ మాట్లాడుతూ,'ఈ సినిమాని మూడు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించాలని నా కోరిక. దర్శకుడు సాయి రాజేష్‌కి ఎంత థ్యాంక్స్ చెప్పుకున్న తక్కువే. డైరెక్టర్ అంజి సినిమాని చాలా ప్యాషన్ తో తీశారు. చరణ్ అర్జున్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. నా సక్సెస్‌కి కారణం నా భార్య సుజాత. ఈ జర్నీలో చాలా సపోర్ట్ చేసింది' అని తెలిపారు. 'రాకేష్ అద్భుతమైన కథ రాశారు. సినిమాటోగ్రఫీ, డైరెక్షన్ రెండు నేనే చేశాను. ఈ సినిమాకి చరణ్ మ్యూజిక్ డైరెక్టర్‌తో పాటు లిరిక్స్ రాశారు. కొన్ని పాటలు పాడారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సాంగ్స్ అన్ని హైలైట్ అవుతాయి. హీరోయిన్ అనన్య చాలా ఫెంటాస్టిక్‌గా నటించింది' అని డైరెక్టర్ అంజి చెప్పారు.



అనన్య కృష్ణన్, రాకింగ్ రాకేష్

> 'హృదయ కాలేయం' ఆడియో ఫంక్షన్‌కి రాకేష్ ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా స్కిట్ చేసి వెళ్లాడు. ఆ కృతజ్ఞత నాకు అలా ఉండిపోయింది. తనకి కెరీర్‌లో బెస్ట్ క్యారెక్టర్ రాస్తానని మాట ఇచ్చాను. తొందరలోనే ఆ క్యారెక్టర్ రాసి రుణం తీర్చుకుంటాను. ట్రైలర్ చాలా బావుంది. ఈ సినిమాతో రాకేష్ మంచి స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ అంజి మంచి దర్శకులు, కెమెరామెన్. అర్జున్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చాలా బాగుంది.
>
> - డైరెక్టర్ సాయి రాజేష్

లవ్ రెడ్డి గెలిచాడు



అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి

గీతాన్స్ ప్రొడక్షన్స్, సెహెరి స్టూడియో, ఎమ్జీఆర్ ఫిలిమ్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'లవ్ రెడ్డి'. అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి హీరో, హీరోయిన్లు.

కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా స్వచ్ఛమైన ప్రేమకథగా నూతన దర్శకుడు స్మరన్ రెడ్డి రూపొందించారు. ప్రొడ్యూసర్స్ సునంద బి.రెడ్డి, హేమలత రెడ్డి, రవీందర్ జి, మదన్ గోపాల్ రెడ్డి, నాగరాజ్ బీరప్ప, ప్రభంజన్ రెడ్డి, నవీన్ రెడ్డి నిర్మించారు. సుమ, సుస్మిత, హరీష్, బాబు, రవి కిరణ్, జకరియా సహ నిర్మాతలు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ సినిమా శుక్రవారం గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చి, ప్రేక్షకుల నుంచి సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ నేపథ్యంలో మూవీ సక్సెస్ మీట్‌ను ప్రసాద్ ల్యాబ్స్‌లో మేకర్స్ నిర్వహించారు.

ప్రొడ్యూసర్ మదన్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, 'మా సినిమా చూస్తున్న ప్రేక్షకులు ఎమోషనల్ అవుతున్నారు. సినిమాను ఎలాగైనా నిలబెట్టండి అంటూ మెసేజ్‌లు పంపుతున్నారు. వాళ్లకు తోచిన అమౌంట్స్ యూపీఐ ద్వారా నాకు పంపిస్తున్నారు. నిర్మాతగా ఆ సంతృప్తి నాకు చాలు' అని తెలిపారు.

'మా సినిమాకు అమేజింగ్ రెస్పాన్స్ వస్తోంది. బ్లాక్ బస్టర్ మూవీ అంటున్నారు. మంచి సినిమాను బతికించమని రిక్వెస్ట్ చేస్తున్నాం' అని డైరెక్టర్ స్మరణ్ రెడ్డి చెప్పారు.

> మా మూవీకి ప్రేక్షకుల నుంచే కాకుండా మీడియా నుంచి కూడా మంచి రివ్యూస్ వచ్చాయి. మా లవ్ రెడ్డి థియేటర్లలో గెలిచాడు. చూసిన వాళ్లంతా బాగుందని అంటున్నారు. ప్రీమియర్స్ నుంచి వచ్చిన బ్లాక్ బస్టర్ టాక్‌తో మూవీని హ్యాపీగా రిలీజ్ చేశాం. మైత్రీ డిస్ట్రిబ్యూషన్ నుంచి మా మూవీకి పూర్తి సపోర్ట్ దొరికింది. ఈ సినిమా ఎలాగైనా నిలబెట్టాలని నా స్నేహితుడు కిరణ్ అబ్బవరం హైదరాబాద్, తిరుపతి, వైజాగ్, విజయవాడలో ఫ్రీ షోస్ అరేంజ్ చేశాడు. ఈ ఫ్రీ షోస్ కు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. కొందరు తమ లైఫ్ లో జరిగిన లవ్ ఫెయిల్యూర్స్ గురించి చెబుతూ ఉద్వేగంగా మాట్లాడుతున్నారు.
>
> - హీరో అంజన్ రామచంద్ర

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

కోయగూడెం ఓసీ-2 నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

- హైకోర్టు తీర్పును అమలు చేయాలి
- కేఓసీలో భారీ ర్యాలీ, ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ-టేకులపల్లి

హైకోర్టు తీర్పును అమలు చేసి కోయగూడెం ఓపెన్ కాస్ట్ (కేఓసీ) 2 భూ నిర్వాసితులకు భూమికి బదులు భూమి, నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ సింగరేణి డిమాండ్ చేశారు. శనివారం వ్యకాస, భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో నిర్వాసితులు కోయగూడెం ఓసీలో భారీ ర్యాలీ నిర్వహించి, కేఓసీ ప్రాజెక్టు అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కేఓసీ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కోయగూడెం ఓసీ 2 పిట్ 1, 2, 3లో సాగు భూములు కోల్పోయిన గిరిజనుల భూమికి నష్టపరిహారం, సాగు భూమి, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయకుండా భూసేకరణ చేయడం వల్ల వందలాది మంది గిరిజనులు నష్టపోయారని అన్నారు. 16 సంవత్సరాల న్యాయ పోరాటంలో కిష్టారం, లచ్చగూడెం, కోయగూడెం, దంతెలతండా, కొత్తతండా, జేత్యతండా గిరిజన నిర్వాసితులు గెలిచారని, వెంటనే నష్టపరిహారం, పునరావాసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, పూనెం స్వామి, పూనెం చంద్రశేఖర్, దొడ్డ కోటేశ్వరరావు, సమ్మయ్య, చుక్కమ్మ, బోడ క్రిష్ణ, బానోత్ రామా, కోరం సుభాష్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

భార్యతో గొడవ.. కొడుకును వాగులోకి తోసిన తండ్రి

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)




భార్యతో గొడవ జరగడంతో క్షణికావేశంలో కన్న కొడుకును వాగులో తోసేశాడో తండ్రి. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణం దేశాయిపేటలో శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేశాయిపేట గ్రామానికి చెందిన రాములు తన కొడుకు పండరి(14)ని బాన్సువాడ నుంచి బోధన్ వెళ్లే రహదారి మధ్యలో ఉన్న పెద్దపూల్ వాగులో తోసేశాడు. ఆ విషయాన్ని భార్య గంగమణితో చెప్పడంతో ఆమె వెంటనే దేశాయిపేట నుంచి వాగు వద్దకు వెళ్లి పరిశీలించగా పండరి ఆచూకీ లభించలేదు. అదే వాగుపై ఉన్న బ్రిడ్జి మీదుగా వెళ్తున్న ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి విచారణ చేపట్టారు. ఇంటి స్థలం విక్రయానికి భార్య అడ్డు చెప్పడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నట్టు సమాచారం. ఇదే కారణంగా కొడుకును వాగులో నెట్టేసాడా లేక భార్యను బెదిరించడం కోసం ఈ పని చేశాడా అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాలుని తల్లి గంగామణి బాన్సువాడ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్ సిబ్బంది వాగు వద్ద పరిశీలించగా.. బాలుడి ఆచూకీ లభించలేదు. బాన్సువాడ టౌన్ సీఐ విచారణ చేపట్టారు.

బిజినెస్

హెచ్‌డీఎఫ్‌సీకి రూ.16,820 కోట్ల లాభాలు

పెరిగిన డిపాజిట్లు



న్యూఢిల్లీ : ప్రయివేటు రంగ దిగ్గజ విత్త సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 5.3 శాతం వృద్ధితో రూ.16,820 కోట్ల నికర లాభాలు సాధించింది. నికర వడ్డీ ఆదాయం పెరగడంతో పాటుగా కేటాయింపుల భారం తగ్గడంలో లాభాల్లో పెరుగుదల చోటుచేసుకుంది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.15,976 కోట్ల లాభాలు ప్రకటించింది. క్రితం క్యూ2లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ)10 శాతం పెరిగి రూ.30,110 కోట్లకు చేరింది. మొండిబాకీల కోసం రూ.2,700 కోట్లు కేటాయించింది. 2023-24 ఇదే క్యూ2లో రూ.3,310 కోట్ల కేటాయింపులు చేసింది. 2025 సెప్టెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.36 శాతానికి పెరిగాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలం నాటికి 1.34 శాతంగా జీఎన్‌పీఏ చోటుచేసుకుంది. నికర నిరర్థక ఆస్తులు 0.41 శాతంగా నమోదయ్యాయి. గడిచిన క్యూ2లో రూ.1.2 లక్షల కోట్ల డిపాజిట్లను సమీకరించినట్టు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడించింది. దీంతో మొత్తం డిపాజిట్లు 15 శాతం పెరిగి రూ.25 లక్షల కోట్లకు చేరాయని తెలిపింది. రుణాల జారీ 7 శాతం పెరిగి రూ.25.19 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. రిటైల్ రుణాల్లో 11.3 శాతం, వాణిజ్య, రూరల్ బ్యాంకింగ్ రుణాల్లో 17.4 శాతం పెరుగుదల ఉంది.

ఐసీఐసీఐ లాంబార్డ్ లాభాలు 20 శాతం వృద్ధి

ఐసీఐసీఐ లాంబార్గ్ జనరల్ ఇన్సూరెన్స్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 20 శాతం పెరుగుదలతో రూ.694 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.577 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.5,049 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ2లో రూ.5,850 కోట్లకు చేరింది.

ఆర్‌బీఎల్ బ్యాంక్ లాభాల్లో 24 శాతం తగ్గుదల

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో ఆర్‌బీఎల్ బ్యాంక్ నికర లాభాలు 24 శాతం పతనమై రూ.223 కోట్లుగా నమోదయ్యాయి. అధిక వ్యయాలు లాభాల తగ్గుదలకు ప్రధాన కారణమయ్యాయి. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 9 శాతం పెరిగి రూ.1,615 కోట్లుగా ఉంది. రుణాల జారీ 15.14 శాతం పెరిగి రూ.87,882 కోట్లుగా నమోదయ్యాయి. జూన్ 30 నాటికి 2.69 శాతంగా ఉన్న స్థూల ఎన్‌పీఏలు.. సెప్టెంబర్ ముగింపు నాటికి 2.88 శాతానికి పెరిగాయి.

ఏఐవీఓట్ ఆధ్వర్యంలో పీజీఏ ఆఫ్ అమెరికా' గోల్ఫ్ కోర్స్‌లు



హైదరాబాద్: ఏఐవీఓట్ గోల్ఫ్ & స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ ఆధ్వర్యంలో పీజీఏ యొక్క ప్రత్యేకమైన గోల్ఫ్ సౌకర్యం & అభివృద్ధి భాగస్వామి, షాపూర్జీ పల్లోంజీ రియల్ ఎస్టేట్, స్టోన్‌క్రాఫ్ట్ భాగస్వామ్యంతో భారతదేశపు మొట్టమొదటి పిజీఏ ఆఫ్ అమెరికా-బ్రాండెడ్ గోల్ఫ్ కోర్సులను ప్రారంభించారు. గ్రూప్ త్వస్టార్ గోల్ఫ్ భారతదేశంలో కొత్త స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ గోల్ఫ్ కోర్స్ ముంబై, నవీ ముంబై, హైదరాబాద్‌లలో భారతదేశంలో గోల్ఫ్ నైపుణ్యం కోసం కొత్త బెంచ్‌మార్క్‌ను ఏర్పాటు చేస్తుంది. ప్రపంచ-స్థాయి డిజైన్, అత్యాధునిక సౌకర్యాలు మరియు అసమానమైన సేవలను మిళితం చేస్తూ, భారతదేశంలో గోల్ఫ్ అభివృద్ధిలో గ్రౌండ్ బ్రేకింగ్ ప్రాజెక్ట్ ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఈ సహకారం వృత్తిపరమైన, ఔత్సాహిక గోల్ఫ్ క్రీడాకారు లకు అందించే ఒక ప్రధాన గోల్ఫ్ గమ్యస్థానాన్ని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకు ంది. ఏఐవీఓట్ గోల్ఫ్ & స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ యొక్క సీఈవో అయిన అలోక్ తివారీ మాట్లాడుతూ, "అమెరికా బ్రాండ్ యొక్క ప్రతిష్టాత్మకమైన పిజీఏని భారతదేశానికి తీసుకురావడం పట్ల మేము సంతోషిస్తున్నామని చెప్పారు.

టొయోటా గ్లాంజా ఫెస్టివల్ ఎడిషన్ ఆవిష్కరణ

బెంగళూరు : ప్రముఖ ప్రీమియం కార్ల తయారీ కంపెనీ టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) కొత్తగా టొయోటా గ్లాంజా 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'ను ఆవిష్కరించినట్టు శనివారం తెలిపింది. దీనిపై కొనుగోలుదారులు ప్రత్యేకమైన డీలర్-ఫిట్టెడ్ టొయోటా జెన్యూన్ యాక్సెసరీ (టీజీఏ) ప్యాకేజీలను అక్టోబర్ 31 వరకు పొందవచ్చని పేర్కొంది. నూతన ఎడిషన్‌ను మెరుగైన శైలి, పనితీరు, సౌలభ్యంతో వారి డ్రైవింగ్ అనుభవాన్ని మెరుగుపర్చేలా రూపొందించబడిందని పేర్కొంది.

పట్టణ ప్రాంతాల్లో తక్కువ ఓటింగ్

- గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇదేతీరు
- ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లోనూ అలాగే
- మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలపై గత గణాంకాలు



న్యూఢిల్లీ : మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తేదీలను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఇప్పటికే ప్రకటించింది. ఇందుకు తగిన ఏర్పాట్లను చేస్తున్నది. అయితే, ఈ రాష్ట్రాల్లో పట్టణ ప్రాంతాల్లో తక్కువ ఓటింగ్ శాతం ఆందోళన కలిగిస్తున్నది. గత గణాంకాలను బట్టి చూస్తే.. 2019 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 64 అర్బన్ సీట్లకు గానూ 62 స్థానాల్లో ఓటింగ్ శాతం రాష్ట్రంలో నమోదైన సగటు ఓటింగ్ శాతం 60.56 శాతం కంటే తక్కువగా రికార్డయ్యింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అత్యల్ప ఓటింగ్ కొలబ అసెంబ్లీ స్థానంలో నమోదైంది. ఇక్కడ 40.1 శాతంగానే ఓట్లు పోలయ్యాయి. దేశవ్యాప్తంగా తక్కువ ఓటింగ్ నమోదైన పట్టణ నియోజకవర్గాల్లో ఆరు స్థానాలు మహారాష్ట్ర నుంచే ఉండటం గమనార్హం. ఈ జాబితాలో కళ్యాణ్, పూణే, థానే, ముంబయి నార్త్ సెంట్రల్, దక్షిణ ముంబయి, ముంబయి సౌత్ సెంట్రల్ సీట్లు ఉన్నాయి.

మొత్తం అసెంబ్లీ స్థానాలు.. రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు ఇలా

మహారాష్ట్రలోని 36 జిల్లాల్లో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలున్నాయి. వీటికి నవంబర్ 20న ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. అదే నెల 26 నాటికి మహారాష్ట్ర అసెంబ్లీ ముగిసి పోనున్నది. ఇక జార్ఖండ్‌లోని 24 జిల్లాల్లో మొత్తం 81 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. రాష్ట్రంలో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 13న 43 సీట్లకు, నవంబర్ 20న 38 నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది జనవరి 5న జార్ఖండ్ అసెంబ్లీ కాలం ముగియనున్నది. మహారాష్ట్రలో ఎస్సీలకు 29 సీట్లు, ఎస్టీలకు 25 స్థానాలు కేటాయించారు. జార్ఖండ్‌లో ఎస్సీలకు 28, ఎస్టీలకు 9 స్థానాలు రిజర్వ్ అయ్యాయి.

ఓటర్ల సంఖ్య ఇలా

మహారాష్ట్రలో మొత్తం 9.63 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 4.97 కోట్లు, మహిళా ఓటర్లు 4.66 కోట్ల మంది ఉన్నారు. 21 నుంచి 29 ఏండ్ల మధ్య వయసున్న ఓటర్లు 1.85 కోట్ల మంది, తొలిసారి ఓటు వినియోగించుకుంటున్నవారు (18-19 ఏండ్ల మధ్య ఉన్నవారు) 21 లక్షల మంది ఉన్నారు. 85 ఏండ్లు పైబడినవారు 12 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

జార్ఖండ్‌లో మొత్తం 2.6 కోట్ల మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 1.31 కోట్ల మంది, మహిళలు 1.29 కోట్ల మంది ఉన్నారు. 21 నుంచి 29 ఏండ్ల మధ్య ఉన్న యువ ఓటర్లు 66 లక్షల మంది, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారు 12 లక్షల మంది ఉన్నారు. 85 ఏండ్లు పైబడిన వృద్ధ ఓటర్లు ఒక లక్ష మందికి పైగా తమ ఓటు హక్కును రాబోయే ఎన్నికల్లో వినియోగించుకోనున్నారు.

నీటి బాటిళ్లు, సైకిళ్లు చౌక

- ఎట్టకేలకు జీఎస్టీ తగ్గింపు
- ఖరీదైన వాచీలు, బూట్లపై పన్ను పెంపు

మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం



న్యూఢిల్లీ : పలు ఉత్పత్తులపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ల్లో మార్పులు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. 20 లీటర్ల ప్యాకేజ్డ్ నీటి బాటిళ్లు, సైకిళ్లు, నోట్‌బుక్స్ తదితర ఉత్పత్తులపై ఎట్టకేలకు జీఎస్టీని తగ్గించాలని ప్రతిపాదించింది. బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ ఉపసంఘం భేటీలో పలు నిర్ణయాలు తీసుకుంది. మంత్రివర్గ ఉపసంఘంలో ఉత్తరప్రదేశ్ ఫైనాన్స్ మినిస్టర్ సురేష్ కుమార్ కన్నా, రజస్థాన్ హెల్త్ సర్వీసెస్ మినిస్టర్ గజేంద్ర సింగ్, కర్నాటక రెవెన్యూ మంత్రి క్రిష్ణ బైరె గౌడ, కేరళ ఫైనాన్స్ మినిస్టర్ కెఎన్ బాల గోపాల్ ఉన్నారు. మొత్తం ఈ భేటీలో 100 వస్తువులకు సంబంధించి జీఎస్టీ రేట్లను చర్చించారు. శనివారం జరిగిన మంత్రివర్గ ఉపసంఘం చేసిన ప్రతిపాదిత వివరాలు.. ప్రస్తుతం 20 లీటర్ల నీటి బాటిల్‌పై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తుండగా.. దీన్ని 5 శాతానికి తగ్గించనున్నారు. అదే విధంగా రూ.10,000 లోపు ధర కలిగిన సైకిళ్లపై 12 శాతంగా ఉన్న పన్నును 5 శాతానికి తగ్గించడానికి మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. నోట్ బుక్స్‌పైనా 12 నుంచి ఐదు శాతానికి తగ్గనుంది. మరోవైపు ఖరీదైన బూట్లు, చేతి వాచీలపై పన్ను రేట్లు పెరగనున్నాయి. రూ.15,000 కంటే అధిక విలువ కలిగిన బూట్లు, రూ.25వేల కంటే ఎక్కువ ధర ఉన్న చేతి వాచ్‌లపై జీఎస్టీని 18 నుంచి 28 శాతానికి పెంచాలని ఉపసంఘం ప్రతిపాదించింది. ఈ పన్ను రేట్ల పెంపునతో అదనంగా రూ.22వేల కోట్ల ఆదాయం సమకూరనుందని అంచనా. 18 శాతం శ్లాబులో ఉన్న హెయిర్ డ్రైయర్లు, హెయిర్ కర్లర్లు, బ్యూటీ, మేకప్ సామగ్రిపై ఉన్న జీఎస్టీని మళ్లీ 28 శాతం శ్లాబులోకి చేర్చనున్నారు. ఈ పన్ను రేట్లపై జీఎస్టీ కౌన్సిల్ తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం 5, 12, 18, 28 శ్లాబుల్లో జీఎస్టీ రేట్లు అమల్లో ఉన్నాయి.

ఆరోగ్య బీమాపై జీఎస్టీ మినహాయింపు

బీమాపై వసూలు చేస్తోన్న 18 శాతం జీఎస్టీ పన్ను భారంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో కేంద్రం ఎట్టకేలకు దీనిపై స్పందించింది. శనివారం జరిగిన మంత్రివర్గంలో దీనిపై చర్చ జరిగింది. జీఎస్టీ నుంచి ఆరోగ్య బీమా, జీవిత పాలసీలను మినహాయించాలని నిర్ణయించారు. టర్మ్ ఇన్సూరెన్స్‌తో పాటు రూ.5 లక్షల వరకు తీసుకునే ఆరోగ్య బీమాపై జీఎస్టీ నుంచి మినహాయించనున్నారు. కాగా.. రూ.5 లక్షల కవరేజీ దాటితే 18 శాతం జీఎస్టీ విధించనున్నారు. అయితే సీనియర్ సిటిజన్లకు మాత్రం కవరేజీతో సంబంధం లేకుండా మినహాయింపు లభించనుంది. దీనిపై సమగ్రంగా చర్చించేందుకు సామ్రాట్ చౌదరిని కన్వీనర్‌గా 13 మంది సభ్యులతో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో తెలుగు రాష్ట్రాల మంత్రులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఈ నెలాఖరుకు కౌన్సిల్‌కు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. వచ్చే నెలలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో వైద్య బీమా పాలసీలు, టర్మ్ జీవిత బీమా పాలసీల ప్రీమియం చెల్లింపులపై జీఎస్టీ తగ్గింపు, మినహాయింపు విషయమై తుది నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది.

యువకుని ఆత్మహత్యాయత్నం

- ఎస్ఐ గుండు గీయించడం వల్లేనన్న ప్రచారం
- ఓ కేసు విషయంలో ముగ్గురు యువకులకు గుండు గీయించిన వైనం
- ఎస్ఐ చెప్తేనే చేశారు.. : బాధితుని తల్లి
- ఎస్ఐకి సంబంధం లేదంటున్న తండ్రి

నవతెలంగాణ-అచ్చంపేట

నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలోని ఒక పెట్రోల్ బంక్‌లో జరిగిన గొడవ విషయంలో ముగ్గురు యువకుల పట్ల విచారణ సందర్భంగా లింగాల ఎస్ఐ అత్యుత్సాహం చూపించారన్న ఆరోపణలొస్తున్నాయి. దసరా పండుగ మరుసటి రోజు పెట్రోల్ బంక్ నిర్వాహకులు యువకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో ముగ్గురు యువకులను స్టేషన్‌కి పిలిపించారు. అక్కడ ఏం జరిగిందో ఏమో వారికి గుండు గీయించారు. దీంతో మనస్తాపానికి గురైన వినీత్ అనే యువకుడు అవమానంతో ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపింది. ఎస్ఐ చెప్తేనే గుండు గీశారని, ఆ అవమానం భరించలేకనే తన కుమారుడు ఆత్మహత్యకు యత్నించాడని తల్లి హేమలత చెబుతున్నారు. అయితే, తన కొడుకు ఆత్మహత్యాయత్నానికి ఎస్ఐకి ఎలాంటి సంబంధమూ లేదని తండ్రి సుధాకర్ చెబుతున్నాడు. విషయమేదైనా ముగ్గురు యువకులకు గుండు గీసిన విషయం నిజమనే ప్రచారంలో ఉంది. పోలీసులు గుండు గీయించకపోతే.. మరి ఆ ముగ్గురు యువకులకు గుండు గీసింది ఎవరు? బహిర్గతం కావాల్సి ఉంది. పోలీసులకు భయపడి తండ్రి అలా చెబుతున్నాడా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వినీత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- పరిస్థితి విషమం
- ఆలస్యంగా వెలుగులోకి..

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఈ ఘటన శనివారం వెలుగులోకొచ్చింది. విద్యార్థిని నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతోంది. మరో రెండ్రోజులు గడిస్తే కానీ విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై స్పష్టమైన నిర్ణయం రాదని వైద్యులు చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన సైదా- స్వాతి కుమార్తె రూపావత్ శిరీష(14) నల్లగొండ జిల్లా మిర్యాలగూడ గిరిజన గురుకులంలో 9వ తరగతి చదువుతోంది.

దసరా సెలవుల అనంతరం శిరీషను శుక్రవారం మధ్యాహ్నం పాఠశాలలో వదిలారు. అయితే, సాయంత్రం 6:30 గంటలకు శిరీష కడుపు నొప్పితో బాధపడుతోందని, మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని తీసుకెళు ...న్నామని పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతోంది. తల్లిదండ్రులు ఆస్పత్రికి వచ్చాక తమ కుమార్తె పురుగుల మందు తాగినట్టు తెలిసింది. కాగా, విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియలేదు. పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులతో తనకు ఎలాంటి ఇబ్బందీ లేదని విద్యార్థిని చెప్పినట్టు సమాచారం.

నకిలీ పోస్టులు తొలగించండి

- పలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు మహారాష్ట్ర ఈసీ నోటీసులు
- స్పందించిన సామాజిక మాధ్యమాలు
- పలు పోస్టులు డిలీట్



ముంబయి : ఎన్నికల వేళ సోషల్ మీడియాలో వస్తున్న నకిలీ వార్తల విషయంలో మహారాష్ట్ర ఎన్నికల సంఘం (ఈసీ) చర్యలు తీసుకుంటున్నది. ఈ మేరకు పలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు నోటీసులు పంపింది. ఓటర్లలో గందరగోళం కలిగిస్తున్న నకిలీ వార్తలను ప్రచారం చేసే 1752 పోస్టులను తొలగించాలని ఆదేశించింది. ఎన్నికల సంఘం ఆదేశాల తర్వాత వీటిలో 300 మందికి పైగా పోస్టులను తొలగించబడ్డాయని ఒక అధికారిక ప్రకటన వివరించింది. సమాచార సాంకేతిక చట్టంలోని సెక్షన్ 79(3)(బి) కింద నోటీసులను పంపినట్టు అధికారులు తెలిపారు. "అభ్యంతరకర పోస్టులు ఫేస్‌బుక్‌లో 143, ఇన్‌స్టాగ్రామ్‌లో 280, ఎక్స్‌లో 1296, యూట్యూబ్‌లో 31, ఇతర ప్లాట్‌ఫామ్‌లలో రెండింటిని కనుగొన్నారు. ఈసీ నుంచి నోటీసులు అందిన తర్వాత నుంచి ఇందులో ఫేస్‌బుక్ 16 పోస్టులను తొలగించగా.. 127 పోస్టులపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. ఇక ఇన్‌స్టాగ్రామ్ 29 పోస్టులు, ఎక్స్ 251, యూట్యూబ్ ఐదు పోస్టులను డిలీట్ చేశాయి. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి ఈసీ సి-విజిల్ యాప్ ద్వారా 420 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 414 ఫిర్యాదులు పరిష్కారమయ్యాయి. థానే జిల్లాలో అత్యధిక సంఖ్యలో ఫిర్యాదులకు పరిష్కారం లభించాయి" అని అధికారిక ప్రకటన వివరించింది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి రూ.10.64 కోట్ల విలువైన నగదు, డ్రగ్స్, మందు, ఖరీదైన ఉచితాలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నది.

జీవో 29తో ఆ తరగతులకు అన్యాయం

- ఎమ్మెల్యేలు సీఎంను నిలదీయండి
- రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్న రేవంత్ సర్కార్
- నిరుద్యోగుల గొంతుక కోదండరామ్ ఎక్కడ? : ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవతెలంగాణ-సిద్దిపేట

"రాహుల్ రాజ్యాంగం పట్టుకుని దేశమంతా తిరుగుతారు.. వారి ప్రభుత్వం ఆ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు? జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.." అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రిజర్వేషన్ల అమలులో రాజ్యాంగ స్ఫూర్తికి రేవంత్ సర్కార్ తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో జీఓ 55 అమలు చేశామని, ఈ ప్రభుత్వం జీవో 29 తెచ్చిందని, ఈ జీవో వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం జరుగుతుందన్నారు. మెరిట్‌లో ఉద్యోగాలు పొందిన రిజర్వుడు అభ్యర్థులను వారి రిజర్వేషన్‌లో చూపించడం వల్ల వారికి అన్యాయం జరుగుతుందన్నారు. తమకు న్యాయం చేయాలని విద్యార్థులు నిరసనలు వ్యక్తం చేస్తుంటే నిరుద్యోగ యువతపై కాంగ్రెస్ ప్రభుత్వం దాడులు చేయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత సామాజిక తరగతికి చెందిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. అసెంబ్లీలో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించానని, విక్రమార్క దీనిని పరిశీలిస్తానని చెప్పారని, కానీ ఇప్పటికీ పరిశీలించలేదని అన్నారు. కాంగ్రెస్‌లో ఉన్న దళిత, బలహీన, మైనార్టీ తరగతుల ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని నిలదీయాలని సూచించారు. యూపీపీఎస్‌సీలో రిజర్వేషన్లు అమలు అవుతాయని, టీపీపీఎస్‌సిలో ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. టెర్రరిస్టులు, సంఘ విద్రోహ శక్తులతో వ్యవహరించినట్టు నిరుద్యోగులతో వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు నింపుతామన్నారు, నింపారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగ ప్రక్రియను పూర్తి చేసిన వాటికి కాగితాలు ఇవ్వడం తప్ప రేవంత్ చేసిందేమీ లేదని విమర్శించారు. ఓట్లు వచ్చినప్పుడు కాదు.. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా ఇప్పుడు అశోక్‌నగర్‌కు వెళ్లాలని సవాల్ విసిరారు. పోలీస్ బలగాలు, లాఠీచార్జీలు, ఇనుప కంచెలతో విద్యార్థుల్ని అణచి వేద్దామనుకుంటే పోరాటం మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. నిరుద్యోగుల గొంతుక అవుతానన్న కోదండరామ్ ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థం కావడం లేదని, కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవి రాగానే గొంతు మూగబోయిందా అని ప్రశ్నించారు. కోదండరామ్, రియాజ్, ఆకునూరి మురళి, నవీన్ లాంటి వాళ్లు ఉద్యోగాలు పొందారు.. విద్యార్థులకు దగా మిగిలిందన్నారు. పదవులు పొందిన వారంతా అశోక్‌నగర్‌కు రావాలని డిమాండ్ చేశారు. లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణ అని చెప్పే రేవంత్‌కు రైతులకు రూ.15 వేలు ఇవ్వడానికి చేతులు రావడం లేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, నాయకులు రాజనర్సు, రాధాకృష్ణ శర్మ, సాయిరాం, గుండు భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష ఆపడమే మీ లక్ష్యమా?

- బండి సంజయ్, కేటీఆర్‌కు ఎంపీ చామల ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గ్రూప్ -1 పరీక్షను ఆపడమే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమా? అని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. కోర్టు కేసు ఉన్న విషయాన్ని కూడా మరచిపోయి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, మాజీ మంత్రి కేటీఆర్ విద్యార్థులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యే మందుల సామేలు, పార్టీ నాయకులు చరణ్ యాదవ్, రవళిరెడ్డి, వచన్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. బండి సంజయ్‌కి కోర్టులపై గౌరవం లేదని విమర్శించారు. గ్రూప్ వన్‌పై చర్చకు రాకుండా రోడ్లపై రచ్చ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ సుప్రీం కోర్టులో వేయించి ఇప్పుడు వాయిదా అంటూ డ్రామా చేస్తున్నారని విమర్శించారు. ప్రవళిక అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న రోజు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. ఆ రెండు పార్టీ నేతలు విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారని విమర్శించారు. అప్పుడు వారి బాధలు వినిపించలేదా? అని ప్రశ్నించారు. డీఎస్సీ పరీక్షను వాయిదా బీఆర్ఎస్ అడిగిందనీ, కానీ రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని పరీక్ష నిర్వహించి, నియామక పత్రాలు అందజేసిందని గుర్తు చేశారు. ఇప్పటికే వారు విధుల్లో చేరారని గుర్తు చేశారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ కమిట్‌మెంట్ అని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా 90 రోజుల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేసిందని చెప్పారు.

క్రైచ్ సెంటర్ల ఏర్పాటును తక్షణమే ఆపాలి

- ముందు సెంటర్ల విధి విధానాలు ప్రకటించండి
- సీఎం, మంత్రి వ్యాఖ్యలు గందరగోళం అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి
- ములుగు కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీల భారీ ధర్నా
- కలెక్టర్‌తో చర్చలు



నవతెలంగాణ-ములుగు

ములుగు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అంగన్వాడీ సెంటర్లలో క్రైచ్ సెంటర్ల ఏర్పాటును వెంటనే ఆపాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి అన్నారు. ముందుగా ఆ సెంటర్ల విధి విధానాలు ప్రకటించాలని, దానికి సంబంధించి జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ముందు అంగన్‌వాడీలు పెద్దఎత్తున ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ ఆఫీస్‌లో కలెక్టర్‌తో యూనియన్ నాయకులు చర్చలు జరిపారు. వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ.. క్రైచ్ సెంటర్ల ఏర్పాటుపై ప్రభుత్వం ఎలాంటి విధి విధానాలు ఇంకా రూపొందించలేదని, జీవో కూడా ఇవ్వలేదని చెప్పారు. జీవో వచ్చాక తప్పకుండా చెబుతామని అన్నారు.

ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ.. క్రైచ్ సెంటర్ల విధి విధానాలు చెప్పకుండా, అంగన్‌వాడీ టీచర్, ఆయాల విధులు ఏంటో స్పష్టంగా తెలియకుండా.. ఆ సెంటర్ల పరిధి చెప్పకుండా ప్రారంభించడం తగదన్నారు. ఇది ప్రభుత్వ మోసపూరిత విధానమని విమర్శించారు. పైగా ఈ సెంటర్లలో ఎన్జీవోల జోక్యం ఉంటుందని, ప్రయివేటు వారికి అప్పగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు దానికి సంబంధించిన జీవో ఇవ్వడం పద్ధతి అనీ.. ఇప్పుడు హడావుడిగా సెంటర్లు ప్రారంభిస్తామని చెప్పడంలో ఆంతర్యం ఏముందని ప్రశ్నించారు. అంగన్వాడీలు, ఐసీడీఎస్ వ్యవస్థపై గందరగోళ ప్రకటనలు ఇస్తున్నారని, సీఎం ఒక మాట, మంత్రి ఒక మాట మాట్లాడుతున్నారని అన్నారు.

మూడేండ్లపైన పిల్లలను స్కూలుకు పంపి.. ప్రత్యేక టీచర్లను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటిస్తూ.. మరోవైపు క్రైచ్ సెంటర్లు పెడతామని మంత్రి చెబుతూ అంగన్‌వాడీలను గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు. ఇప్పటికే అంగన్వాడీ సెంటర్ల ద్వారా మూడు సంవత్సరాల్లోపు పిల్లలకు టీహెచ్‌ఆర్ ఇస్తున్నారని, మళ్లీ కొత్తగా బాలల సంరక్షణ పేరుతో కొత్త సెంటర్లను ప్రారంభించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. క్రైచ్ సెంటర్ల ఏర్పాటుపై ప్రభుత్వం వెంటనే క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ములుగు జిల్లాలో 25 సెంటర్లు సెలెక్ట్ చేసి హడావుడిగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి మద్దతు తెలియజేశారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఎండి గఫుర్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు కె.సరోజన, కె.సమ్మక్క, నాయకులు జమునారాణి, రమాదేవి, ధనలక్ష్మి, సూరమ్మ, సరిత, నర్సమ్మ, విజయ, పుష్ప, ఇందిరా, రాంబాయి, దీప, లక్ష్మీకాంత, రుక్మిణి, వెంకటేశ్వరి, దేవి, రజిత, పార్వతి, నర్సమ్మ, రమ పాల్గొన్నారు.

విద్యుత్ బల్బుల్లో ఉండే వాయువు ఏది?

1. భారాత్మకంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌లో సగభాగం నీటితో కలిపితే ముద్దగా మారి కొంత కాలం తర్వాత గట్టి పదార్థంగా మారుతుంది. దీన్నే 'సెట్టింగ్' అని అంటారు. ఈ ప్రక్రియలో ఘనపరిమాణం పెరగడంతో పాటు?
   ఎ. కార్బొనేషన్ జరుగుతుంది
   బి. నిర్జలీకరణం (డీహైడ్రేషన్) చోటు చేసుకుంటుంది.
   సి. హైడ్రేషన్ జరుగుతుంది
   డి. హైడ్రోజనీకరణం సంభవిస్తుంది.
2. విరిగిన ఎముకలు సరైన స్థానాల్లో సెట్ చేయడానికి సిమెంట్ పట్టీగా దేన్ని ఉపయోగిస్తారు?
   ఎ. జిప్సం   బి. సున్నం
   సి. సిమెంట్   డి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్
3. ఒక భాగం తడి సున్నం, మూడు భాగాల ఇసుక, నీరు బాగా కలిసి ఉన్న మిశ్రమాన్ని ఏమంటారు?
   ఎ. లైమ్ మోర్టార్   బి. లైమ్ సిమెంట్
   సి. రేయిన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్   డి. ఏదీ కాదు
4. గాజు అనేది కింది వాటి మిశ్రమం?
   1.సోడియం సిలికేట్   2. కాల్షియం సిలికేట్   3. సిలికా
   ఎ. 1,2 మాత్రమే   బి. 2,3 మాత్రమే
   సి. 1,2,3   డి. 1,3 మాత్రమే
5. గాజును నెమ్మదిగా చల్లార్చడాన్ని మందశీతలీకరణం అంటారు. దీని వల్ల గాజుకు?
   ఎ. పెలుసుదనం వస్తుంది   బి. అధిక బలం లభిస్తుంది
   సి. మందం ఎక్కువ అవుతుంది   డి. ఏదీకాదు
6. గాజుకు ముఖ్యమైన ముడి పదార్థం అయిన ఇసుక రసాయన నామం?
   ఎ. సిలికాన్   బి. సిలికా
   సి. అల్యూమినా   డి. మార్బుల్
7. రసాయనికంగా క్వార్ట్జ్ అనేది వీటిలో ఏది?
   ఎ. కాల్షియం సిలికేట్   బి. సిలికాన్ ఆక్సైడ్
   సి. సోడియం సల్ఫేట్   డి. కాల్షియం సల్ఫేట్
8. టాల్క్‌లో ఉండే రసాయనం?
   ఎ. మెగ్నీషియం ఆక్సైడ్   బి.మెగ్నీషియం
   సి. మెగ్నీషియం డై ఆక్సైడ్   డి. కాల్షియం కార్బొనేట్
9. మనం తినే పాన్‌ను చేసేటప్పుడు తమలపాకుపై రాసే సున్నపు తేట రసాయన నామం?
   ఎ. కాల్షియం కార్బొనేట్   బి. కాల్షియం హైడ్రాక్సైడ్
   సి. కాల్షియం ఆక్సైడ్   డి. కాల్షియం సల్ఫేట్
10. సున్నపు తేటను పాలవలె మార్చే వాయువు?
    ఎ. బొగ్గు పులుసు వాయువు (కార్బన్ డై ఆక్సైడ్)
    బి. కార్బన్ మోనాక్సైడ్
    సి. నైట్రోజన్
    డి. సల్ఫర్ డై ఆక్సైడ్
11. బ్లీచింగ్ పౌడర్‌ను నీటిలో కలిగించినప్పుడు విడుదలయ్యే వాయువు ఏది?
    ఎ. క్లోరిన్   బి. ఆక్సిజన్
    సి. ఫ్లోరిన్   డి. అయొడీన్




12. మామిడి కాయలను కృత్రిమంగా పక్వానికి తెప్పించడానికి కాల్షియం కార్బైడ్ ముద్దలను ఉపయోగిస్తారు. తేమలో ఈ పదార్థం నుంచి విడుదలైన ఏ వాయువు ఈ ప్రక్రియకు తోడ్పడుతుంది?
    ఎ. ఇథిలీన్   బి. ఎసిటలీన్
    సి. క్లోరోఫాం   డి.హైడ్రోజన్
13. సిమెంటు తయారీకి కావాల్సిన ప్రధాన ముడి పదార్థం?
    ఎ. ఇసుక   బి.సున్నపురాయి
    డి.సోడాయాష్   డి.ఏదీకాదు బి
14. కింది వాటిలో సిమెంటు పరిశ్రమకు అవసరమైంది?
    ఎ.సున్నపురాయి   బి.బంకమన్ను
    సి.బొగ్గు   డి.అన్నీ
15. సిమెంట్ తయారీలో చిట్ట చివర కలిపే పదార్థం?
    ఎ.బంకమన్ను   బి.సిలికా
    డి.సున్నపురాయి   డి.జిప్సం
16. గాజు వస్తువుల బ్లోయింగ్‌కు ఉపయోగించే మంట?
    ఎ.ఆక్సిజన్-ఎసిటలీన్ టార్చి   బి.హైడ్రోజన్ టార్చి
    సి.కోక్ మంట   డి.కట్టెల మంట
17. ఫేస్ పౌడర్‌కు అవసరం లేని గుణం?
    ఎ.అపారదర్శకత   బి.జారుడు గుణం
    సి.శోషణం   డి.గరుకుదనం
18. పౌడర్‌లో అపార దర్శకత (కప్పి ఉండే సామర్థ్యం) కోసం దేన్ని ఉపయోగిస్తారు?
    ఎ. టైటానియం డై ఆక్సైడ్   బి. సిలికాన్ డై ఆక్సైడ్
    సి.బంకమన్ను   డి.సుద్ద
19. సున్నపు తేటను గోడలకు వెల్ల వేసినప్పుడు అది గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్ పీల్చుకుని తెల్లగా మారుతుంది. ఇందులో చివరగా ఏర్పడే పదార్థం?
    ఎ.కాల్షియం కార్బొనేట్   బి.కాల్షియం సల్ఫేట్
    సి.కాల్షియం కార్బైడ్   డి.కాల్షియం ఫాస్ఫేట్
20. మున్సిపల్ వాటర్‌ను శుద్ధి చేసే ప్రక్రియ?
    ఎ. ఆక్సీజనేషన్   బి. క్లోరినేషన్
    సి.అయొడినేషన్   డి. హైడ్రేషన్
21. చాకలి సోడా రసాయన నామం?
    ఎ.సోడియం కార్బొనేట్   బి.సోడియం బై కార్బొనేట్
    సి.సోడియం క్లోరైడ్   డి.సుక్రోజ్
22. సాధారణ ఉప్పు(టేబుల్ సాల్ట్) రసాయన నామం?
    ఎ.సోడియం సల్ఫేట్   బి.సోడియం క్లోరైడ్
    సి.సోడియం హైడ్రాక్సైడ్   డి.సోడియం ఫాస్ఫేట్
23. రాళ్లలో, ఖనిజాల్లోనూ అత్యధిక పరిమాణంలో ఉండే మూలకం?
    ఎ.సిలికాన్   బి.కార్బన్
    సి.ఐరన్   డి.అల్యూమినియం
24. క్యాన్సర్ చికిత్సకోసం ఉపయోగించే మలాము(ఆయింట్‌మెంట్)లో వాడేది?
    ఎ.అయోడిన్   బి.బ్రోమిన్
    సి.రేడాన్   డి.రేడియం
25. ఏక పరమాణుక వాయువు ఏది?
    ఎ.హైడ్రోజన్   బి.ఆక్సిజన్
    సి.నైట్రోజన్   డి.హీలియం
26. గాల్లోని జడవాయువుల్లో గరిష్ఠంగా ఉండేది?
    ఎ.హీలియం   బి.నియాన్
    సి.ఆర్గాన్   డి.క్రిప్టాన్
27. విద్యుత్ బల్బుల్లో ఉండే వాయువు ఏది?
    ఎ.ఆక్సిజన్   బి.కార్బన్ డై ఆక్సైడ్
    సి.ఆర్గాన్   డి.నైట్రోజన్
28. సముద్రపు లోతుల్లోకి వెళ్లే ఈతగాళ్ల శ్వాసక్రియకు సహాయపడేందుకు ఆక్వాలంగ్ పరికరాలను వాడతారు. వీటిలో ఉండే వాయు మిశ్రమం ఏది?
    ఎ.10శాతం ఆక్సిజన్, 90శాతం నైట్రోజన్
    బి.20శాతం ఆక్సిజన్, 80శాతం నైట్రోజన్
    సి.20శాతం హీలియం, 80శాతం ఆక్సిజన్
    డి.20శాతం ఆక్సిజన్, 80శాతం హీలియం
29. సూర్యుడు, ఇతర నక్షత్రాల్లో శక్తి ఉత్పన్నమయ్యేందుకు కారణమయ్యే ప్రక్రియ?
    ఎ.హైడ్రోజన్ సంలీనం   బి.రేడియం సంలీనం
    సి.హీలియం సంలీనం   డి.నైట్రోజన్ సంలీనం
30. బొగ్గుగని కార్మికుల టోపీలైట్లలో వాడే వాయువు?
    ఎ.క్రిప్టాన్   బి.హీలియం
    సి.నియాన్   డి.ఆక్సిజన్
31. జతపర్చండి?
    ముడిపదార్థం ఉత్పాదితం
    1. లైమ్‌స్టోన్ ఎ.పోర్సిలీన్
    2. జిప్సం బి.గ్లాస్
    3. సిలికా ఇసుక బి.ప్లాస్టర్ ఆఫ్ పారిస్
    4. మట్టి డి.సిమెంట్

ఎ. 1-ఎ	2-బి	3-సి	4-డి
బి. 1-డి	2-సి	3-బి	4-ఎ
సి. 1-ఎ	2-సి	3-డి	4-బి
డి. 1-డి	2-ఎ	3-సి	4-బి

సమాధానాలు

1.సి	2.డి	3.ఎ	4.సి	5.బి
6.బి	7.బి	8.బి	9.బి	10.ఎ
11.ఎ	12.బి	13.బి	14.డి	15.డి
16.ఎ	17.డి	18.ఎ	19.ఎ	20.బి
21.ఎ	22.బి	23.ఎ	24.సి	25.ఎ
26.సి	27.సి	28.డి	29.ఎ	30.ఎ
31.బి				

జలచక్రం అంటే ఏమిటి?



పర్యావరణంతో శతాబ్దానికి పైగా మనిషి ఆడుతున్న ప్రమాదకరమైన ఆట పెను విపత్తుగా పరిణమిస్తోంది. దీని తాలూకు విపరిణామాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. విచ్చలవిడిగా అడవుల నరికివేత, మితిమీరిన వాతావరణ కాలుష్యం తదితరాల దెబ్బకు చివరికి భూమిపై జీవకోటి మనుగడకు అత్యవసరమైన జలచక్రం కూడా గతి తప్పింది. అంతర్జాతీయ నిపుణుల సమూహమైన గ్లోబల్ కమిషన్ ఆన్ ద ఎకనామిక్స్ ఆఫ్ వాటర్ చేపట్టిన అధ్యయనం ఈ మేరకు తేల్చింది.

'చరిత్ర పొడవునా అత్యంత భారీ వాతావరణ మార్పులనెన్నింటినో తట్టుకుని నిలిచిన జలచక్రం ఇలా సంతులనం కోల్పోవడం మానవాళి చరిత్రలో ఇదే తొలిసారి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా నీటి ఎద్దడి అతి త్వరలోనే పరాకాష్ఠకు ఖాయం' అని అక్టోబర్17వ తేదీ విడుదల చేసిన నివేదికలో హెచ్చరించింది. మనిషి నిర్వాకం వల్ల చోటు చేసుకుంటున్న పర్యావరణ మార్పులే ఇందుకు ప్రధాన కారణమంటూ కుండబద్దలు కొట్టింది. 'దీనివల్ల ఆహార సంక్షోభం మొదలుకుని పలు రకాల విపరిణామాలు తలెత్తనున్నాయి. వీటి దెబ్బకు త్వరలో పలు దేశాల ఆర్థిక వ్యవస్థలే అతలాకుతలం కావడం ఖాయం' అని జోస్యం చెప్పింది.

ఏమిటి జలచక్రం?

జలచక్రం భూమిపై నీటి కదలికలకు సంబంధించిన సంక్లిష్టమైన వ్యవస్థ. చెరువులు, నదులు ముఖ్యంగా సముద్రంలోని నీరు సూర్యరశ్మి ప్రభావంతో ఆవిరిగా వాతావరణంలోకి చేరుతుంది. భారీ నీటి ఆవిరి మేఘాలుగా మారి సుదూరాలకు పయనిస్తుంది. శీతల వాతావరణం ప్రభావంతో చల్లబడి వానగా, మంచుగా తిరిగి నేలపైకి చేరుతుంది. ఈ ప్రక్రియనంతటినీ కలిపి జలచక్రంగా పేర్కొంటారు. మనిషి చేతులారా చేస్తూ వస్తున్న పర్యావరణ విధ్వంసం ధాటికి దీనిపై కొన్ని దశాబ్దాలుగా కనీవినీ ఎరగని స్థాయిలో ఒత్తిడి పడుతూ వస్తోంది. ఇటీవలి కాలంలో అది భరించలేని స్థాయికి చేరిందని అధ్యయనం వెల్లడించింది. దశాబ్దాల తరబడి భూమిని విచ్చలవిడిగా విధ్వంసకర విధానాలకు వాడేయడం మొదలుకొని ప్రపంచవ్యాప్తంగా అత్యధిక దేశాలు నీటి నిర్వహణలో కనబరుస్తున్న లెక్కలేనితనం దాకా జలచక్రం గతి తప్పేందుకు దారి తీసిన పలు కారణాలను నివేదిక ఏకరువు పెట్టింది.

గతి తప్పితే అంతే...

జలచక్రం గతి తప్పితే జరిగే చేటును తాజా నివేదిక కళ్లకు కట్టింది.

- కేవలం నీటి ఎద్దడి దెబ్బకు 2050 నాటికి దాదాపుగా అన్ని దేశాల జీడీపీ కనీసం 8శాతం, అంతకుమించి తగ్గిపోతుందని అంచనా. అల్పాదాయ దేశాల జీడీపీలో 15 శాతానికి పైగా క్షీణత నమోదు కావచ్చు.
- దీని ప్రభావంతో ఏకంగా 300 కోట్ల మంది తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. చాలా దేశాల్లో పంటలూ నేల చూపులు చూస్తున్నాయి. భారీ భవనాలు తదితరాల తాలూకు ఓపలేని భారానికి తోడు భూగర్భ జల వనరులూ నిండుకుంటుండటంతో నగరాలు, పట్టణాలు నానాటికీ మరింత వేగంగా భూమిలోకి కూరుకుపోతున్నాయి.
- నీటి సంక్షోభం ఇప్పటికే ప్రపంచ ఆహారోత్పత్తిని 50 శాతానికి పైగా ప్రభావితం చేస్తోంది.

హరిత జలం అతి కీలకం

చెరువులు, నదుల వంటి జలాశయాల్లోని నీటిని బ్లూ వాటర్ అంటారు. మట్టి, మొక్కల్లో నిల్వ ఉండే తేమను హరిత జలం అని పేర్కొంటారు. మనం ఇప్పటి వరకు పెద్దగా పట్టించుకోని ఈ నీటి వనరును జలచక్రంలో అతి కీలకమైన పొరగా నివేదిక అభివర్ణించింది. 'ప్రపంచ వర్షపాతంలో ఏకంగా సగానికి పైగా దీనివల్లే సంభవిస్తోంది. భూమిని వేడెక్కించే కర్బన్ ఉద్గారాలను చాలా వరకు శోషించుకునేది ఈ హరితజలమే' అని తేల్చింది. కానీ 'ఏ దేశంలో చూసిన చిత్తడి నేలలను నాశనం చేసే ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. దీనికి తోడు అడవులనూ విచ్చలవడిగా నరికేస్తున్నారు. దాంతో కర్బన ఉద్గారాలు నేరుగా వాతావరణంలోకి విడుదలైపోతున్నాయి. ఫలితంగా గ్లోబల్ వార్మింగ్ ఊహాతీత వేగంతో పెరిగిపోతోంది. మట్టిలో, చెట్లలో ఉండే తేమ హరించుకుపోతోంది. ఇదో విషవలయం. దీని దెబ్బకు కార్చిచ్చుల ముప్పు కూడా నానాటికి పెరుగుతోంది' అని నివేదిక హెచ్చరించింది.

ప్రభుత్వం తానిచ్చిన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2019-2021కి సంబంధించి ఇచ్చిన గణాంకాలలో చైల్డ్ వాస్టింగ్ 19.3శాతంగా, చైల్డ్ స్టన్‌టింగ్ 35.5 శాతంగా ఉంది. ఎస్ఓఎఫ్ఐ-2023 నివేదిక ప్రకారం కూడా భారతదేశంలో 24 కోట్లమంది ప్రజలు పోషకాహారలేమితో ఉన్నారని తెలిపింది. ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ప్రపంచ నివేదిక-2023లో కూడా ఇది 16.6 శాతంగా ఉన్నది.

ప్రపంచ ఆకలి సూచీ 2024 - ప్రమాదానికి సంకేతం!



జి కిషోర్ కుమార్
9440905501

జాతీయంగా,ప్రాంతీయంగా నిర్దిష్ట సంవత్సరకాలంలో పేదరిక స్థాయిని నిర్ధారించటానికి, ఆకలి తీరు తెన్నులు కొలవడానికి ప్రపంచ ఆకలి సూచీ (జిహెచ్ఐ) అనేది ఒక ముఖ్యమైన సూచికగా పరిగణిస్తున్నారు. విలువ, నాణ్యత, వాస్తవికత, అంతర్జాతీయ సంస్థల గణాంకాల ప్రామాణికత వంటి శాస్త్రీయ ప్రమాణాలతో నిర్ధారించబడిన "గ్లోబల్ హంగర్ ఇండెక్స్" నివేదిక ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. ప్రపంచవ్యాప్తంగా ఆకలిని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలనే లక్ష్యంతో ఈ నివేదిక రూపొందించబడుతుంది.

ఐర్లాండ్‌కు చెందిన 'కన్‌సర్న్ వరల్డ్‌వైడ్', జర్మనీకు చెందిన 'వెల్త్ హంగర్ లైఫ్' సంయుక్తంగా వివిధ గణాంకాల సూక్ష్మ పరిశీలన అనంతరం, నిపుణుల సమూహంతో తయారుచేసి, 2006 నుంచి ప్రతియేటా ఈ నివేదికను విడుదల చేస్తున్నాయి. 10, అక్టోబర్ 2024వ తేదీన ఈ రెండు నాన్-గవర్నమెంట్ యూరోపియన్ ఆర్గనైజేషన్స్ "గ్లోబల్ హంగర్ ఇండెక్స్-2024"ను 19వ ఎడిషన్‌గా విడుదల చేశాయి. గణాంకాలకు సంబంధించిన వివరాలను ప్రపంచ బ్యాంక్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్, ఎఫ్ఏఓ, డిహెచ్ఎస్, యూఎన్ఐజిహెచ్ఐ వంటి అంతర్జాతీయంగా గుర్తింపుపొందిన సంస్థలు ప్రచురించిన నివేదికల ఆధారంగా పరిగణనలోకి తీసుకోబడినట్టు నివేదికలో పేర్కొన్నాయి.

ఆకలి సూచి తీవ్రతను 100పాయింట్ల స్కేలు ప్రాతిపదికన నిర్ధారిస్తారు. స్కేలులో స్కోరు '0' వుంటే ఆకలి లేని పరిస్థితులు, '100' వుంటే ఘోరమైన పరిస్థితులు నెలకొనివున్నట్లుగా భావిస్తారు. ఈ స్కోరు 9.9 లేదా అంతకంటే తక్కువ వుంటే 'తక్కువగా' ఉందని, 10-19.9 మధ్య ఉంటే 'మోస్తరుగా' వుందని, 20-34.9 మధ్య వుంటే 'తీవ్రంగా' ఉందని, 35-49.9 ఉంటే 'ఆందోళనకరమని' 50 లేదా అంతకంటే ఎక్కువ స్కోర్ నమోదు అయితే 'అత్యంత ఆందోళనకరమని' నిర్ధారిస్తారు ఆహారం సరిపడినంతగా దొరక్కపోవడం, మొత్తం జనాభాలో పోషకాహార లేమితో ఉన్న జనాభా ప్రాతిపదికన నిర్ధారించే పోషకాహార లోపం (అండర్ నరిష్‌మెంట్), 5 సంవత్సరాలలోపు పిల్లలలో ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం (చైల్డ్ స్టన్‌టింగ్), ఐదేండ్లలోపు పిల్లలలో తీవ్రమైన పోషకాహారలేమి వల్ల వయసుకు తగిన ఎత్తు లేకపోవడం (చైల్డ్ వాస్టింగ్), ఐదేండ్లలోపు పిల్లలకు సరిపడ పోషకాహారలేమి వలన, అనారోగ్యమైన వాతావరణం వలన జరుగుతున్న శిశు మరణాలు (చైల్డ్ మోర్టాలిటి) వంటి నాలుగు కీలక సూచికలను కొలమానంగా పరిగణనలోకి తీసుకుని ప్రపంచ ఆకలి సూచీని లెక్కిస్తారు. వెయిటేజ్ పరంగా విశ్లేషించినపుడు, హంగర్ ఇండెక్స్‌లో పోషకాహారలోపానికి 1/3, చైల్డ్ స్టన్‌టింగ్‌కు 1/6, చైల్డ్ వాస్టింగ్‌కు 1/6, శిశు మరణాలకు 1/3 వంతుగా ఇమిడిఉంటుంది.

127 దేశాలను పరిగణనలోకి తీసుకుంటే 27.3 హంగర్ స్కోరుతో భారతదేశం 105వ స్థానంలో నిలిచింది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ నివేదిక ప్రకారం ఆకలి ప్రమాదకర స్థాయిలో ఉన్న 41 దేశాల జాబితాలో భారతదేశం చేరటం శోచనీయం. మొత్తం 127 దేశాల జాబితాలో 5 సంవత్సరాలలోపు పిల్లలలో పోషకాహార లేమితో ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడమనే సూచిక (చైల్డ్ స్టన్‌టింగ్)లో 35.5శాతంగా



నమోదై అత్యధిక స్థాయిలో నిలవడం ఆందోళనకరం. పిల్లల పోషకాహారలేమికి సంబంధించిన అన్ని సూచికలలో చైల్డ్ వాస్టింగ్ అనేది తీవ్రమైనదిగా పరిగణించబడుతుంది. ఏదైనా దేశంలో ఇది 15శాతం కంటే ఎక్కువ వుంటే అత్యంత ఆందోళనకరమైన అంశంగా భావించబడుతుంది. చైల్డ్ వాస్టింగ్ సూచికలో 18.7శాతంగా నమోదై, పోషకాహారలోప తీవ్రతను ప్రతిబింబించింది. 5 సంవత్సరాలోపు శిశుమరణాల రేటు 2.9శాతంగా నమోదయింది.ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశం తర్వాత ఉగాండా, మొజాంబిక్, జింబాబ్వే, పాకిస్తాన్, నైజీరియా, సూడాన్, జాంబియా వంటి 22 దేశాలు మాత్రమే ఉండడం గమనార్హం. భారతదేశానికి పొరుగుదేశాలైన చైనా (4), శ్రీలంక (56), నేపాల్ (68), బంగ్లాదేశ్ (84) ర్యాంకులతో మనకంటే ముందునిలిచాయి. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ నివేదిక వెల్లడించిన వివరాల ప్రకారం 36 దేశాలు అత్యంత ప్రమాదకర స్థాయిలోను, 6 దేశాలు ఆకలి తీవ్రతతోనూ ఉన్నాయి.

అంతర్జాతీయ ఆకలి సూచి స్కోరు ప్రపంచ వ్యాప్తంగా పరిగణించినపుడు 18.3శాతంగా ఉంది. పౌష్టికాహార లోపం ఉన్న ప్రజల సంఖ్య క్రమేపి పెరిగి షుమారు 733 మిలియన్ల స్థాయికి చేరిందని, 2.8 బిలియన్ మేర ప్రజానీకం ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేకపోతున్నారని నివేదిక ఉటంకించింది. అంతర్జాతీయ సంఘర్షణలు, వాతావరణ మార్పులు, గాజా, సూడాన్‌లో నెలకొని ఉన్న యుద్ధపరిస్థితులు, కాంగో, హయతి, మాలి, సిరియా వంటి దేశాలలో నెలకొని ఉన్న అంతర్గత ఘర్షణ వంటి సవాళ్ళు ఈ స్థబ్దతకు కారణాలని అభిప్రాయాన్ని వెలియబుచ్చింది.గతంలో గ్లోబల్ హంగర్ ఇండెక్స్ నివేదికను భారత ప్రభుత్వం తిరస్కరించింది. ఇది ఆకలి లెక్కలలో లోపభూయిష్టమైన పద్ధతులను అవలంభించిందని అభివర్ణించింది. కేవలం కొద్ది మంది నమూనాగా నిర్వహించిన సర్వేతో పౌష్టికాహారలోపాన్ని నిర్ధారించడం అర్ధరహితమని ఆరోపించింది. నివేదికపై ప్రభుత్వ విమర్శలను నిశితంగా విశ్లేషిస్తే వాటి వాదనలలో పసలేదనేది ప్రస్ఫుటమవుతోంది. ప్రభుత్వం తానిచ్చిన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2019-2021కి సంబంధించి ఇచ్చిన గణాంకాలలో చైల్డ్ వాస్టింగ్ 19.3శాతంగా, చైల్డ్ స్టన్‌టింగ్ 35.5 శాతంగా ఉంది. ఎస్ఓఎఫ్ఐ-2023 నివేదిక ప్రకారం కూడా భారతదేశంలో 24 కోట్లమంది ప్రజలు పోషకాహారలేమితో ఉన్నారని తెలిపింది. ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ప్రపంచ నివేదిక-2023లో కూడా ఇది 16.6 శాతంగా ఉన్నది.

ప్రజలకు ఆహారాన్ని హక్కుగా అందించే కృషిలో భాగంగా 'ఈట్ రైట్', రక్తహీనత, పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు 'పోషణ్', ప్రసూతి సమయంలో ప్రయోజనాలను అందించేందుకు 'ప్రధాన మంత్రి మాతృ వందన యోజన', ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార ధాన్యాలను లబ్దిదారులకు అందించేందుకు నిర్దేశించిన 'జాతీయ ఆహార భద్రతా చట్టం', బడిపిల్లలకు 'మధ్యాహ్న భోజన పథకం', ఆహార ధాన్యాల సరఫరాకు సంబంధించి 'ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' వంటి వివిధ పథకాలు, కార్యక్రమాలు, చర్యల ద్వారా ఆకలిని తగ్గించి, పోషకాహన్ని పెంచే ప్రయత్నాలు చేస్తున్నామని ప్రభుత్వం చేస్తున్న ప్రచారార్భటంలోని డొల్లతనాన్ని ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశ స్థానం బహిర్గతం చేసింది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ లెక్కించడానికి ప్రాతిపదికగా ఉన్న నాలుగు సూచికలు ఐక్యరాజ్య సమితి లక్ష్యాలుగా పెట్టుకున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగమనేది విస్మరించలేము. ఈ నేపథ్యంలోనే అభివృద్ధి సాధించకుండా, 'ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో (ఎస్‌డిజి)' భాగమైన 2030 నాటికి ఆకలిలేని ప్రపంచాన్ని నిర్మించాలనే లక్ష్యం ఆచరణసాధ్యం కాదని నివేదిక అభిప్రాయపడింది.

గ్లోబల్ హంగర్ ఇండెక్స్ వివిధ కీలక సూచికలు భారతదేశంలో నెలకొనిఉన్న ఆకలి తీవ్రతను, పోషకాహారలేమిని, పొంచిఉన్న సవాళ్లను పాలకుల ముందుంచాయి. దేశ ప్రజల భవిష్యత్ ప్రయోజనాల దృష్ట్యా పోషకాహార లోపాన్ని సరిచేసుకోవాల్సిన ఆవశ్యకతను ఈ నివేదిక నిక్కచ్చిగా వెలియబుచ్చింది. సామాజిక-ఆర్థిక తారతమ్యాలు, ప్రబలిపోయిన పేదరికం, తగినంత ఆహారాన్ని తీసుకోలేకపోవడం, పోషక విలువలున్న ఆహార వస్తువుల ధరలు అందుబాటులో లేకపోవడం, ఆరోగ్య పరిరక్షణా కొరత, లోపభూయిష్టమైన వ్యవసాయ పద్ధతులు, ఆహార పంపిణీ విధానాలు, లింగ అసమానతలు వంటివి ప్రపంచ ఆకలి సూచిలో భారతదేశ స్థానాన్ని దిగజార్చడానికి తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఈ అంశాలని పాలకులు గమనించి, సార్వజనీయ ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఆర్థిక అసమానతలను తగ్గించే ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించి దేశ ప్రజల భవిష్యత్‌కు భద్రత కల్పించాల్సిన సమయమిది.

ఆన్‌లైన్ గేమింగ్-కరిగిపోతున్న పిల్లల భవితవ్యం



మేకిరి దామోదర్
9573666650

విస్తృత రూపంలో సమాజమే, సూక్ష్మ రూపంలో బడి. ఆ తరగతి గది రేపటి పరిపూర్ణ వ్యక్తిత్వం గల పౌర సమాజాన్ని తయారుచేసే విజ్ఞాన కర్మాగారం. ఇల్లు-బడి బాల్యానికి బంగారు భవిష్యత్తును అందించే కేంద్రాలు. ఇంట్లో, బడిలో, సమాజంలో ఆధునిక పరికరాల వినియోగం విపరీతంగా పెరిగిపోయి ంది.నూతన టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. సద్వినియోగం చేసుకోవచ్చు, దుర్వి నియోగ మూ చేసుకోవచ్చు. పిల్లలు మొబైల్ ఫోన్ల మాయ(వల)లో పడి తమ విలువైన కాలాన్ని, సహజ మేధస్సుతో ఆలోచించే స్పృహను కోల్పోతున్నారు. అంతేకాదు? యువత, పెద్దలు, ఆడ, మగ, వృద్ధులు అనే తేడా లేకుండా ఈ ఆధునిక పరికరాల వినియోగం శృతిమించడంతో సమాజం మానసిక సమస్యలతో అనారోగ్యం పాలవుతుంది. పిల్లలను చదువు నుండి, కుటుంబం నుండి దూరం చేస్తున్న ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌ల ను కట్టడి చేయకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

పిల్లలు ఫోన్ ఉంటేనే అన్నం తింటారు. చెప్పిన మాట వింటారు, దాన్ని చూస్తూనే తింటారు. ఆన్‌లైన్‌లో ఆడుతూనే గంటలకు గంటలు గడిపేస్తుంటారు. లేదంటే ఏడుస్తుంటారు. చివరికి ఆ ఏడుపు ఆపాలన్నా ఫోను తోనే సాధ్యం అనే స్థాయికి నేటి పిల్లల పరిస్థితి దిగజారింది. చదువుతో సంబంధం లేకుండా అందరూ దీని బాధ్యులే, బాధితులే. ఈ ఆధునిక మానసిక దౌర్భాగ్యంతో పిల్లలు సహజ మేధస్సుతో ఆలోచించే సృజనాత్మకత, వినూత్నత కోల్పోతున్నారు. పిల్లలు ఫోనే లోకం, ఆన్‌లైన్ ఆట లేనిదే పూట గడువదనేలా తయారయ్యారు. ఆన్‌లైన్ గేములలో తుపాకులతో కాల్చేసే విధ్వంసకరమైనవే ఎక్కువగా ఉంటున్నాయి. కొట్టుకోవడం, చంపుకోవడమే లక్ష్యంగా ఉండే ఆటల మూలంగా ఆ చిన్నారుల మనసులు ప్రతికూల ఆలోచనలతో నిండిపోతున్నాయి. పబ్జీ, బ్లూవెల్ లాంటివైతే మరణాలకు కారణమవుతున్నాయి. ఇలా ఫోన్లకు బానిసైన పిల్లల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నది. మితి మీరి ఫోన్లకు బానిసలైన వారంతా పెద్దయ్యాక బెట్టింగు, ఇతర చెడు వ్యసనాలకు లోనవుతారనే నిపుణుల సూచనలను తల్లిదండ్రులు, ప్రభుత్వాలు పట్టించుకొని తక్షణమే ఆన్‌లైన్ గేమింగ్ వ్యవహారానికి అడ్డుకట్ట వేయాలి. దీనికి బానిసలుగా పిల్లలు, యువకులు, పెద్దలు, వఅద్ధులు అనే తేడా లేకుండా ఫోన్ వినియోగం పెరిగిపోయి సమాజం గాడి తప్పుతుంది. చదువుకున్న(రాని)వారు అనే తేడా లేనే లేదు, ఫోన్ అతిగా వాడడం వల్ల జరిగే దుష్పరిణామాలు తెలిసిన వారు కూడా ఈ ఆన్‌లైన్ గేమింగ్ వేధింపుల నుండి పిల్లల్ని దూరం చేయలేకపోతున్నారు. విపరీతమైన ఫోన్ వాడకంతో రేపటి భావితరం "మానసిక, శారీరక సమస్యల పౌర సమాజం"గా పరిణమించనుంది. ఇలా పిల్లల భవిష్యత్తుతో ఆటాడేస్తున్న ఆన్లైన్ గేమ్ లను సమూలంగా కట్టడి చేయాలి.

ఆన్‌లైన్‌గేమింగ్..చిన్నారులపై ప్రభావం

చైనా, జపాన్ లాంటి దేశాల్లో ఆన్‌లైన్ గేమింగ్ వ్యవస్థను నిషేధించినట్లు తెలుస్తోంది. పలుదేశాలు ఈ వ్యసనాన్ని చాలా తీవ్రంగా తీసుకున్నాయి. ఈ ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణపై అధ్యయనం చేసి పొంచి ఉన్న తీవ్ర పరిణామాల నుండి బయటపడేయటానికి మన దేశం లోని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఒక అధికారిక కమిటీని నియమించింది. ఈ కమిటీలో సభ్యులుగా ప్రభుత్వ విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్, ప్రొఫెసర్లను నియమించింది. తమిళనాడు ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ (టీఎన్‌ఓజీఏ)ఈ సంస్థ దీని ప్రభావం ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని రాష్ట్రాన్ని అప్రమత్తం చేసింది, కట్టడి చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. దీని ద్వారా ఆన్‌లైన్ గేమింగ్ మీద నియంత్రణ కోసం పోరాడు తోంది. తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంస్థ చేసిన ప్రాథమిక సర్వేలో పలు కీలక విషయాలు వెల్లడయ్యాయి. పాఠశాలలు, కళాశాలలలో చదువుతున్న దాదాపు రెండు లక్షల మంది విద్యార్థులపై సర్వే నిర్వహించగా వారిలో 20శాతం మంది ఆన్‌లైన్ గేములకు, సామాజిక మాధ్యమాలకు బానిసలు అయ్యారని తెలిసింది. సర్వే కోసం పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు, యాజమాన్యాల సహకారం తీసుకున్నారు.ఆన్‌లైన్ గేములకు ఎక్కువగా ఆడుతున్న విద్యార్థులకు కంటిచూపు సమస్యలు వచ్చాయని 67 శాతం మంది ఉపాధ్యాయు (అధ్యాపకు)లు చెప్పారు. బానిసైన విద్యార్థుల తెలివితేటలు, చురుగ్గా ఆలోచించడం బాగా తగ్గిందని 74 శాతం మంది వెల్లడించారు. ఈ అధికారులు నిర్వహించిన సర్వేలో ప్రత్యేకించి ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం విద్యార్థుల్లో గత ఐదేండ్లుగా ఎక్కువవుతూ వస్తోందని, ఎలక్ట్రానిక్ పరికరాలు అందుబాటులో లేకపోతే పిల్లల మానసిక స్థితి ఆందోళనకరంగా మారుతుందని చెబుతున్నారు.



చైనా, జపాన్ లాంటి దేశాల్లో ఆన్‌లైన్ గేమింగ్ వ్యవస్థను నిషేధించినట్లు తెలుస్తోంది. పలుదేశాలు ఈ వ్యసనాన్ని చాలా తీవ్రంగా తీసుకు న్నాయి. ఈ ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణపై అధ్యయనం చేసి పొంచి ఉన్న తీవ్ర పరిణామాల నుండి బయటపడేయటానికి మన దేశం లోని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఒక అధికారిక కమిటీని నియమించింది. ఈ కమిటీలో సభ్యులుగా ప్రభుత్వ విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్, ప్రొఫె సర్లను నియమించింది. తమిళనాడు ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ (టీఎన్‌ఓజీఏ)ఈ సంస్థ దీని ప్రభావం ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని రాష్ట్రాన్ని అప్రమత్తం చేసింది, కట్టడి చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. దీని ద్వారా ఆన్‌లైన్ గేమింగ్ మీద నియంత్రణ కోసం పోరాడుతోంది.

తల్లిదండ్రులు, ప్రభుత్వాల బాధ్యత

విద్యార్థుల్లో ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం విచ్చల విడిగా పెరిగిపోతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. వారి ప్రస్తుత దినచర్యపై ప్రత్యేక పర్యవేక్షణ చాలా అవసరం. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు వచ్చేందుకు ప్రత్యేక ప్రణాళిక చేపట్టాల్సి వుంది. ఆన్‌లైన్ గేమింగ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టి బాధ్యతతో వెంటనే నియంత్రణా చర్యలు చేపట్టాలి. ఆధునిక టెక్నాలజీ పిల్లలకు ఉపయోగపడే విధంగా విద్యార్థుల్లో వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో చారిత్రక, పౌరాణిక అంశాలలో నైపుణ్యాలు పెంచు కోవడానికి కొన్ని గేమింగ్ సంస్థలు అందుబాటులో ఉన్నాయి. కానీ వాటిని పిల్లలు చూడరు. తల్లిదండ్రులకు అది చూపించేంత సమయం లేదు. అంతే కాదు! పిల్లల మానసిక శక్తి సామర్థ్యాలు పెంచే ఆటలు ఎన్నో ఉన్నాయి. వాటిని ఆడరు, అలాంటి వాటిని ఈ సమాజం ఎన్నడో మర్చిపోయి కాలగర్భంలో కలిపేశారు. సోషల్ మీడియాలో అంతా ఫేక్.. డీప్ ఫేక్.. ఏఐ ఫేక్.. ఆఆన్‌లైన్ ఫేకులదే పెత్తనం అవడంతో దేన్ని విశ్వసించాలో తెలియడం లేదు. "నిజాన్ని, జ్ఞానాన్ని కమ్మేసిన ఫేకుల"ను వ్యాపారం చేసుకునే విధానాలతో, ఫోన్లో ఎన్నో ఆన్‌లైన్ గేమింగుల ద్వారా భావోద్వేగాలకు గురి చేసే ఫేక్ వ్యవహారాలతో రేపటి తరం నష్టపోయినాక ఏడ్చినా లాభలేదు. "చనిపోయిన మొక్క లకు నీళ్ల పోసినట్లే రేపటి తరం భవిష్యత్తు".విద్యార్థుల మానసిక భద్రత, భరోసా కోసం తల్లిదండ్రులు, ప్రభుత్వాలు సామాజిక, మానసిక నిపుణుల సూచనలు పాటిస్తూ రేపటి ఆరోగ్యవంతమైన సమాజం కోసం నేటి పిల్లల్లో ఆన్‌లైన్ గేమింగ్, ఫేక్ వ్యవహారాన్ని కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.